అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 12-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 253 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



వివరాలు 14లో..

నియంతృత్వ పాలన కోసమే

జమిలి జపం



ప్రతిపక్షాల ఐక్యతతో నరేంద్ర మోడీకి ఓటమి భయం..

కులాన్ని సంహరిస్తేనే దేశానికి ప్రగతి

- నిజాంను కూల్చిన స్ఫూర్తితో బీజేపీని గద్దెదించేలా పోరాటాలు
- బీఆర్ఎస్‌కు, సాయుధ పోరాటానికి ఏం సంబంధం? : సంగారెడ్డిలో సాయుధ పోరాట వారోత్సవ సభలో బీవీ రాఘవులు




సంగారెడ్డిలోని వీరనారి ఐలమ్మ విగ్రహం నుంచి పీఎస్ఆర్ గార్డెన్ వరకు జరిగిన భారీ ర్యాలీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఒకేసారి ఎన్నికలంటే అధ్యక్షతరహా పాలన తీసుకురావడమేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. స్థానిక సంస్థలు, రాష్ట్రాల అధికారాలను హరించి ఒకే వ్యక్తి నియంతృత్వ పాలన సాగించడం కోసమే మోడీ జమిలి జపం చేస్తున్నారని విమర్శించారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సభకు రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీరనారి ఐలమ్మ విగ్రహం నుంచి పీఎస్ఆర్ గార్డెన్ ...5లో

కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు



వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని రాఘవులు పునరుద్ఘాటించారు. నిజాం ప్రభువు లొంగిపోయినందునే సెప్టెంబర్ 17కు ప్రాధాన్యత సంతరించుకున్నదన్నారు. నిజాం లొంగిపోయేలా పోరాడిన కమ్యూనిస్టుల త్యాగాలను గుర్తించకుండా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు తామేదో చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నాయన్నారు. వెట్టి నుంచి ప్రజలను విముక్తి చేసి భూముల్ని పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. దేశ సమైక్యతా దినంగా పాటిస్తున్నామని చెబుతున్న బీఆర్ఎస్ లేదా ఆ నాటి టీఆర్ఎస్‌కు సాయుధ పోరాటానికి ఏం సంబంధముందని ప్రశ్నించారు. వెట్టికి వ్యతిరేకంగా మట్టి మనుషులు సాగించిన వీరోచితమైన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బీజేపీ మతం రంగు పులుముతుందన్నారు. నిజాం ముస్లింగా ప్రజలంతా హిందువులుగా చెబుతూ రాజకీయ లబ్దిపొందేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

ఆకలి-అసమానతలకు పరిష్కారమేది?

కీలక అంశాల ప్రస్తావనే లేదు

- జీ-20 డిక్లరేషన్‌పై ప్రశ్నించిన పౌర సమాజం




న్యూఢిల్లీ : జీ-20 సదస్సు ఆమోదించిన డిక్లరేషన్‌లో కీలకమైన అంతర్జాతీయ అంశాల ప్రస్తావన లేకపోవడాన్ని పౌర సమాజ సంస్థలు ప్రశ్నించాయి. తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఆర్థిక అసమానతలు, వాతావరణ సంక్షోభం, ఆకలి, ఇంధనం వంటి కీలక సమస్యల పరిష్కారానికి సదస్సు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించలేకపోయిందని పెదవి విరిచాయి. పౌర సమాజ సంస్థలు, వాటి నేతలతో కూడిన అంతర్జాతీయ సంస్థ 'పీపుల్స్ 20' ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పౌర సమాజం ప్రాధాన్యత తగ్గిపోవడం, ప్రపంచంలోని పలు దేశాలలో ప్రజాస్వామ్యం బలహీనపడడంపై ఆ ప్రకటన ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా, రష్యా, తుర్కియే, మెక్సికో, భారత్ సహా పలు జీ-20 దేశాలలో ...13లో

జైల్లో బాబుకు ప్రాణహాని

ఏసీబీ కోర్టులో సిద్దార్థ లూద్రా వాదనలు

- పూర్తి భద్రత కల్పించామన్న ఏపీజీ సుధాకర్‌రెడ్డి
- తీర్పు నేటికి వాయిదా
- పిటి వారెంటు కోసం పిటీషన్ వేసిన సీఐడీ



అమరావతి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రాణహాని ఉందని అందువల్ల ఆయన్ను హౌస్ రిమాండ్‌కు పంపాలని న్యాయవాది సిద్దార్థ లూథ్రా సోమవారం ఏసీబీ కోర్టులో వాదించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ఆయన చంద్రబాబు తరపున వాదిస్తున్న విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో కరుడుగట్టిన నేరస్తులు, ఆయుధాలు వినియోగించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న విషయాన్ని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. నవలఖా కేసులో ...5లో



బీజేపీ ఓ విషసర్పం

ఉదయనిధి స్టాలిన్ విమర్శలు

చెన్నై : సనాతన ధర్మంపై ఇటీవల వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈసారి బీజేపీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీని ఆయన విష సర్పంతో పోల్చారు. తమిళనాడులోని నైవేలీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష అన్నాడీఎంకే పాములకు ఆశ్రయమిచ్చే పార్టీగా మారిందని తెలిపారు. డీఎంకే నేత మాజీ కేంద్ర మంత్రి ఎ.రాజా ఇటీవల మాట్లాడుతూ ప్రధాని మోడీని పాముగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో ఉదయనిధి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

"విష సర్పం మీ ఇంట్లోకి వస్తే.. దానిని తీసి బయట పడేస్తే కుదరదు. అది మీ ఇంటి చుట్టుపక్కల చెత్తలో దాక్కొంటుంది. ఆ చెత్తను తీసేసే వరకూ అది మీ ఇంట్లోకి వస్తూనే ఉంటుంది. ఈ సన్నివేశంతో ప్రస్తుత పరిస్థితి పోలిస్తే.. తమిళనాడు మన ఇల్లు. బీజేపీ ఓ విష సర్పం. అన్నాడీఎంకే మన ఇంటి వద్ద ఉన్న చెత్తలాంటిది. మనం చెత్తను తీసే వరకు విష సర్పం దూరం కాదు. బీజేపీని నుంచి విముక్తి పొందాలంటే.. అన్నాడీఎంకేను తొలగించాలి" అని ఉదయనిధి వ్యాఖ్యానించారు.

ఇటీవల 'తమిళనాడు ప్రొగ్రెసివ్ రైటర్స్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' నిర్వహించిన 'సనాతన నిర్మూలన' అనే సదస్సులో ఉదయనిధి మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి

ప్రభుత్వం స్పందించకుంటే 25 నుంచి నిరవధిక సమ్మె : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)


- కోఠి కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా
- హైదరాబాద్‌కు వస్తుండగా జిల్లాల్లో ఆశాల అరెస్టులు



హైదరాబాద్ కోఠి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆశా వర్కర్ల ధర్నా...

నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ కోఠి వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అన్ని జిల్లాల నుంచి వేలాదిగా ఆశ వర్కర్లు తరలివచ్చారు. హైదరాబాద్‌కు వస్తున్న ఆశా వర్కర్లను జిల్లాల్లో పలుచోట్ల పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేశారు. కోఠి కమిషనర్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరూ రోగులను సర్వే చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్, అన్ని రకాల జబ్బులు గుర్తించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను అందిస్తున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడూ జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజాసేవ చేస్తున్నారని చెప్పారు. కరోనా నియంత్రణలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఇన్ని పనులు చేస్తున్న ఆశా వర్కర్లకు రూ. 9,750 పారితోషికం మాత్రమే వస్తోందని, ప్రభుత్వం వేతనం పెంచకపోవడం అన్యాయం అన్నారు. పని భారం పెరిగిందని, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ...13లో



85 శాతం మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే

- రాష్ట్ర విభజనకు ముందున్న కాలేజీల్లోనే ఏపీ విద్యార్థులకు స్థానికత : హైకోర్టు కీలక తీర్పు

వివరాలు 5లో..

ముందస్తు అనుమతి అక్కర్లేదు

- సీనియర్ అధికారులను సీబీఐ నేరుగా విచారించొచ్చు
- 2014 నాటి తీర్పును పునరుద్ఘాటించిన సుప్రీం

వివరాలు 13లో..



పూర్తి కాని ప్రాజెక్టును ప్రారంభిస్తారా?

ఒక్క పంపును ప్రారంభిస్తే ప్రాజెక్టు పూర్తయినట్టా?



- సీఎం కేసీఆర్‌కు రేవంత్ ప్రశ్న
- బీఆర్ఎస్ పాలనలో పాలమూరు వలసలు ఆగలేదు
- కాంగ్రెస్‌లో చేరిన సీతా దయాకర్‌రెడ్డి
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ నేత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాకుండానే ఆ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ ప్రాజెక్టుకు ఉన్న 31 పంపుల్లో కేవలం ఒక్క పంపుతోనే ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారని ...13లో

పౌర సమాజానికి చోటేది ?

విషం చిమ్ముతున్న పాలకులు

- పెరిగిన నిర్బంధాలు
- అన్ని రంగాలదీ అదే తీరు



రాజకీయ, సామాజిక విషయాలలో వ్యక్తులు, పౌర సమాజ సంఘాలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. ప్రభుత్వాలు జవాబుదారీతనంతో, పారదర్శకతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించడంలో ముఖ్య భూమిక నిర్వహిస్తాయి. ముఖ్యంగా మానవ హక్కులకు విఘాతం ఏర్పడినప్పుడు, సమాజంలో అవినీతి జరిగినప్పుడు పౌర సమాజం గళం విప్పి ప్రభుత్వాలను నిద్ర లేపుతుంది. సామాజిక సంస్థలు కానీ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు కానీ, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించే సంఘాలు కానీ చట్ట పరిధిలోనే బాధ్యతాయుతంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. అయితే ఇటీవలి కాలంలో పౌర సమాజం గొంతు విప్పి రాజకీయ, ఆర్థిక, పర్యావరణ ప్రాధాన్యత కలిగిన విషయాలపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే పాలకులు సహించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిపై విషం చిమ్మడం, నేరాలు ఆపాదించడం పరిపాటిగా మారింది.

న్యూఢిల్లీ : దేశంలోని మధ్యతరగతి హిందూ కుటుంబాలపై హిందూత్వ రాజకీయాల ప్రభావం అధికంగా ఉంది. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ వంటి హిందూత్వ సంస్థల ప్రచారమే దీనికి కారణం. ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు, హిందూత్వ భావనలను గౌరవించేందుకు దేశానికి బలమైన నాయకుడు అవసరమని ఆ సంస్థలు ఊదరగొడుతున్నాయి. 2021లో హరిద్వార్‌లో జరిగిన ధర్మసంసద్‌లో అనేకమంది సాధువులు రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశారు. మైనారిటీలపై హింసకు పాల్పడాలంటూ పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీని హతమార్చిన నాథూరాం గాడ్సేను పొగడ్తలతో ముంచెత్తారు. దీనికి ప్రతిగా 2022 మేలో కేరళలోని అలప్పుజాలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఓ బాలుడు హిందువులు, క్రైస్తవులకు ...13లో

అటవీ అమర వీరుల త్యాగాలు మరువొద్దు

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ - ధూల్ పేట్

అటవీ అమరవీరుల త్యాగాలను మరువొద్దని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కు స్మారక చిహ్నం వద్ద అధికారులు, సిబ్బందితో కలిసి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక ముఠాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీరమరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విధి నిర్వ హణలో 1984 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 22 మంది తమ ప్రాణాంకోల్పోవడం చాలా బాధాకర మన్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీనిచ్చారు. అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు.

భద్రాది - కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు గతేడాది నవంబర్ 22న గుత్తికోయల చేతిలో ప్రాణం కోల్పోయారని, అడవుల సంరక్షణ కోసం ఆయన చేసిన త్యాగం వెలకట్టలేనిదని అన్నారు.ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడిందని, సీఎం కేసీ ఆర్ మానవతా దృక్పథంతో శ్రీనివాసరావు సతీమణి నాలగక్ష్మికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం కల్పిం చారని తెలిపారు. అంతేకాకుండా రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ఖమ్మం జిల్లాలో 500 గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి వివరిం చారు. 2022- 2023లో అటవీ రక్షణలో భాగం గా అటవీ అధికారులు 79,735 కేసులను నమోదు చేసి, రూ.43.56 కోట్ల జరిమానా విధించారని తెలి పారు. రూ.7.31 కోట్ల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నారని, 15,122 వాహనాలను జప్తు చేశారన్నారు. 12,019 అటవీ భూ ఆక్రమణ కేసులు నమోదు చేశారని వివరించారు. అంతేకా కుండా అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన అగంత కులపై 26,408 కేసులు నమోదు చేసి రూ.57.81 కోట్ల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నారన్నారు. అటవీ శాఖను బలోపేతం చేయడానికి గతేడాది 1393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల (ఎఫ్‌బీఓస్), 14 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల (ఎఫ్ఆర్ఓస్) ఉద్యోగాల నియామకాలకు ప్రభుత్వం అనుమతినిచ్చిందని.. భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

శాఖాహార జంతువుల కోసం 1806.11 హెక్టార్ల విస్తీర్ణంలో సహజ గడ్డి క్షేత్రాలను అభివృద్ధి చేయడం, వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సోలార్ పంప్ సెట్లు, సాసర్ పిట్స్ ఏర్పాటు చేశా మన్నారు. భవిష్యత్‌లో అటవీ భూములు అన్య క్రాంతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్. ఎం.డోబ్రియాల్, వన్యప్రాణుల ముఖ్య సంరక్షణ అధికారి లోకేష్ జైస్వాల్, వీసీ అండ్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జూపార్క్ డైరెక్టర్ ప్రసాద్, క్యురేటర్ సునీల్ హీరమత్, రిటైర్డ్ పీసీసీఎఫ్ పీకే ఝా, మనోరంజన్ భాంజ, మునీంద్రా, రిటైర్డ్ ఐఎఫ్ఎస్‌లు సునీల్ కుమార్ గుప్తా, బుచ్చి రామిరెడ్డి పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను గుంజుకుంటోంది

మాజీ ఎంపీ వీహెచ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పేదల భూములు, అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం గుంజుకుని వెంచర్లకు అమ్మేస్తున్నదని మాజీ ఎంపీ వి హనుమంతరావు విమర్శించారు. అదే తరహాలో ఖానాపూర్, కొకాపేట భూములను అమ్మిందన్నారు. ఇందిరా గాంధీ హయాంలో ఇచ్చిన అసైన్డ్ భూములను విక్రయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ, కేసీఆర్ ప్రభుత్వం భూస్వాములకు, కార్పొరేట్లకు ఉపయోగపడుతుందన్నారు. పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎకరాకు రూ. 100 కోట్లకు అమ్మే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్తులో పేదలు ఫుట్‌పాత్ మీద పడుకునే పరిస్థితి వస్తుందన్నారు. పేద వాడికి ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ కాంగ్రెస్ ఉంటుందని చెప్పారు. సీఎం కేసీఆర్ మల్టీనేషనల్ కంపెనీకి రెండువేల ఎకరాల అసైన్డ్ భూములను అప్పజెప్పిందన్నారు. హైదరాబాద్ చుట్టూ పక్కల ఉన్నా విలువైన భూముల్లో 300 గజాలు ఇస్తున్నా మని చెప్పి ఇతర భూములను వేల కోట్లకు అమ్ముకున్నారని విమర్శించారు.

ఓటర్లను ప్రభావితం చేసేందుకే ఓటర్ ఐడీ కార్డు


గృహలక్ష్మి, దళితబంధు పథకాల్లో లబ్ధిదార్ల ఎంపిక కోసం ఓటర్ గుర్తింపు కార్డు సమర్పించా లంటూ ఒత్తిడి పెడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ తెలిపారు. ఆ కార్డు ఇవ్వకపోతే వారి పేర్లు హోల్డ్‌లో పెడతామంటూ బెదిరిస్తున్నారని విమర్శించారు.

సాయుధ పోరాట రణభేరి ప్రభాకర్‌రావు అనభేరి

- పుట్టింది భూస్వామ్య కుటుంబంలో..
- నిలబడింది పేదల పక్షాన
- నిజాం కాల్పుల్లో నేలకొరిగిన ప్రభాకర్‌రావు
- ఆయనతోపాటే మరో 12 మంది వీరులు
- సజీవ సాక్ష్యాలుగా మహమ్మదాపూర్ గుట్టల్లో స్మారకస్థూపాలు
- 75ఏండ్లు దాటినా చరిత్ర మరువని వారి పోరాటపటిమ







నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

నిజాం నిరంకుశ పాలన అంతమొందించేందుకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్రగా కరీంనగర్ జిల్లా ప్రస్థానం నిలిచింది. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరులో ఇక్కడి సాయుధ బిడ్డల పోరు సదాస్మరనీయం. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లిలో భూస్వామ్య కుటుంబంలో పుట్టిన అనభేరి ప్రభాకర్‌రావు పేదల పక్షాన నిలబడి సాయుధపోరులో పాలుపంచుకున్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం సాగించి ఆ నిరంకుశపాలన తూటాలకు నేలకొరిగారు. ఆయనతోపాటు వీరమరణం పొందిన 12మంది దళ సభ్యులు రక్తం చిందించిన మహమ్మదాపూర్ గుట్ట వారి ప్రాణత్యాగానికి నేటికీ సజీవ సాక్ష్యంగా నిలిచింది. అక్కడే నిర్మించిన వారి స్మారక స్థూపాలు, చిహ్నాలు అప్పటి రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరించిన ధీరగాథను కండ్ల ముందు ఉంచుతున్నాయి. 75ఏండ్లు దాటినా ఇప్పటికీ వారి అమరత్వం మనస్సుల్లో మెదులుతూనే ఉంది. అనభేరి ప్రభాకర్‌రావు 1910 ఆగస్టు 15న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లిలోని దేశ్‌ముఖ్ కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు- రాధాబాయి దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం కరీంనగర్, మచిలీపట్నంలో, హైస్కూల్ విద్యాభ్యాసం హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లో, ఉన్నత విద్యాభ్యాసం కాశీపీఠంలో పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. 27ఏండ్ల వయసులో సరళాదేవితో వివాహమైంది. నిజాం కళాశాలలో చదువుతున్నప్పుడు స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ మరియు సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలం నుంచి ప్రేరణ పొందారు. అనభేరి మొదటగా విద్యావ్యాప్తికి, ఉపాధి అవకాశాల కోసం కృషి చేశారు. గ్రామాల్లో గ్రెయిన్ బ్యాంకులను స్థాపించి రైతులకు ధాన్యం అందించారు. సహకార సంఘాలను స్థాపించి చేనేత కార్మికులకు నూలు సరఫరా చేశారు.

1942 నుంచి 1946 వరకు రాష్ట్ర చేనేత సంఘానికి అధ్యక్షుడిగా పని చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి సాయుధ దళానికి నాయకత్వం వహించారు.

బద్దం ఎల్లారెడ్డి పిలుపుతో..

సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభకు నాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి పిలుపుతో ప్రభాకర్‌రావు నేతృత్వంలో దళం ఏర్పాటు చేసి పోరాడారు. అనేక గ్రామాల్లో భూస్వాములు, జమీందార్లు అక్రమంగా ఉంచుకున్న పేదల భూమి పట్టా పత్రాలను ప్రభాకర్‌రావు నేతృత్వంలోని దళం దహనం చేసింది. దాదాపు 40 గ్రామాల్లో పటేల్, పట్వారీల దగ్గర ఉన్న రికార్డులను తగులబెట్టింది. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా, అప్పటి హైదరాబాద్ నిజాం ప్రయివేటు సైన్యమైన రజాకార్లను కూడా దళం ఎదుర్కొంది. తెలంగాణ భగత్‌సింగ్‌లా ప్రజల హృదయాల్లో స్థానం పొందిన అనభేరిని అంతమొందించాలని నిర్ణయించుకున్న నిజాం సంస్థానం.. ఆయన్ను పట్టించిన వారికి అప్పట్లోనే రూ.50వేల బహుమతి ఇస్తామని ప్రకటించింది.

నిజాం కాల్పుల్లో రక్తం చిందించి..

ప్రభాకర్‌రావుకు నిజాం సంస్థానం ఇవ్వజూపిన తాలుక్దార్ కలెక్టర్ పదవిని తిరస్కరించి పేదల పక్షాన నిలబడ్డారు. ఒక దశలో ప్రభాకర్‌రావుపై నిజాం 'నాజర్ బంద్' ఆదేశాలూ జారీ చేశారు. దీంతో సాయుధవీరులను అంతమొందించేందుకు నిశ్చయించుకున్న నిజాం సంస్థానం అనభేరిని, ఆయన దళాన్ని మట్టుబెట్టేందుకు కాచుకుంది. ఆయనను నీడలా వెంటాడి హుస్నాబాద్ సమీపంలోని మహమ్మదాపూర్ గుట్టల్లో ఉన్నట్టు తెలుసుకుంది. పక్కా సమాచారం మేరకు 1948 మార్చి 14న హుస్నాబాద్ సమీపంలోని మహ్మదాపూర్ గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటున్న అనభేరి దళంపై నిజాం పోలీసులు, రజాకార్లు ఒక్కసారిగా కాల్పులకు దిగారు. ఇరువురి మధ్య భీకర యుద్ధమే జరిగింది. ఆ ఎదురు కాల్పుల్లో ప్రభాకర్‌రావు సహా ఆయన సహచరులు సింగిరెడ్డి భూపతిరెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, బి.దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పొరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారాం, సిక్కుడు సాయిలు, రొండ్ల మాధవరెడ్డి వీర మరణం పొందారు. ఇద్దరు దళ సభ్యులు తప్పించుకున్నారు. వీరు అసువులు బాసిన చోటనే భారత కమ్యూనిస్టు పార్టీ స్మారక భవనాన్ని, స్థూపాన్ని నిర్మించింది. ఇది జరిగి నేటికి 75 ఏండ్లు గడిచింది. ఆ పోరాట ఘట్టాన్ని, వారి వీరత్వాన్ని ఆ స్థూపం చాటిచెబుతోంది.

ఇండ్ల స్థలాల పోరాటం ప్రారంభం

- పేదలకు భూపంపిణీలో సీఎం విఫలం : మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డాక్టర్ మిడియం బాబురావు



నవతెలంగాణ-వాజేడు

ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాల పోరాటాన్ని మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డాక్టర్ మిడియం బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, మచ్చ వెంకటేశ్వర్లు సోమవారం జెండా పాతి ప్రారంభించారు. అనంతరం వాజేడు మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి అధ్యక్షతన జరిగిన సభలో బాబురావు మాట్లాడుతూ.. గడిచిన 70 ఏండ్లుగా వారి సమస్యలపై గిరిజనులు, గిరిజనేతరులు పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి న్యాయం చేసిన పరిస్థితి లేదన్నారు. పెట్టుబడిదారులకు భూములు ఉచితంగా ఇస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ పేదలకు ఇస్తామన్న సీఎం కేసీఆర్.. అమలులో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎర్రజెండా నాయకత్వంలో అనేక దఫాలుగా ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలు ఐక్యమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వాజేడు మండలంలో అనేకమంది ప్రజలు ఇండ్లు లేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇండ్ల సాధనకు రెండు దఫాలు ఉద్యమాలు నిర్వహించామని, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలిచ్చినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో మండపాక సెంటర్‌లోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 11లో 25 గ్రామాల నుంచి 600 మంది పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలివ్వాలని, లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, గ్యానం వాసు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ టవర్ వద్ద దీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ను అక్రమంగా అరెస్టు చేసిన కారణంగా ఐటీడీపి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లోని సైబర్ టవర్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు ఆయనకు మద్దతు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగాన్ని నెలకొల్పి దేశ,విదేశాల్లో లక్షలాది మందికి ఉపాధి కల్పించి చంద్రబాబుపై తప్పుడు కేసు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ఐటీ రంగంలో విద్యార్థులు, ఉద్యోగులు ఆర్థికంగా బలోపేతం కావడానికి, ముందు చూపుతో..భరోసాను మాజీ సీఎం చంద్రబాబు కల్పించారని గుర్తు చేశారు.

కమ్యూనిస్టుల పోరాటం వల్లే ప్రజలకు హక్కులు

- కష్టజీవుల రక్తంతో ఏర్పడ్డదే ఎర్రజెండా
- పీడితప్రజల పోరాట గొంతుక గద్దర్ : కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు
- ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ



నావతెలంగాణ- రామన్నపేట

కమ్యూనిస్టుల పోరాటాలు లేకుండా ప్రజలకు హక్కులు సాధించబడలేదని, ప్రతి సంస్కరణ కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం గద్దర్ సంస్మరణ సభ, ఆటా-పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రజెండా ఒకరు ఏర్పాటు చేసింది కాదని కష్టజీవుల రక్తంతో తడిచి ఏర్పడిందన్నారు. గద్దర్ పీడిత ప్రజల పోరాట గొంతుక అని అన్నారు. తెలుగు ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో గద్దర్‌ది అద్వితీయమైన పాత్ర అని తెలిపారు. ప్రజా సమస్యలను పాటగా మలిచి పాలకులకు వెన్నులో వనుకు పుట్టించిన ప్రజా గాయకుడు గద్దర్ అని చెప్పారు. సామ్రాజ్యవాద దోపిడిని, మతోన్మాదాన్ని, అంటరానితనాన్ని, ప్రజావ్యతిరేక విధానాలపై వేలాది పాటలు రాసి, పాడి ప్రజలను చైతన్యం చేశారన్నారు.

కళాప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజల పక్షాన నిలవడమే గద్దర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు.భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహోజ్వల పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని.. కానీ నేడు మతం పేరుతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బండెనక బండి కట్టి అంటూ దొరలు, జాగిర్దార్లు, రజాకార్ సైన్యాలకు ఎదురొడ్డి నిలిచిన చరిత్రను మతం పేరుతో వక్రీకరించే బీజేపీ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మూఢవిశ్వాసాలను మరింతగా పెంచారని, కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేకుండా ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలు, కష్టాలు మాట్లాడటం లేదని, వ్యక్తిగత దూషణలతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటేపాక శివ కుమార్, ఈర్లపల్లి ముత్యాలు, నాయకులు దేశపాక రవి, కందుల హనుమంతు, మద్దూరి బలయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు నకిరేకంటి సురేష్, గంటేపాక శ్రీకాంత్, పండుగ రాజమల్లు పాల్గొన్నారు.

కోతుల్ని ఎలా కట్టడి చేద్దాం?

- ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో పంటలను దెబ్బతీస్తున్న కోతులను తక్షణం కట్టడి చేయాలఁ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికఁమారి అధికారుల్ని ఆదేశించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆమె ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. దీఁకి సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకఁ సమావేశం ఁర్వహించినట్టు ఆమె తెలిపారు. కోతుల్ని పట్టుకొనే ఏజెన్సీల ప్రతిఁధుల కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీఁకి సంబంధించి ఁపుణుల కమిటీ సభ్యులు స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికల్ని సీఎస్‌కఁ అందచేశారు. ఆ ప్రణాళిక ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలఁ ఈ సందర్భంగా సీఎస్ అధికారుల్ని ఆదేశించారు.సమావేశంలో పీసీపీఎఫ్ ఆర్ఎమ్ డోబ్రియాల్, పురపాలకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కఁమార్, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ-ఆర్ఎస్ఎస్ హటావో..

అన్నార్తుల వ్యథలను తీర్చలేని దైన్యం

- ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం
- అటకెక్కిన ఉజ్వల పథకం
- మోడీ పాలనలో నిరుద్యోగ తాండవ
- ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా..అక్టోబర్ 5న ఛలో ఢిల్లీ
- విలేకర్ల సమావేశంలో ఎస్ పుణ్యవతి



దేశంలో మహిళల భద్రతకు ముప్పు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని మోడీ సర్కార్ మహిళా వ్యతిరేక దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నదని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నేత ఎస్ పుణ్యవతి విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్ష, ఉపాధ్యక్షులు అరుణజ్యోతి, కేఎన్ ఆశాలత, బి హైమావతితో కలిసి ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు.

'బీజేపీ ఆర్ఎస్ఎస్ హటావో..మహిళా బచావో' నినాదంతో వచ్చే నెల 5న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. వేలాది మంది మహిళలు దేశవ్యాప్తంగా మహార్యాలీకి ఇప్పటికే సమాయత్తమవుతున్నట్టు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దారుణమైన హింస కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రక్షణకోసం పనిచేయాల్సిన చట్టాలు ఉద్దేశ పూర్వకంగానే నీరుగార్చ బడుతున్నాయన్నారు.

పురుషాంకారంతో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడ్డవారు ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారనీ, వారికి చట్టాలు దాసోహమంటున్నాయని విమర్శించారు. రోజురోజుకు పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా పోరుబాట పట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందని తెలిపారు.

మరోపక్క దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నాయన్నారు. దారిద్ర్యాన్ని మరింత పెంచే విధంగా మోడీ పాలనా విధానాలున్నాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం అవుతున్నదని చెప్పారు. పేదలకు ఇవ్వాల్సిన సబ్సిడీల్లో కోతలు విధిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తామంటూ నమ్మబలికి..మాట తప్పారడని తెలిపారు. ఉజ్వల పథకానికి ఉద్వాసన పలికి..దాన్ని అటకెక్కించారని విమర్శించారు.

పెరుగుతున్న హింస..

రోజురోజుకు మహిళలపై హింస పెరుగుతున్నదన్నారు. సగటున రోజుకు 56 మంది లైంగిక దాడులకు గురవుతున్నారని తెలిపారు. ఇవన్నీ కేంద్రానికి పట్టకపోవటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మణిపూర్ దారుణాలపై ప్రధాని సమాధానం చెప్పలేక మౌనం వహించారని గుర్తు చేశారు.మరో పక్క మహిళలకు ఉపాధి కల్పించటంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఉన్న పనిదినాలు పడిపోతున్నాయన్నారు. ఉపాధి హామీ లాంటి చట్టాన్ని క్రమంగా నీరుగారుస్తున్నారని చెప్పారు. నిర్వాసితులు పెరుగుతున్నారనీ, వారి సమస్యలు పరిష్కరించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉన్నట్టు కనపడటం లేదన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని కాలరాస్తూ అక్కడున్న విలువైన ఖనిజన సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్రకు మోడీ ప్రభుత్వం పాల్పడుతున్నదని చెప్పారు. అందులో భాగమే మణిపూర్ మారణహోమం అన్నారు. విద్యా, వైద్యం సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే...వాటిని పరిష్కరించకుండా కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నదని చెప్పారు. తమ రాజకీయ ప్రయోజనాలకోసం చట్టబద్ధ వ్యవస్థలను బలహీనం చేస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

అటవీ రక్షణ కోసం అమరులైన అధికారులకు శ్రద్ధాంజలి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ రక్షణ కోసం కార్యదీక్షతో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన 22 మంది అధికారులు, సిబ్బందికి సీఎం కేసీఆర్ శ్రద్ధాంజలి ఘటించారు. వారి అంకిత భావం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా జంగల్ బచావో-జంగల్ బడావో నినాదాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలనీ, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎంఓ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు అటవీ శాఖ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయం. హరిత తెలంగాణ కోసం మన లక్షిత పచ్చదనం 33 శాతం సాధించేదాకా కలిసికట్టుగా పనిచేద్దాం' అని పిలుపునిచ్చారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అందరి నుంచీ మద్దతు లభించటంతో ఇవాళ అద్భుతమైన ఫలితాలను చూస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ లాంటి కాంక్రీట్ కీకారణ్యంలో కూడా ఊహించనంత పచ్చదనం పెరిగిందని తెలిపారు. అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తిదారుల సంఘం అందించే వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్ -2022 హైదరాబాద్‌కు దక్కటమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అందుబాటులోకి వచ్చినా, ఎంత అభివృద్ధి సాధించినా ప్రకృతి పరిరక్షణే ప్రాథమిక ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలు కూడా ఈ పుడమిపై జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్తుచేశారు.

మానిటైజేషన్‌కు వ్యతిరేకంగా బీడీఎల్ ఉద్యోగులు ఉద్యమించాలి : పాలడుగు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల భూముల మానిటైజేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా బీడీఎల్ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ నగర కార్యాలయంలో బీడీఈయూ(సీఐటీయూ అనుబంధం) సమావేశం ఎ.బాపూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీపీఎస్‌యూ భూములను సైతం అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. ఆర్డర్లు ఇవ్వకుండా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. కార్మికులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించడం, కాంట్రాక్ట్ విధానాన్ని కొనసాగించడం, వేతన సవరణలు చేయకుండా దాటవేయడం అన్యాయమన్నారు. ఈ చర్యలను ప్రతిఘటిస్తూ బీడీఎల్ ఉద్యోగులు రాజకీయాలకతీతంగా పోరాడాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ..ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం త్వరలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు చేస్తామన్నారు.

బీడీఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా ఎ.బాపూరావు, యాదగిరి

బీడీఈయూ ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, అధ్యక్షులుగా ఎ.బాపూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడిషనల్ ప్రధాన కార్యదర్శిగా టి. సత్తయ్య, కోశాధికారిగా ఎం. రవీందర్, అడ్వైజర్‌గా జి.ఆర్. విజయ్ కుమార్‌లను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. యూనియన్ అధ్యక్షులు ఎ. బాపూరావు బీడీఎల్ కంపెనీ ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

15న ఆర్టీసీ కార్మికుల నిరసన


- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : జేఏసీ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో : టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికంటే ముందే కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15న నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. ఆదివారంనాడిక్కడి టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్‌లో జేఏసీ సమావేశం జరిగింది. చైర్మెన్ కే రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కన్వీనర్ వీఎస్ రావు, నాయకులు ఎమ్ఎన్ మంగ, కే రాంరెడ్డి, పీ రవీందర్ రెడ్డి, జీ రాములు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యునిట్లలో డిమాండ్స్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అనుకూలమైన సమయంలో 'ధర్నా' చేయాలని చెప్పారు. అప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించనిపక్షంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు 2017 నుంచి రావలసిన వేతన సవరణను ఆ నాటి బేసిక్ పే కు 31.1 శాతం డిఏను కలిపి 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరిపి, పాత బకాయిలతో కలిసి చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా చేస్తూ మాస్టర్ పే స్కేల్‌లో ఫిక్సేషన్ చేయాలని డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ 50 శాతం బకాయిల బాండ్ల డబ్బులు ఇప్పటి వరకూ ఇవ్వలేదనీ, వాటిని 8.75 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని కోరారు. ఈ ఏడాది జనవరి, జులై మాసాల్లో రావల్సిన డిఏలు, మొత్తం 9 డిఏల బకాయిల సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు అసలు, వడ్డీ కలిసి యాజమాన్యం రూ.1,078 కోట్లు ఇవ్వాలనీ, వాటితో పాటు ఎస్ఆర్‌బీఎస్ రూ.540 కోట్లు, పీఎఫ్ రూ.1,270 కోట్లు, ఎస్‌బీటీ రూ. 140 కోట్లు చెల్లించాలని చెప్పారు. రిటైర్ అయిన కార్మికులకు చెల్లించాల్సిన టెర్మినల్ బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలని కోరారు.


రుణమాఫీ కోసం రైతుల రాస్తారోకో

- రెన్యువల్ చేసుకోవడమే మేము చేసినా తప్పా అని ఆవేదన



నవతెలంగాణ- మునుగోడు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని జీవో విడుదల చేసి నెల రోజులు గడుస్తున్నా ఖాతాల్లో జమ కాలేదంటూ రైతులు రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో మునుగోడు నుంచి చౌటుప్పల్‌కి వెళ్లే ప్రధాన రహదారిపై కొంపెల్లి కెనరా బ్యాంక్ ఎదుట రైతులు, ప్రజాప్రతినిధులు సోమవారం రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా కొంపల్లి సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, వెల్మకన్న ఎంపీటీసీ చాపల మారయ్య, కల్వకుంట్ల సర్పంచ్ పగిళ్ల బిక్షం మాట్లాడారు. కెనరా బ్యాంక్‌లో క్రాప్ లోను తీసుకుని ప్రతి ఏడాదీ రెన్యువల్ చేసుకున్న రైతులకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ కాలేదన్నారు. 2018లో రుణం తీసుకుని ఇప్పటి వరకు బ్యాంకు ముఖం చూడని వారికి రుణమాఫీ అయిందని, రెన్యువల్ చేసుకున్న రైతులకు మాఫీ కాక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి లోను రెన్యువల్ చేసుకున్న రైతుల ఖాతాల్లోనూ లక్ష రూపాయల రుణమాఫీని జమ చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడంతో కెనరా బ్యాంక్ ఏజీఎంతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, మాజీ సర్పంచులు జీడిమెట్ల నరసింహ, బోయపర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు ఎద్ల రామలింగయ్య, వీరమల్ల వెంకట్రావు, జీడిమెట్ల పిచ్చయ్య పాల్గొన్నారు.




సంపాదకీయం

అప్రజాస్వామికం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటులో భారీ అవినీతి జరిగిందన్న అభియోగాలపై మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబును సిఐడి పోలీసులు అరెస్టు చేయగా, ఎసిబి కోర్టు ఆయనకు రెండు వారాల రిమాండ్ విధించింది. కాగా చంద్రబాబు అరెస్టు సమయంలో సిఐడి అవలంబించిన తీరు అభ్యంతరకరం. ఆయన హోదా, వయసు, పౌర హక్కులు, చట్ట నియమ నిబంధనలను సిఐడి తుంగలో తొక్కడం ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిదర్శనం. జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబు నంద్యాలలో శుక్రవారం రాత్రి బస్సులో బస చేయగా, పదకొండు గంటలప్పుడు ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల వ్యవహరించినట్లు పోలీసులు చుట్టుముట్టి భీతావహం సృష్టించారు. శనివారం ఉదయం ఆరు గంటలకు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, వందల కిలోమీటర్ల దూరాన ఉన్న విజయవాడకు తీసుకొచ్చి, ఆ రాత్రంతా సిట్ కార్యాలయంలో ప్రశ్నించి, ఆపై ఆదివారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు తీర్పు వచ్చేసరికి సాయంత్రం ఆరైంది. జోరు వర్షంలోనే అర్ధరాత్రి ఒంటిగంటకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేర్చారు. ఈ తంతు యావత్తూ వేధింపు కోసమేనన్న రీతిలో సాగిందన్నది పలువురి విమర్శ. దర్యాప్తు నిష్పక్షపాతంగా వాస్తవాల ఆధారంగా జరగాలి.

ఏపీలో ప్రభుత్వ నిరంకుశ చర్యలు ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నాయి. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన భావప్రకటన, నిరసన తెలిపే హక్కులు కాలరాయబడుతున్నాయి. ఏ చిన్న నిరసనను, ఊరేగింపులను, నిర్దాక్షిణ్యంగా సర్కారు పోలీసులతో అణచివేస్తోంది. ఉపాధ్యాయులు, స్కీం వర్కర్లు, కార్మికులు, ప్రతి ఒక్క తరగతి వారి నిరసనను కేసులు, అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టులతో నిలువరిస్తోంది. శ్రామిక ప్రజల ఆందోళనలను అణచివేయడంలో నాటి చంద్రబాబు ప్రభుత్వానికి ఈనాటి జగన్ సర్కారుకు పెద్ద తేడా ఏమీ లేదు. తాజాగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ బంద్, నిరసనలను అరెస్టులతో అడ్డుకుంది. ప్రజాస్వామ్యంలో ఒకే పార్టీ అధికారంలో ఎల్లకాలం శిలేసుకొని ఉండదు. ప్రజలు ఆగ్రహిస్తే ప్రతిపక్షంలోకి పోతుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తే అదే ప్రతిపక్షంలోకొచ్చాక రక్షణగా ఉంటుంది. పాలకులు అప్రజాస్వామ్యాన్ని ఎంచుకుంటే అదే ప్రతిపక్షంలోకొచ్చాక తమ మెడకు చుట్టుకుంటుందన్న స్పృహ ఉండాలి. విపక్షంలో ఉండగా వైసీపీ సైతం కేసులెదుర్కొన్నదని నిర్బంధాలను అనుభవించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్షాలపై నిర్బంధం ప్రయోగించాలన్న ధోరణి ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు ప్రమాదం. కేంద్రంలో బీజేపీ వచ్చాక ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కుల అతిక్రమణ సాగుతోంది. బీజేపీ నుంచి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నేర్చుకుంటున్నాయి. నిరంకుశ చర్యలను ప్రజలందరూ వ్యతిరేకించినప్పుడే ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టగలుగుతుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటులో రూ.270 కోట్ల ప్రభుత్వ నిధులను డొల్ల కంపెనీలు నెలకొల్పి పథకం ప్రకారం చంద్రబాబు వ్యక్తిగత లబ్ధి పొందారన్నది సిఐడి ఆరోపణ. ఇదంతా వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపని చంద్రబాబు, టీడీపీ వాదన. అయితే కేసు నమోదు, దర్యాప్తు తీరునుబట్టి సహజంగానే సందేహాలొస్తాయి. 2015-16లో జరిగిందంటున్న అవినీతిపై వైసీపీ వచ్చాక 2021లో కేసు నమోదైంది. సిఐడి కొంత మందిని అరెస్ట్ చేసి ఛార్జిషీట్ వేసింది. నిందితులు బెయిల్ మీద విడుదలయ్యారు. హైకోర్టులో విచారణ పూర్తయి తీర్పు రిజర్వ్ అయింది. తొలుత ఎఫ్ఐఆర్‌లో లేని చంద్రబాబు పేరు అనూహ్యంగా ఇప్పుడు ముందుకొచ్చింది. ఐపిసి సెక్షన్ 409 వర్తిస్తుందా, అవినీతి నిరోధక కేసు కాబట్టి ప్రజాప్రతినిధి అరెస్ట్‌కు గవర్నర్ పర్మిషన్ తీసుకోవాలా అనేవి సాంకేతిక విషయాలు. చట్టాలను దర్యాప్తు సంస్థలు పాటించాల్సిందే. అవినీతి కేసుల్లో ప్రభుత్వం నిష్పక్షపాత దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలనే ఎవరైనా కోరుకుంటారు. న్యాయస్థానాలే స్కిల్ డెవలప్‌మెంట్ కేసు నిగ్గు తేల్చాలి.



పేరు మార్చి ఏమార్చి ...

పంచ వర్ష ప్రణాళికలు మార్చలేదు - నిటి అయోగ్ నేతి బీరకాయ అని తేలింది
దేశం రాత మారడం లేదు - పేరు అయినా మార్చి పడేద్దాం

కొత్త పార్లమెంటు కట్టినా - కిరి కిరి చుట్టాలు తెచ్చినా
ప్రజలకు న్యాయం జరగడం లేదు - ప్రశ్నించే అవకాశం మిగలకుండా
పక్కదారి పట్టించే జిత్తులు వేద్దాం - నిరుద్యోగులు పేరు మీద గంటలు గంటలు
ముచ్చట్లలో మునిగి తరించి పోతారు

నాయకులు మారడం ససేమిరా - రాజకీయాలు మంటలు తప్ప ఉపయోగం లేదు
మేధావులు మౌన దీక్షలో - మనుషులు ఖర్మ పాటతో నెట్టెసుకుంటూ
ప్రభుత్వం వూరికే లేదని - ఏదో ఒకటి చేసినట్లు చేయాలి
పత్రికలకు టీవిలకు పేరు వార్త పడేయాలి

జనం జాగృతం అయ్యారని తెలిసిందో - జాతకం బాబాల దగ్గర చూపించినారేమో
మార్పు తప్పదని ముప్ప పొంచి వుందని - పేరు మార్చి మోసం చేయడానికి మరో మారు...


- దాసరి మోహన్, 9985309080

వీర తెలంగాణ చారిత్రక వారసత్వం



తెలకపల్లి రవి

సెప్టెంబర్ 10న తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి 17 వరకూ కొనసాగనున్నాయి. ప్రతి యేటా జరుగుతున్నట్టే ఈ ఏడాది కూడా సెప్టెంబరు 17 పేరిట తెలంగాణ ప్రాంతంలో షరా మామూలుగా రకరకాల రాజకీయ వాదనలు వినిపిస్తున్నాయి. ఇరవయ్యేళ్ల కిందట బీజేపీ ఈ వివాదం తెచ్చింది. అప్పట్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ తెలుగుదేశం నాయకులూ దాన్ని అందిపుచ్చుకున్నారు. అనేక రకాలైన విశ్లేషకులూ బయలు దేరి ఆ పోరాటానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టులపై దాడి నడిపించారు. మరికొందరు చరిత్ర కారులమంటూ యథాశక్తి గజిబిజి పెంచే పనిలో నిమగ్నమయ్యారు. బీజేపీకి బొరుసు లాంటి మజ్లిస్ కూడా రంగప్రవేశం చేసింది. ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్టు డెబ్బై అయిదేళ్ల కిందట ఈ పోరాట చరిత్ర నిర్మించిన కమ్యూనిస్టులకన్నా, వారి నాయకత్వంలో పోరాడిన వీర తెలంగాణ యోధుల కన్నా వీరి హడావుడి ఎక్కువగా ఉంది. ఇన్నిటి మధ్యనా తెలుగు ప్రజలు సెప్టెంబరు 17న తెలంగాణ పోరాట వారసత్వాన్ని స్మరించుకొంటున్నారు. 'మా నిజాం రాజు జన్మ జన్మాల బూజు' అని దాశరథి ఈసడించిన పరమ పైశాచిక పాలనకు వెట్టిచాకిరీకి దొరల చెరలకు మట్టి మనుషులు లిఖించిన మరణ శాసనం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. 1946 జులై 4న దొడ్డి కొమరయ్య వీర మరణం దానికి నాంది వాచకం. ప్రపంచ ప్రజల పోరాటాల చరిత్రలోనే అరుణాక్షరాలతో లిఖించబడిన గొప్ప రోజది. పదిలక్షల ఎకరాల పంపిణీ, మూడు వేల గ్రామాల్లో పంచాయతీ ప్రజారాజ్య స్థాపన వగైరా ఆ పోరాట విజయాలను కొత్తగా చెప్పనవసరం లేదు. ఈ పోరాట కార్యక్షేత్రం తెలంగాణానే అయినా పోరాటంలో పాల్గొన్నవారిని ప్రాంతీయ రేఖలతో, కుల మతాల కొలబద్దలతో విభజించడం అచారిత్రకం.



చారిత్రక సత్యం

పోలీసు చర్యకు బాగా ముందుగానే 1948 ఫిబ్రవరి 26న నిజాం ప్రభుత్వ డిఐజి నవాబ్ దీన్ యార్ జంగ్ బహదూర్ తమ ప్రభుత్వ కార్యదర్శికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు... "గత కొంతకాలంగా ప్రజల దృష్టి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో కల్లోలిత పరిస్థితులపై కేంద్రీకృతమై ఉంది. నిజాం స్టేట్ ఆంధ్ర మహాసభ (మరో విధంగా చెప్పాలంటే ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీగా పరిచితం) రావినారాయణ రెడ్డి అనే కమ్యూనిస్టు నాయకత్వంలో సాగిస్తున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల ఫలితమే ఇది. ఆయనకు 1940 నుంచి భారత కమ్యూనిస్టుపార్టీతో సన్నిహిత సంబంధాలున్నాయి. 1945 నాటికి నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై, 1945 తరువాత పూర్తి స్థాయి కమ్యూనిస్టుగా మారాడు. రైతురంగంలో కమ్యూనిస్టు విధానాలు, కార్యక్రమాలు సాగిస్తున్నాడు. తెలంగాణ ప్రాంతంలోని ఈ కేంద్రాలలో కమ్యూనిస్టు ప్రభావాన్ని విస్తరింపచేయడంలో నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ మొదటి నుంచి బెజవాడలోని సీపీఐ రాష్ట్ర శాఖ ప్రభావంతో మార్గదర్శకత్వంలో పనిచేస్తున్నది. పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ, వావిలాల గోపాలకృష్ణయ్య, చండ్ర రాజేశ్వరరావు ఇందుకు సంబంధించిన ముఖ్య నాయకులుగా ఉన్నారు. వీరు తరచూ ఇక్కడ పర్యటిస్తూ కమ్యూనిస్టులకు ప్రత్యేకమైన వివిధ కార్యకలాపాలను నడిపిస్తున్నారు. కిసాన్ యాత్రలు, పశు ప్రదర్శనలు, బుర్రకథల వంటివి నిర్వహిస్తున్నారు. గడచిన రెండున్నర సంవత్సరాలలోనూ నిజామాంధ్ర మహాసభ దేశ్‌ముఖ్‌లు, వతన్‌దార్లకు వ్యతిరేకంగా పోరాడటంలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించింది. 1945 డిసెంబరు నుంచి ప్రభుత్వాధికారులు, ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు శాఖల వారికి వ్యతిరేకంగా ప్రమాదకరమైన వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నది. ఈ కాలమంతటా కూడా వారి ఉద్యమానికి బెజవాడ నుంచి ప్రచురితమయ్యే తెలుగుపత్రిక 'ప్రజాశక్తి' మద్దతునిచ్చింది. ఈ పత్రికలో నిజాంస్టేట్, బెజవాడ కమ్యూనిస్టులు ఉభయులూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక అతిశయోక్తులతో కూడిన రాతలు రాస్తున్నారు."

సైన్యం చేసిందేమిటి?

నిజాం రజాకార్ల రాక్షస హత్యాకాండకు తలవంచని ఆ పోరాటాన్ని అణిచేందుకే 1948 సెప్టెంబరు 17న కేంద్ర సైన్యాలు దిగాయన్నది చరిత్ర కాదనలేని సత్యం. స్వతంత్ర భారతంలో సంస్థానాల విలీనం కూడా అప్పుడే జరుగుతున్నందుకు తెలంగాణ పోరాటవీరులను అణచివేసే వ్యూహం కూడా దానితో కలిసిపోయింది. నిప్పులు కక్కుతున్న వీర ప్రజానీకం బారి నుంచి నిజాంకు రక్షణ ఛత్రం పట్టేందుకు పోలీసు చర్య అనబడిన సైన్య ప్రవేశం సోపానమైంది. కూలిపోతున్న రాజును రాజప్రముఖ పట్టంతో అభిషేకించి అంతకు ముందుకన్నా క్రూరంగా పోరాట వీరులను ఊచకోత కోసే ఉన్మాద హత్యాకాండకు ఒడిగట్టింది. అప్పుడే ఆంధ్ర ప్రాంతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర హత్యాకాండ సాగించింది. జనం తరిమేసిన దొరలకు కాంగ్రెస్ టోపీలు పెట్టి గడీల్లో పునఃప్రతిష్ఠించింది. ఇప్పుడు తెలంగాణ జపంతో రకరకాల రాజకీయ పాచికలు వేస్తున్న వారితో సహా నాటి దొరల వారసత్వం కొనసాగడానికి బీజాలు అక్కడే ఉన్నాయి. నిజాం రాజ్యం కూలిపోవడం, కలిసిపోవడం మంచిదైనా దాని వెనక ఇంత చరిత్ర ఉంది. ఈ సారాంశం చూడకుండా దాన్నే విమోచన దినం అంటే చరిత్ర నవ్విపోతుంది. ఆ సైనిక చర్యకు నాయకత్వం వహించిన సర్దార్ పటేల్‌ను తప్ప మరెవరినీ బీజేపీ నేతలు ప్రస్తావించరు. నిజాంతో ఈ మిలాఖత్, కమ్యూనిస్టులపై ఊచకోత సాగించిన చర్యకు ఆయన మార్గదర్శకుడనేది నిజం. ఈ దుర్మార్గాలకు నిరసనగానే 1952 ఎన్నికల్లో ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాల్లోనూ కమ్యూనిస్టులే ప్రథమశక్తిగా వచ్చారు. అయితే ఆనాటి హైదరాబాద్, ఉమ్మడి మద్రాసు రాష్ట్రాల్లో ఇతరచోట్ల సీట్లు తెచ్చుకుని కాంగ్రెస్ తన మాయోపాయాలతో ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. విమోచన కాదు విలీనం అనేది మరో వాదన. స్వతంత్ర రాజ్యంగా ఉన్న హైదరాబాద్‌ను లేదా నిజాం సంస్థానాన్ని తెచ్చి తెలుగు జిల్లాలతో కలిపారు గనక విలీనం అనే వాదనా పాక్షికమే. నిజానికి ఆ విధమైన విలీనం మరో ఎనిమిదేళ్ల తర్వాత గాని జరగలేదు. ఇప్పుడు రాష్ట్ర విభజనతో ఆ విలీనమూ ముగిసిపోయింది. అయితే చరిత్రలో మొదట ఉత్తరాంధ్ర జిల్లాలను ఫ్రెంచి వారికి కట్టబెట్టడంతో మొదలుపెట్టి రాయలసీమను దత్తమండలం చేసేంత వరకూ వెళ్లింది నిజాం రాజ్యం. బ్రిటిష్ వారి పాదాల ముందు మోకరిల్లిన వారూ స్వతంత్రంగా పోరాడే టిప్పు సుల్తాన్ వంటివారిని తుదముట్టించేందుకు సహకరించిన దోషులూ నిజాం పాలకులు.

బీజేపీ రాజకీయాలు

సెప్టెంబరు 17కు విమోచన దినం అని పేరు పెట్టి 1998లో అప్పటి కేంద్ర హోంమంత్రి ఎల్‌కె అద్వానీని రప్పించి హడావుడి మొదలెట్టింది. మొదట అద్వానీని తర్వాత ఇప్పటి హోంమంత్రి అమిత్‌షాను అభినవ సర్దార్ పటేల్‌గా చిత్రిస్తున్నారు. ఇదంతా బీజేపీ మత రాజకీయం. నిజాం ముస్లిం రాజు గనక ఆయన్ను కూలదోయడం విమోచన అనేది బీజేపీ ధోరణి. ఆ పార్టీకి లేదా సంఘ పరివార్‌కు నిజాం వ్యతిరేక పోరాటంతోగాని ఏ ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమాలతోగాని ఏమాత్రం సంబంధం లేదు. ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు చేయడానికి ముందు ఆర్య సమాజ్ పేరిట సాగిన మతపరమైన తతంగాలు ప్రజాస్వామిక ఉద్యమంగా పెంపొందింది లేదు. దేశానికి స్వాతంత్రం వచ్చాక జునాగఢ్ పాకిస్థాన్‌తో కలవడానికి మంతనాలు జరిపితే, కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు స్వతంత్రం ప్రకటించుకోవడానికి ప్రయత్నించాయి. సాంకేతికంగా ఒకటికానప్పటికీ బీజేపీ పూర్వరూపం లాంటి రామరాజ్య పరిషత్ హిందువనే ఒకే కారణంతో కాశ్మీర్ రాజు కుట్రలకు వంతపాడింది! నిజానికి దేశానికి ద్రోహం చేసిన రాజులలో మీర్జాఫర్లూ ఉన్నారు, జయచంద్రులూ ఉన్నారు. అయితే ఎప్పుడైనా ఎక్కడైనా మత ప్రాతిపదిక తప్ప మానవ సమానత మతతత్వ రాజకీయాలకు అక్కర్లేదు. రజాకార్లు ముస్లింలు గనక అప్పుడు జరిగింది మతయుద్ధమేనన్నట్టు ఇప్పుడో సినిమా కూడా తీయిస్తున్నారు. రజాకార్లను, కమ్యూనిస్టులను కలిపి మాట్లాడుతుంటారు. ఇదంతా కుటిల రాజకీయం.




కమ్యూనిస్టులే సమర సారథులు

నిజాంను గద్దె దించడమే తప్పన్నట్టు మజ్లిస్ చేసే వాదన. ఇది మరింత తప్పు. నిజాం ఏ మతానికి చెందిన వాడైనా ప్రజాస్వామ్య విలువలను కాలరాసి ప్రజలను వెట్టిచాకిరీకి గురిచేశాడు గనకే వ్యతిరేకించి పోరాడాల్సి వచ్చింది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎందరో ముస్లిం నేతలు కీలక పాత్ర వహించారనేది బీజేపీ, మజ్లిస్ కూడా గుర్తుంచుకోవాలి. నిజాంను 'నీ గోరి కడ్తం కొడకో' అని హెచ్చరించింది నాటి తెలంగాణ పోరాట వీరులైతే నిజాంను గొప్పగా గౌరవించాలన్నది కేసీఆర్. ఇది మజ్లిస్‌ను సంతృప్తి పర్చడానికి కావచ్చు. ఇప్పుడు మంత్రి కేటీఆర్ కూడా తెలంగాణ ఆవిర్భావదినం ఉండగా విమోచన దినం ఎందుకని రెంటినీ ఒకేగాట కట్టేయడం మజ్లిస్‌ను సంతోషపెట్టే ప్రయత్నమే. గోదావరిపై ఆనకట్ట కట్టించిన కాటన్‌దొరతో నిజాంను పోల్చి ఏదో చెబుతుంటారు కేసీఆర్. కాటన్ స్పష్టంగా పరాయి పాలకుల ఉద్యోగి. ఆయన ఎవరినీ వెట్టిచాకిరీలో పీడించిన దాఖలాలు లేవు. నిజాం గొప్పవాడేనని కేసీఆర్ చెబుతున్నట్టు ఒప్పుకుంటే అంత గొప్పవాణ్ని పడగొట్టడం విమోచనం ఎలా అవుతుంది?

ఆనాడు పోలీసు చర్య అనంతరం పోరాటంపై నిర్బంధానికి కారణమైన కాంగ్రెస్ నాటి పీడక ప్రభువులనే పీఠాలెక్కించింది. ఈ అవకాశవాదాలు చాలక గత చరిత్రను కూడా వక్రీకరించడం వీర తెలంగాణ పోరాట స్ఫూర్తికే కళంకం. ఈ హడావుడి చేసే వారెవరూ అసలు పోరాటానికి నేతృత్వం వహించి అశేషత్యాగాలు చేసిన కమ్యూనిస్టుల పాత్రను పట్టించుకోకపోగా అపార్థాలు వ్యాప్తిచేస్తారు. వారికీ కులం, ప్రాంతం లేదా ఆధిపత్యం అంటగడుతుంటారు. కమ్యూనిస్టు వారసత్వం విస్మరించి వీర తెలంగాణ విమోచన గురించి మాట్లాడటం చంద్రుడు లేని పౌర్ణమిను చూపించడమే. సూర్యుడు లేని ఉదయాన్ని ఊహించడమే. దున్నేవానికి భూమి నినాదం తెలంగాణ పోరాట శ్వాస. వేల ఎకరాలు కార్పొరేట్లకు కుబేరులకు కట్టబెడుతున్న ఇప్పటి సర్కార్ల పోకడలు దానికి పూర్తి విరుద్ధం. భూమి ఉపాధి సాధన కోసం పోరాడకుండా ఏవో వాగాడంబరాలతో జనాన్ని దారి తప్పించడం అన్నిటికన్నా విద్రోహమవుతుంది. ఇప్పుడు అనివార్యంగా అయిలమ్మ, కొమరయ్య పేర్లు చెబుతున్నారు గాని వారు అనుసరించిన ఉద్యమాన్ని, చాటిన ఆశయాలను ముందుకు తీసుకుపోయేది కమ్యూనిస్టు ఉద్యమమే. అందుకే ఈ వారోత్సవం చారిత్రక సందర్భమవుతుంది. ■

కమ్యూనిస్టు వారసత్వం విస్మరించి వీర తెలంగాణ విమోచన గురించి మాట్లాడటం చంద్రుడు లేని పౌర్ణమిను చూపించడమే. సూర్యుడు లేని ఉదయాన్ని ఊహించడమే. దున్నేవానికి భూమి నినాదం తెలంగాణ పోరాట శ్వాస. వేల ఎకరాలు కార్పొరేట్లకు కుబేరులకు కట్టబెడుతున్న ఇప్పటి సర్కార్ల పోకడలు దానికి పూర్తి విరుద్ధం. భూమి ఉపాధి సాధన కోసం పోరాడకుండా ఏవో వాగాడంబరాలతో జనాన్ని దారి తప్పించడం అన్నిటికన్నా విద్రోహమవుతుంది. ఇప్పుడు అనివార్యంగా అయిలమ్మ, కొమరయ్య పేర్లు చెబుతున్నారు గాని వారు అనుసరించిన ఉద్యమాన్ని, చాటిన ఆశయాలను ముందుకు తీసుకుపోయేది కమ్యూనిస్టు ఉద్యమమే.

పెట్టుబడిదారీ వ్యవస్థ - కప్పిపుచ్చలేని లోపాలు



ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారీ వ్యవస్థ నిజానికి చాలా మంచిదని, దానిలో స్వతఃసిద్ధంగా ఎటువంటి లోపాలూ లేవని, ఎక్కడైనా లోపాలు తలెత్తితే దానికి కారణం అప్పుడు పాలిస్తున్న ప్రభుత్వాలు చేసే పొరపాట్లేనని కొందరు ఉదారవాద బూర్జువా రచయితలు చెప్తారు. ఆ విధంగా చేయడంవల్ల వాళ్ళ నమ్ముకున్న స్వంత, తప్పుడు సిద్ధాంతాలపై నమ్మకాన్ని కొనసాగిస్తూ ఉండవచ్చు, మరోపక్క ఆ వ్యవస్థ వలన తలెత్తే ఇబ్బందులకు రాజకీయ నాయకులను బాధ్యుల్ని చేసి వారి చేతకానితనాన్ని నిందించనూవచ్చు. అంతర్జాతీయ వాణిజ్యం అందరికీ లాభదాయకంగా ఉంటుందని చెప్పడం కూడా అటువంటి ఒక ప్రయత్నమే. పెట్టుబడిదారీ విధానాన్ని అందంగా చిత్రించే ప్రయత్నమే. సామ్రాజ్యవాద దేశాలు తాము ఆక్రమించుకున్న దేశాలపై శతాబ్దాల పాటు పెత్తనం సాగించాయి. ఆ వలస దేశాల ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసేశాయి. ఆ దేశాల్లో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోడానికి కారణం సామ్రాజ్యవాద దేశాలు తమ వలసలను కొల్లగొట్టేందుకు వీలు కల్పించే విధంగా వాణిజ్య సంబంధాలను బలవంతంగా అమలు చేశాయి. ఈ అనుభవాల తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థను అందంగా చూపించడం సాధ్యం కాదు. కాని, ఉదారవాద బూర్జువా పండితుల సిద్ధాంతాల్లో ఎక్కడా వలస దోపిడీ అన్న పదమే కనిపించదు!

అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటే అది భాగస్వామ్య దేశాలన్నింటికీ లాభదాయంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు అంటారు. ఆ విధంగా ఒప్పందాలు కుదుర్చు కునే దేశాలన్నింటిలోనూ ఉపాధి కల్పన పూర్తి స్థాయిలో ఉంటుందని, పూర్తి స్థాయిలో ఉత్పాదక సామర్థ్యం వినియోగంలోకి వస్తుందని వాళ్ళు ఊహించుకుంటారు. ఆ ప్రాతిపదికనే వారి సిద్ధాం తాన్ని రూపొందించారు. ప్రతీ దేశమూ తనకు ఏయే రకాల సరుకుల ఉత్పత్తిలో ప్రత్యేక నైపుణ్యం ఉందో ఆ నైపుణ్యం కూడా పూర్తి స్థాయిలో వినియోగించబడుతుందని వీళ్ళు ఊహించుకుంటారు. ఆ పరిస్థితిలో మొత్తంగా అన్ని దేశాలనూ కలిపి చూసుకుంటే ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. అందువలన వాణిజ్యంలో భాగస్వాములందరికీ ప్రయోజనం చేకూరుతుందని, ఒక వేళ ఏ కారణంవల్లనైనా ఒక దేశానికి ప్రయోజనం కలగకపోయినా, నష్టం మాత్రం కలగదని వారంటారు.

ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలూ (పూర్తి స్థాయిలో ఉపాధి, పూర్తి స్థాపక సామర్థ్యం మేరకు ఉత్పత్తి, వగైరా) అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే ముందుగాని, ఆ తర్వాతగాని గరిష్ట స్థాయిలో అమలులోకి రావడం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో జరగనే జరగదు. ఈ సంగతి స్వయంగా ఉదారవాద బూర్జువా ఆర్థికవేత్త అయిన జాన్ మేనార్డ్ కీన్స్ చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ జరిగే ఉత్పత్తికి సరితూగే స్థాయిలో డిమాండ్ ఉండదని, అందుకే ఆ వ్యవస్థ నిరంతరం అధికోత్పత్తి సమస్యను ఎదుర్కొంటూంటుందని ఆయన అన్నాడు. అందువలన ఇతర దేశాలతో వాణిజ్యం అంటే తన వాణిజ్య భాగస్వామి దేశానికి తన నిరుద్యోగాన్ని ఎగుమతి చేయడమే అని వ్యాఖ్యానించాడు. అంటే భాగస్వామి దేశం నుండి తెచ్చుకునే దిగుమతులకన్నా, ఆ దేశానికి చేసే ఎగుమతుల విలువ ఎక్కువగా ఉండేటట్టు చూసుకోవాలి. తన దేశంలో డిమాండ్‌కు ఎంత ఎక్కువ మోతాదులో కొరత ఉంటే, అంత మేరకు నిరుద్యోగం పెరుగుతుంది. దానిని తగ్గించాలంటే అంత ఎక్కువ మోతాదులో విదేశీ వాణిజ్యంలో మిగులు ఉండేట్టు చూసుకోవాలి. అప్పుడు తన భాగస్వామి దేశానికి ఎగుమతి చేయడానికి అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడానికి తన దేశంలో ఉపాధి కల్పించడానికి వీలౌతుంది. ఇక్కడ ఉపాధి పెరిగిన సమయంలోనే ఆ భాగస్వామి దేశంలో ఆ మేరకు అదనంగా నిరుద్యోగం పెరుగుతుంది. ఒకవేళ ఆ భాగస్వామి దేశం పెట్టుబడిదారీ వ్యవస్థలో లేకపోయినా, అక్కడికి కూడా నిరుద్యోగం ఎగుమతి అవుతుంది.

సరుకులు, సేవలు, పెట్టుబడులు (ద్రవ్య పెట్టుబడులతో సహా) సాపేక్షంగా నిరాటంకంగా దేశాల హద్దులను దాటి తరలించగలగడం నయా ఉదారవాద వ్యవస్థ ప్రధాన లక్షణం. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు భాగస్వామ్య దేశాలన్నింటికీ ప్రయోజనకరంగా ఉంటాయన్న బూర్జువా వర్గ వాదనను ముందుకు తెచ్చింది ఈ నయా ఉదారవాద వ్యవస్థను నెలకొల్పడానికే. కాని అమెరికాలో హౌసింగ్ బుడగ ఒక్కసారి పేలిపోవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో దీర్ఘకాలం పాటు మునిగిపోయింది. అప్పటి నుంచీ ఇతర దేశాల దిగుమతుల తాకిడి నుండి తన దేశాన్ని కాపాడుకునే చర్యలు చేపట్టే ప్రహసనం మొదలైంది. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే బదులు ఆ సరుకులను స్వదేశంలోనే ఉత్పత్తి చేయాలన్న ఆలోచన ముందుకొచ్చింది. అప్పుడు స్వదేశంలో ఉద్యోగాల కల్పన పెరుగుతుంది, అంటే దాని ఫలితంగా తక్కిన దేశాలలో నిరుద్యోగం పెరుగుతుంది. ఇది నిరుద్యోగాన్ని ఎగుమతి చేయడమే. మూడవ ప్రపంచ దేశాలు రక్షణ విధానాలను విడిచిపెట్టి నయా ఉదారవాద విధానాలను అనుసరించాలని ముందు ఒత్తిడి తెచ్చినది సంపన్న పెట్టుబడిదారీ దేశాలు. అవే దేశాలు ఇప్పుడు తమ తమ దేశాల్లో రక్షణ విధానాలను అమలు చేయడానికి పూనుకుంటున్నాయి. అంటే నయా ఉదారవాద వ్యవస్థ నియమాలను ఈ సంపన్న దేశాలే ఉల్లంఘిస్తున్నాయన్నమాట. ఈ దేశాలన్నీ ప్రత్యేకించి చైనాను తమ లక్ష్యంగా చేసుకున్నాయి. ఎగుమతులను పెంచడం ద్వారా అభివృద్ధి సాధించిన దేశంగా చైనా ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇంతవరకూ చైనాలో పెట్టుబడులు పెట్టి అక్కడ చవకగా ఉత్పత్తి చేసిన సరుకులను తిరిగి తమ దేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చాయి ఈ సంపన్న దేశాలు.

ఇప్పుడు అమెరికా చైనా నుండి దిగుమతులను తగ్గించే 'రక్షణ' విధానాలను అనుసరించడం చూస్తున్నాం. అయితే ఈ విధంగా నయా ఉదారవాదపు 'స్వేచ్ఛా వ్యాపార' విధానాలకు భిన్నంగా వ్యవహరించడానికి కారణం అమెరికా చైనా పట్ల రాజకీయంగా అనుసరిస్తున్న శత్రు వైఖరి కారణం అని ఉదారవాద బూర్జువా పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే అధికోత్పత్తి అనే ధోరణి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే ఒక ధోరణిగా ఉన్నందువలన దాని ఫలితంగా వచ్చిన సంక్షోభం అమెరికాను, పశ్చిమ సంపన్న దేశాలను రక్షణ విధానాలను చేపట్టేలా చేసింది. అంతే తప్ప ఇదేదో కేవలం రాజకీయ శత్రుత్వం వల్ల కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మొదటి నుండీ సంక్రమించిన జబ్బు (అధికోత్పత్తి) వలన ఆ దేశాలు చైనా పట్ల ఈ విధంగా వ్యవహరిస్తున్నాయని ఉదారవాద పండితులు ఎందుకు గుర్తించరు? పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతఃసిద్ధంగా లోపరహితం అని వారు భావించడమే కారణం. ఈ రాజకీయ శత్రుత్వమే గనుక లేకపోయినట్లైతే అంతర్జాతీయ వాణిజ్యం మూడు పువ్వులు-ఆరు కాయలుగా సాగిపోయేదని వారు వాదిస్తారు. దిగుమతులను తగ్గించి, ఎగుమతులను పెంచడం ద్వారా భాగస్వామ్య దేశాలకు తమ నుండి నిరుద్యోగాన్ని ఎగుమతి చేస్తూ తాము మాత్రం సంక్షోభం నుండి బయటపడాలని, ఈ క్రమంలో భాగస్వామ్య దేశం అడుక్కుతిన్నా తనకు అనవసరమని అనుకునే ధోరణి 1930 దశకంలోని మహామాంద్యం కాలంలో బలంగా వ్యక్తమైంది. ఆ కాలంలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా డిమాండ్‌ను



బాగా పెంచే ప్రయత్నాలను అప్పుడు ఎక్కడా చేయలేదు. ఒక్క ఫాసిస్టు దేశాలు మాత్రమే యుద్ధానికి సిద్ధమవుతూ అందుకవసరమైన సన్నాహాల కోసం ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాయి. రూజ్‌వెల్ట్ ఆ1930 దశకంలోనే 'న్యూ డీల్'ను ప్రతిపాదించాడు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడమే ఆ ప్రతిపాదన ముఖ్యాంశం. దాని ఫలితంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం ప్రారంభించింది కూడా. అయితే ఆ వెంటనే న్యూ డీల్‌ను పక్కన పెట్టారు. దాని వలన తిరిగి సంక్షోభం మొదటికొచ్చింది. యుద్ధం ముంచుకొస్తోంది అని గుర్తించిన తర్వాతనే పెట్టుబడిదారీ దేశాలు తమ తమ ఆయుధాల నిల్వలను పెంచుకోవడం కోసం ప్రభుత్వ వ్యయాన్ని పెంచాయి. కాని అంతవరకూ అంతర్జాతీయ వాణిజ్యంలో పోటీ పడి దిగుమతులను తగ్గించు కోవడం, మారకపు రేట్లను తగ్గించడం వంటి చర్యలు విస్తృతంగా చేపట్టారు. దాని వలన ఏ ఒక్క దేశంలోనూ సంక్షోభాన్ని తగ్గించుకోలేకపోయారు. అయితే దిగుమతులకు బదులు స్వదేశంలోనే ఉత్పత్తి చేట్టాలన్న విధానం మూడో ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాల్లో అమలు చేసినందువలన అక్కడ పారిశ్రామికీకరణకు బీజాలు పడ్డాయి.సామ్రాజ్యవాద దేశాల్లో తలెత్తిన సంక్షోభం మూడో ప్రపంచ దేశాల పారిశ్రామికీకరణకు దారి తీసింది.

ప్రస్తుతం మళ్ళీ చైనా ఎగుమతులకు కళ్లెం వేయాలన్న పేరుతో సామ్రాజ్యవాద దేశాలు రక్షణ విధానాలను చేపడుతున్నాయి. దానిని సమర్థించుకోడానికి రాజకీయ శత్రుత్వాన్ని సాకుగా చూపుతున్నాయి. కాని వాస్తవానికి రక్షణ విధానాల ద్వారా చైనాకు నిరుద్యోగాన్ని ఎగుమతి చేయాలన్నదే వాటి ఉద్దేశ్యం.అయితే దీని వలన చైనా దెబ్బ తినిపోతుందనుకోలేం. గత కొన్ని సంవత్సరాలుగా చైనా ఎగుమతులను పెంచుకోడానికి బదులు, దేశీయంగా వినియోగాన్ని పెంచడం మీద ఎక్కువగా దృష్టి పెట్టింది. దానివలన అటు సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను తిప్పి కొట్టవచ్చు, పైగా దేశీయంగా రైతాంగపు అభిమానాన్ని తిరిగి పొందవచ్చు. నిజానికి కొద్ది సంవత్స రాల క్రితమే చైనా "సోషలిస్టు గ్రామీణ ప్రాంతాల దిశగా" అన్న డాక్యుమెంట్‌ను ఆమోదించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యయాన్ని మరింత ఎక్కువగా పెంచడం ఆ డాక్యుమెంట్ సారాంశం. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే ప్రస్తుత పరిస్థితులలో ఎగుమతులను పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించాలన్న వ్యూహంలో ఉన్న లోటుపాట్లేమిటో తెలుస్తోంది. ఏదైనా ఒక దేశం, అందునా, ఒక పెద్ద దేశం ఎగుమతులను పెంచడం ద్వారా అధిక వృద్ధిరేటును సాధించాలన్న వ్యూహాన్ని అనుసరిస్తే, ఆ దేశం మీద సామ్రాజ్యవాద దేశాలు కన్నెర్ర చేస్తాయి. అధికోత్పత్తి సమస్య ఉన్నా, లేకపోయినా, ఒక మూడవ ప్రపంచ దేశం గనుక ఎగుమతులను పెంచి దిగుమతులను తగ్గించుకుంటే సామ్రాజ్యవాద దేశాల నుండి ప్రతి చర్యలు తప్పవు.

చైనాకు ముందు జపాన్ విషయంలో ఇదే జరిగింది. జపాన్ ఏ విధంగా చూసినా, సామ్రాజ్యవాదులకు శత్రు దేశం కానే కాదు. కాని ఆ దేశం అమెరికాతో చేసిన వ్యాపారంలో ఎగుమ తులను పెంచగానే, అమెరికా జపాన్ పట్ల రక్షణ వ్యూహాన్ని అమలు చేసింది. దాని ఫలితంగా జపాన్ వృద్ధి ఒక్కసారి పడిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అనుసరిస్తున్న విధానం జర్మనీ ఎగుమతులలో సాధిస్తున్న వృద్ధిని దెబ్బ యడానికి కూడా తోడ్పడుతుంది. రష్యా నుండి చౌకగా చమురు, సహజ వాయువులను రవాణా చేసే నార్డ్ స్ట్రీం పైప్‌లైన్‌ను యుద్ధం సాకుతో పేల్చివేశారు. దాని వలన జర్మనీ చౌకగా రష్యానుండి చమురు, సహజ వాయువులను పొందలేని పరిస్థితి వచ్చింది. ఫలితంగా జర్మనీలో ఉత్పత్తి ఖర్చు పెరిగిపోయింది. ఇక సమీప భవిష్యత్తులో జర్మనీ తన ఎగుమతులను పెంచుకుని తద్వారా వృద్ధి సాధించే అవకాశాలు లేకుండా పోయాయి.

కేవలం దిగుమతులను తగ్గించుకున్నంత మాత్రాన ఒకానొక దేశం వృద్ధి రేటును పెంచు కోజాలదు. దిగుమతులు తగ్గిస్తే, దాని ఫలితంగా దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కాని అది ఒకసారి మాత్రమే జరుగుతుంది. ఆర్థిక వృద్ధిరేటును నిత్యం పెంచుకోవాలంటే దానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే మార్గం. ద్రవ్యలోటును పెంచడం ద్వారా అయినా లేక పన్నుల ఆదాయాన్ని పెంచడం ద్వారా అయినా ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. కాని అందుకు నయా ఉదారవాద విధానాలు అనుమతించవు. ప్రస్తుత సంక్షోభం నుండి తన దేశాన్ని కాపాడు కోవాలంటే ప్రధాన సామ్రాజ్యవాద దేశం అమెరికా, రక్షణ విధా నాన్ని అనుసరించడం వరకే పరిమితమైతే సరిపోదు. అంతకన్నా చాలా ఎక్కువ ప్రయత్నం అవసరం.

-స్వేచ్ఛానుసరణ

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే సీసీఈ విధానం

- డిగ్రీ కోర్సుల్లో సైబర్ సెక్యూరిటీ కోర్సులు
- మంత్రి సబితారెడ్డి స్పష్టీకరణ
- బట్టీ విధానానికి స్వస్తి: లింబాద్రి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి. సబితాఇంద్రారెడ్డి ప్రకటించారు. సమాజ అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యలోనూ సమూల మార్పులు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిదీ మూసపద్ధతిలో కాకుండా, కాలానుగుణంగా కొత్త కోర్సులు తీసుకొస్తున్నామన్నారు. ఈనేపథ్యంలోనే డిగ్రీ కోర్సుల్లోనూ సైబర్ సెక్యూరిటీ కోర్సులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలియజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో ఉన్న ఉన్నత సాంకేతిక విద్యా కౌన్సిల్‌లో చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణతో కలిసి డిగ్రీలో సైబర్ సెక్యూరిటీ కోర్సును మంత్రి ప్రారంభించారు. దీంతో పాటు పరీక్షలు, మూల్యంకణాన్ని కూడా మార్చనున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఐఎస్‌బీ ఇచ్చిన నివేదికను మంత్రి విడుదల చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికతతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని మంత్రి గుర్తు చేశారు. 30 శాతం మంది సైబర్ క్రైమ్ భారీన పడుతున్నారనీ, అయితే చాలామంది ఇవి బయటకు చెప్పుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, ప్రజలను సైబర్ నేరాలపై



అప్రమత్తం చేసేందుకు, వాటిపై అవగాహన కల్పించేందుకు ఈ ఏడాది నుంచే డిగ్రీలో సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రవేశపెట్టినట్టు తెలియజేశారు. సైబర్ నేరాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలనీ సీఎం కేసీఆర్ ఇటీవల ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఐఎస్‌బీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై అధ్యయనం చేసి, అమలు చేసేందుకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఇప్పటికే డిగ్రీలో సెక్టార్ స్కిల్ కోర్సులు ప్రారంభించామనీ, దీంతో చదవు పూర్తికాగానే ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరోపక్క ఫేక్ సర్టిఫికేట్ల నివారణకూ ఆన్‌లైన్ స్టూడెంట్ వెరిఫికేషన్ సర్వీస్‌కు శ్రీకారం చుట్టినట్టు ప్రకటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను సమాయత్తం చేయడమే తమ సర్కారు లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యా కౌన్సిల్ చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ డిగ్రీ రెండో సంవత్సరంలో సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. నాలుగో సెమిస్టర్‌లో దీనిపై ఒక పేపర్ ఉంటుందనీ, నాలుగు క్రెడిట్లు ఉంటాయని వివరించారు. బట్టీ చదువులకు స్వస్తి చెప్పేందుకే డిగ్రీలో సీసీఈ విధానానికి రూపకల్పన చేసినట్టు ప్రకటించారు. తద్వారా ఫ్రెండ్లీ లెర్నింగ్ విధానాన్ని విద్యార్థులకు అలవాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీస్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, ఉన్నత విద్యా కౌన్సిల్ వైస్ చైర్మెన్లు వెంకటరమణ, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

జైల్లో బాబుకు ప్రాణహాని

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉదహరించారు. చంద్రబాబునాయుడికి బెయిల్ ఇవ్వాలని, లేదా హౌస్ రిమాండుకు అనుమతి ఇవ్వాలని చంద్రబాబు తరుపు న్యాయవాదులు కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై రెండో రోజైన సోమవారం కూడా వాదనలు జరిగాయి. చంద్రబాబు తరుపు సిద్ధార్థ లూథ్రా, ప్రాసిక్యూషన్ తరుపున ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. తొలుత చంద్రబాబు వయస్సు, ఆరోగ్యం రీత్యా అతనికి హౌస్ రిమాండు ఇవ్వాలని కోరారు. రాజమహేంద్రవరంలో కరుడుగట్టిన నేరస్తులు ఉన్న నేపథ్యంలో చంద్రబాబుకు ప్రాణహాని జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్లే కేంద్రం కూడా ఎన్‌ఎస్‌జీ భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. దీనిపై ఏఏజీ పొన్నవోలు సుధా కరరెడ్డి జోక్యం చేసుకుని చంద్ర బాబుకు జైల్లో ప్రత్యేక వసతి కల్పించామని, లోపల బయట పూర్తి భద్రత ఉందని పేర్కొన్నారు. జైలు గోడలు 50 అడుగుల ఎత్తులో ఉంటాయని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆరోగ్య సమస్య ఉత్పన్నమైతే జైల్లోనే వైద్య చికిత్సకు ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నా రని కోర్టుకు తెలిపారు. ఎంత భద్రత ఉన్నా జైల్లో హత్యలు జరిగిన విష యాన్ని గుర్తించాలని చంద్రబాబు తరుపు న్యాయవాది కోర్టుకు తెలి పారు. అలాగే హౌస్ రిమాండుకు అనుమతి ఇవ్వాలని కోరగా సిఆర్‌పిసి చట్టంలో హౌస్ రిమాండు అనే విధానం లేదని పొన్నవోలు తెలిపారు. దీనిపై సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుని గౌతమ్ నవలఖా కేసులో సుప్రీం కోర్టు ఇలాంటి తీర్పు ఇచ్చిందని ప్రస్తావించారు. సాయంత్రం వరకూ సుదీర్ఘంగా వాదనలు వన్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి తీర్పును మంగళవారం సాయంత్రానికి వాయిదా వేశారు. అయితే ఉదయంలోపే తీర్పు ఇవ్వాలని సిద్ధార్థ లూథ్రా కోరారు.

రింగురోడ్డు కేసులో కస్టడీ పిటీషన్

ఇదే సమయంలో చంద్రబాబునాయుడిపై సిఐడి న్యాయవాదులు మరో పిటీషన్ దాఖలు చేశారు. రింగురోడ్డు కేసులో విచారించేందుకు చంద్రబాబును పిటి(ప్రిజనర్స్ ట్రాన్సిట్) వారెంటు మీద తమ కస్టడీకి ఇవ్వాలని అందులో కోరారు. దీనిలో చంద్రబాబు మొదటి ముద్దాయిగా ఉన్నాడని, నారాయణ రెండో ముద్దాయని, నారా లోకేష్ ఆరో ముద్దాయని కోర్టుకు తెలిపారు. దీనిపైనా విచారణను వాయిదా వేశారు. దీంతో మంగళవారం న్యాయమూర్తి ఏమి తీర్పు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.


85 శాతం మెడికల్ సీట్లు


తెలంగాణ విద్యార్థులకే

నవతెలంగాణ -హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు స్థానికత వర్తించదని హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజనకు ముందున్న కాలేజీల్లో మాత్రమే రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 ప్రకారం రెండు రాష్ట్రాల విద్యార్థులకు స్థానిక కోటా అమలవుతుందని స్పష్టం చేసింది. తెలంగాణ ఏర్పాటయ్యాక పెట్టిన 34 మెడికల్ కాలేజీల్లో (20 గవర్నమెంట్, 14 ప్రయివేటు) 85 శాతం ఎమ్‌బీబీఎస్, డెంటల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని తెలిపింది. మిగిలిన 15 శాతం ఆల్ ఇండియా కోటా ఉంటుందనీ, ఆ 15 శాతం సీట్లల్లోనే ఇతర రాష్ట్రాల విద్యార్థుల తరహాలోనే ఏపీ విద్యార్థులు పోటీపడొచ్చునని చెప్పింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ అత్యంత ముఖ్యమైన తీర్పు సోమవారం చెప్పింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15శాతం) పోనూ మిగిలిన 85 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులకే కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చిన జీవో 72ను సమర్థించింది.

కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు పూర్తి తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని చెప్పింది. జీవో 72ను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 3న జీవో 72 తెచ్చింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వు అయ్యాయి. జాతీయ కోటా 15 శాతం మినహా మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకు ఇవ్వడాన్ని సవాల్ చేసిన పిటిషన్లను కొట్టేసింది. ఏపీకి చెందిన గంగినేని సాయి భావన సహా 60కిపైగా పిటిషన్లను కొట్టేసింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రిజర్వేషన్లను పదేండ్ల పాటు కొనసాగించాలని పిటిషనర్ల వాదనను తిరస్కరించింది. రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడే జీవో ఉందని చెప్పింది. 'రాష్ట్ర విభజన నాటికి 20 మెడికల్ కాలేజీ మాత్రమే ఉన్నాయి. 2,850 సీట్లలో 15 శాతం కింద 313 సీట్లను కేటాయించాం. 2019లో నీట్ అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ కోటా కింద 540 సీట్లను రిజర్వు చేశాం. మొత్తం ఈ 853 సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఉంటుంది. పునర్విభజన తర్వాత వచ్చిన 34 కాలేజీల్లో వారికి ప్రత్యేక రిజర్వేషన్ లేదు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం కాదు' అని ప్రభుత్వం చేసిన వాదనను ఆమోదిస్తూ తీర్పు చెప్పింది.





కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట మహాధర్నా

నవతెలంగాణ - మట్టెవాడ

మున్సిపాలిటీ కార్పొరేషన్‌ల్లో పనిచేసే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఏపీలో ఇచ్చినట్టుగా రూ.21,000 జీతం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లాలని ప్రయత్నించిన కార్మికులను మట్టేవాడ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. కార్మిక సంఘాల నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కొద్దిమంది కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు మెమోరాండం అందజేయడానికి లోపలికి పంపించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం కమిషనర్ రిజ్వాన్ షేక్ బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి కార్మిక సంఘాల నాయకులు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, నాయకులు మాట్లాడారు.



పారిశుద్ధ పనులు సవ్యంగా జరిగినప్పుడే ప్రజలు రోగాల బారిన పడకుండా ఆరోగ్య ఉంటారని, అలా కరోనా సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు మున్సిపల్ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి శ్రమించారని గుర్తు చేశారు. అలాంటి వారికి ఉద్యోగ భద్రత కల్పించ కుండా దినదినం భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఇచ్చినట్టుగా డ్రైవర్లు, జవాన్లకు రూ.19వేల వేతనం ఇవ్వాలని, అలాగే, 452 మంది కార్మికులకు పీఆర్సీ ప్రకారం రూ.15,600 వేతనం అమలు చేయాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడుసార్లుగా ఉన్న తంబింగ్ విధానాన్ని రెండుసార్లకు మార్చాలని, మూడు నెలలకు ఒకసారి చీపుర్లు, ఆరు నెలలకు ఒకసారి చెప్పులు, సంవత్సరానికి ఒకసారి యూనిఫామ్ అందజేయాలని కోరారు.

మెయిన్ రోడ్‌లో కార్మికులకు ఆదివారం సెలవు మంజూరు చేయాలని, మలేరియా విభాగంలో పనిచేస్తున్న 90 మంది సీజనల్ కార్మికులకు రూ.15,600 జీతం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ల బిక్షపతి, మున్సిపల్ జాక్ నాయకులు వేల్పుల ధర్మరాజు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పుల్ల రమేష్, టీఎండబ్ల్యూఈయూ జిల్లా నాయకులు సింగారపు బాబు, కార్మికులు పాల్గొన్నారు.

నియంతృత్వ పాలన కోసమే జమిలి జపం

(మొదటిపేజీ తరువాయి)

వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో జమిలీ ఎన్నికలైనా, సాధారణ ఎన్నికలైనా సీపీఐ(ఎం) సిద్ధంగా ఉన్నదన్నారు. దేశంలో ప్రతిపక్షాలు ఐక్యమవుతుండటంతో మోడీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామన్న నిజాన్ని గమనించే జమిలీ ఎన్నికలకు పోయేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేశం సాధించిన గొప్పతనమంతా తమ వల్లే జరిగినట్టుగా మోడీ తనకు తానే ప్రచారం చేసుకుంటున్నారన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న చరిత్ర బీజేపీకి కాని, దాని మాతృ సంస్థలైన జనసంఘ్, ఆర్ఎస్ఎస్‌కూ లేవన్నారు.

ఆనాడు దేశంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంటే పేరిట అడ్డుకొని జమీందార్లకు అనుకూలంగా వ్యవహరించిన చరిత్ర సంఘ్ పరివార్‌దన్నారు. ప్రస్తుతమూ కార్పొరేట్ల పక్షమే వహిస్తూ రైతు నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి రైతాంగం, కార్మికవర్గానికి నష్టం చేస్తున్నదని తెలిపారు. ఇండియా, భారత్ రెండు పదాలు కూడా రాజ్యాంగంలో ఉన్నాయని, ఇప్పుడు భారత్‌గా మాత్రమే పేరు మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను మరుగు పర్చేందుకే దేశం పేరు మార్పు, సనాతన ధర్మం చుట్టూ చర్చ జరిగేలా చేస్తున్నారన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడటమంటే కుల వ్యవస్థను కొనసాగించడమేనని స్పష్టంచేశారు. సనాతన ధర్మమని చెప్పబడుతున్న మనుస్మృతిలో ఆడవాళ్ళ, శూద్రులు, దళితులు చదువుకోరాదని, వేదాలు చదివితే నాలుక కోయాలని, వింటే చెవుల్లో సీసం పోయాలని చెప్పబడిందన్నారు. వీటన్నింటినీ కొనసాగించాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు చెప్పగలవా అని ప్రశ్నించారు. కులాన్ని సంహరించాలని బీఆర్ అంబేద్కర్ ఆనాడే చెప్పారన్నారు. కులాన్ని సంహరిస్తేనే దేశానికి ప్రగతి ఉంటుందని, తాను సైతం కులాన్ని నిర్మూలించాల్సిందేనని చెబుతున్నానని స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం

భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది : చుక్క రాములు

నిజాం పాలనలో భూములన్నీ జాగీర్దార్లు, జమీందార్ల చేతుల్లో ఉండేవని, వారికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగించి లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నా రు. సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధంలేని బీజేపీ వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు.

పుచ్చలపల్లి సుందరయ్య, రావినారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డిలాంటి కమ్యూనిస్టుల యోధులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, కె. రాజయ్య, అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి, నర్సింలు, ప్రవీణ్ కుమార్, ఎం. యాదగిరి, జిల్లా నాయకులు బాగారెడ్డి, రాజయ్య, అశోక్, పాండురంగారెడ్డి, పి. కృష్ణ, నాగభూషణం పాల్గొన్నారు.

హిందూ మతాన్ని రెచ్చగొట్టడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు.జీ-20 దేశాల సమావేశాలు ఆయా దేశాల్లో రొటీన్‌గా జరిగే ప్రక్రియ తప్ప అందులో ప్రత్యేకత ఏమీ లేదన్నారు.

దేశ ప్రజలకు సంబంధించిన అధిక ధరలు, నిరుద్యోగం, రైతులకు మద్దతు ధర, రాజ్యాంగ పరిరక్షణ, మహిళా రిజర్వేషన్లు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై పోరాటాలు సాగించాలని ప్రజలను కోరారు. వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాడు నిజాం నవాబును తరిమికొట్టిన స్ఫూర్తితో దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోడీని గద్దె దించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.

మా డిమాండ్లు నెరవేర్చండి

ఆందోళనకు బెంగాల్ రవాణా కార్మికుల పిలుపు

- కనీస పెన్షన్, ఎనిమిది గంటల పనితో సహా 14 డిమాండ్లు : సీఐటీయూ మద్దతు



కోల్‌కతా : తమ డిమాండ్లు, హక్కుల సాధన కోసం పశ్చిమ బెంగాల్‌లోని రవాణా రంగానికి చెందిన కార్మికులు, ఉద్యోగులు ఏకమయ్యారు. రాష్ట్ర రవాణా కాకుండా ఇతర అన్ని రవాణా రంగాలలో నెలవారీ కనీస పింఛను రూ. 9,000 ప్రవేశపెట్టాలనీ, ఎనిమిది గంటల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు మొత్తం 14 డిమాండ్ల సాధన కోసం వారు పోరాడుతున్నారు. ఈ మేరకు వారు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి పోరాటానికి సీఐటీయూ బాసటగా నిలిచింది.

ఉపాధి పత్రాలు, గుర్తింపు కార్డులు, ఎనిమిది గంటల పని దినాలు, ఆరోగ్య బీమా సహా సామాజిక భద్రతా పథకాల అమలు, అక్రమార్కుల దోపిడీని అరికట్టడం, పెట్రోలియం ఉత్పత్తుల ధరల తగ్గింపునకు చర్యలు, వివిధ రహదారుల పునరుద్ధరణ, పండుగలకు ముందు బోనస్‌లు మరియు అలవెన్సుల చెల్లింపు, ప్రయాణీకుల ఛార్జీలను నిర్ణయించడంలో ప్రభుత్వ సహాయం వంటివి వీరి డిమాండ్‌లలో ఉన్నాయి.

కోల్‌కతాలోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన పశ్చిమ బెంగాల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ వర్క్‌షాప్‌లో కార్మికులు, ఉద్యోగులు తమ డిమాండ్లు లేవనెత్తారు. వర్క్‌షాప్‌లో సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పాల్గొన్నారు. వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ సేన్ మాట్లాడుతూ.. "కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనాల కోసం నిబంధనల పేరుతో అన్ని అక్రమాలను, అక్రమాలను అమలు చేస్తూ శ్రామిక ప్రజల ఆర్జిత హక్కులను నిర్వీర్యం చేసేందుకు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా నిరసనలు రావాలి" అని అన్నారు. ఉద్యమాన్ని నిర్మించడానికి, సంస్థ యొక్క మరింత పరిధి అవసరమని తపన్‌సేన్ తెలిపారు.

రాష్ట్రంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ఏకం కావాలనీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎడతెగని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కోరారు. కార్మికుల ఉద్యమాలు గతంలో ప్రదర్శించిన పరాక్రమాన్ని, వివిధ సంఘటనలను గుర్తు చేసుకోవాల్సిన ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సీఐటీయూ పశ్చిమ బెంగాల్ కమిటీ ప్రధాన కార్యదర్శి అనాది సాహు కార్మికులను అభినందించారు. రోడ్డు రవాణా రంగంలో, మన రాష్ట్రంతో సహా దేశవ్యాప్తంగా పరిపాలనా దౌర్జన్యం కొనసాగుతున్నదని అన్నారు.

కేసీఆర్ పాలనా కాలం

- క్రీడాకారులకు స్వర్ణయుగం :మంత్రి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ పాలనా కాలం క్రీడాకారులకు స్వర్ణయుగమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, భూగర్భ వనరులశాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మహేందర్ రెడ్డి నివాసంలో తొలి తెలుగు భారత అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ గోలి శ్యామల ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 3న కలకత్తాలో జరిగిన భగీరథ నదిలో 81 కిలోమీటర్ల దూరాన్ని శ్యామల కేవలం 13 గంటల్లో ఈదిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఆమెను శాలువాతో సత్కరించి, బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ మహాసముద్రంలో ప్రపంచ రికార్డు స్థాపించడం పట్ల ఆమెను అభినందించారు. రానున్న రోజుల్లో శ్యామలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

నష్టపోయిన సీడ్ పత్తి రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్
- వ్యవసాయ శాఖ ఏడీ విజయ్‌కుమార్‌కు వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గద్వాల జిల్లాలోని నడిగడ్డ ప్రాంతంలో ఎర్ర తెగులు సోకి నష్టపోయిన సీడ్ పత్తి విత్తన రైతులకు ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలనీ, పంటలకు బీమా సౌకర్యం కల్పించడంతో ప్యాకెట్ ధర రూ. 700 చొప్పున ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఈ మేరకు వ్యవసాయ శాఖ ఏడీ విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఆ సంఘం నేతలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, సహాయ కార్యదర్శి ఎం.శోభన్, గద్వాల జిల్లా నాయకులు పాండురంగారెడ్డి, వి.వి.నర్సింహ్మా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతినేని, జూలకంటి మాట్లాడుతూ.. జోగులాంబ గద్వాల జిల్లాలోని నడిగడ్డ ప్రాంతంలో రైతులు 30 ఏండ్ల నుంచి బీటీ సీడ్ పత్తి పంట సాగుచేస్తున్నారన్నారు. 2015-16లో ఎర్ర తెగులు సోకి సుమారు 57 వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందని తెలిపారు. 2017 - 2018 లోనూ రైతులు పంట నష్టపోయిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విషయంపై గతంలో తెలంగాణ రైతు సంఘం అధ్వర్యంలో పోరాటం చేయగా రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. అయినా, సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. ఈ ఏడాదీ ఎర్ర తెగులు వల్ల వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందని వాపోయారు. ఒక్కోరైతు ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయారని తెలిపారు. దీంతోపాటు సీడ్ పంటలకు పుప్పొడి రావడంలేదనీ, దీనిపై కంపెనీలతో మాట్లాడి సమగ్ర విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు ఎకరానికి పెట్టుబడి సహాయం కింద రెండు లక్షల రూపాయల వడ్డీలేని రుణం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాటన్ జిన్నింగ్ ఖర్చులను కంపెనీలే భరించాలని డిమాండ్ చేశారు. కంపెనీలు రైతుతో నేరుగా అగ్రిమెంట్ చేసుకునేలా చూడాలన్నారు. కంపెనీలు, రైతులు, రైతు సంఘాలతో జాయింట్ మీటింగ్ పెట్టాలని సూచించారు. రైతులు కంపెనీలకు విత్తనాలు ఇచ్చిన తర్వాత రెండు నెలల్లోపు డబ్బులు చెల్లించేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు.

వాంబే ఇండ్ల మరమ్మతులకు రూ.100 కోట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎమ్, వాంబే ఇండ్ల మరమ్మతులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు తెలిపారు. హెచ్ఎండిఏ అందించే ఈ నిధులతో జీహెచ్ఎంసీ మరమ్మత్తు కార్యక్రమాలను పూర్తిచేస్తుందని వివరించారు. ఇటీవల మంత్రితో జరిగిన సమీక్షా సమావేశాల్లో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆ ఇండ్లు నిర్మించి చాలాకాలం అయ్యిందనీ, శిథిలావస్థలో ఉన్న వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు.

దీనికి అనుకూలంగా మంత్రి కేటీఆర్ హెచ్ఎండిఏ ద్వారా నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని రూ.9,100 కోట్లతో నిర్మించి పేదలకు ఉచితంగా అందిస్తున్నామనీ, కొన్ని నిధులతో వేల సంఖ్యలో పేదలకు లబ్ధి చేకూరుతుందంటే ప్రభుత్వం ఏమాత్రం వెనకాడదని అన్నారు. నగరంలోని జంగమ్మెట్, బండ్లగూడ వంటి పలు ప్రాంతాల్లో జేఎన్ఎన్‌యూఆర్ఎమ్, వాంబే కాలనీలు ఉన్నాయి.

జనసమీకరణపై దృష్టి సారించండి

- పరిశీలకులు, ఉపాధ్యక్షులకు రేవంత్ దిశానిర్దేశం
- 16,17,18 తేదీల్లో షెడ్యూల్‌పై చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించబోయే సభకు భారీగా జనసమీకరణ చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఇన్‌చార్జీలుగా నియోజకవర్గాలను బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈమేరకు సోమవారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే, మధుయాష్కీగౌడ్, మహేష్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, ఎన్నికల పరిశీలకులు దీపదాస్ మున్షి, మీనాక్షి నటరాజన్ తదితరులు వారితో సమావేశమయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్న నేతలు జనాన్ని భారీ ఎత్తున తరలించాలని కోరారు.

అందులో భాగంగా సీడబ్ల్యూసీ సమావేశాలను పురస్కరించుకుని 16,17,18 తేదీల షెడ్యూల్‌పై చర్చించినట్టు తెలిసింది. జాతీయ అగ్రనేతలు హైదరాబాద్‌కు వస్తుండటంతో వారికి సంబంధించిన బస ఏర్పాట్లు గురించి చర్చించినట్టు తెలిసింది. సీడబ్ల్యూసీ అగ్రనేతలకు తాజ్‌కృష్ణ హోటల్‌లో బస ఏర్పాట్లు, అక్కడే సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నది.

మాజీ సైనికుల సమస్యలపై పార్లమెంటులో మాట్లాడుతా : ఉత్తమ్

మాజీ సైనికులు సమస్యలపై పార్లమెంటులో మాట్లాడుతానని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్రస్థాయి కాంగ్రెస్ మాజీ సైనికుల విభాగం ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. దేశం కోసం సైనికుడిగా పనిచేసినందుకు గర్వపడుతున్నట్టు తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడాలనీ, కాంగ్రెస్ పార్టీ మాజీ సైనికుల శాఖను బలోపేతం చేసేందుకు పాటుపడాలని కోరారు. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం దేశ భద్రతకు విఘాతం కలిగిస్తోందన్నారు.

పదోన్నతుల్లో డ్రైవర్, మెకానిక్‌లకు అవకాశమివ్వండి

- టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీకి ఎస్‌డబ్ల్యూఎఫ్ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సర్వీసులో ఉన్న కార్మికులకు పదోన్నతుల్లో భాగంగా నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ పరీక్షల్లో డ్రైవర్, మెకానిక్‌లకు కూడా అవకాశం కల్పించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రం సమర్పించారు. టీఎస్ఆర్టీసీ ఆఫీసు సిబ్బందిలో ఫీడర్ క్యాడర్‌గా ఉన్న జూనియర్ అసిస్టెంటు (పర్సనల్), జూనియర్ అసిస్టెంటు (అకౌంట్స్) విభాగాల్లోని ఖాళీలను, ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న ఆర్.సీ, కండక్టర్స్, టెలిఫోన్ ఆపరేటర్స్ నుంచి అర్హత కలిగిన వారికి టెస్టు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారితో ఆ ఖాళీలను భర్తీ చేయాలని యాజమాన్య తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. దాదాపు 16 ఏండ్ల తర్వాత ఇలాంటి టెస్టును సెప్టెంబర్ 26న నిర్వహిస్తున్నారనీ, ఈ మధ్యకాలంలో అనేకమంది చదువుకున్న వారు డ్రైవర్లు, మెకానిక్‌లుగా సంస్థలోకి వచ్చారనీ, వారికి కూడా జూనియర్ అసిస్టెంటుగా క్వాలిఫైయింగ్ టెస్ట్ రాసేందుకు అనుమతించాలని కోరారు. ఈ మేరకు రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్స్‌లో అవసరమైన సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల సమరం

- భారీ ర్యాలీలు, ధర్నా, దీక్షాశిబిరాలు
- అధికారుల బెదిరింపులు
- కేంద్రాల తాళాలు పగులగొట్టి నిర్వహణ
- సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీల అరెస్ట్



నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పెద్దఎత్తున ధర్నా చేశారు. గ్రామాలు, మండలాల నుంచి తరలివచ్చి తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల ఎదుట దీక్షా శిబిరాల్లో కూర్చున్నారు. భారీ ర్యాలీలు తీశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అయితే, సమస్యల పరిష్కారానికి చొరవ చూపని అధికారులు అంగన్‌వాడీలపై బెదిరింపులకు పాల్పడటంతో పాటు కొన్నిచోట్ల కేంద్రాల తాళాలు పగులగొట్టి తెరిపించారు. కామారెడ్డిలో కేంద్రాలను తెరిపించే ప్రయత్నం చేయగా సీఐటీయూ నేతలు అడ్డుకున్నారు. పలుచోట్ల సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సమ్మె చేపట్టారు. చేవెళ్లలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహేశ్వరంలో మానవహారం నిర్వహించారు. యాచారంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ, శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు.

ఖమ్మం జిల్లా కామేపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీల దీక్షను సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ దీక్షకు సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాపంథా నాయకులు సంఘీభావం తెలిపారు. కల్లూరులో ర్యాలీ, కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో అంగన్‌వాడీలు దీక్ష ప్రారంభించారు. అశ్వారావుపేటలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి వినతిపత్రం అందజేశారు. భద్రాచలంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. బూర్గంపాడు, పాల్వంచలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ దీక్షలను ప్రారంభించారు.

మేడ్చల్ మల్కాజిగిరి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన తెలిపి ఎమ్మార్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్‌లు ఆందోళన నిర్వహించారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల కన్వీనర్ లింగస్వామి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగారు. కలెక్టరేట్లు, అన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సమ్మె శిబిరాలు ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ అధికారులు కేంద్రాలను తెరవాలని బెదిరింపులకు పాల్పడ్డారు. పలుచోట్ల కేంద్రాల తాళాలను పగులగొట్టి ఐకేపీ సిబ్బందితో నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమ్మె చేపట్టనీయకుండా అంగన్‌వాడీలను అరెస్టు చేసి మోపాల్‌లోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు పెద్దఎత్తున బైటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్‌లను తెరిపించే ప్రయత్నం చేయగా.. సీఐటీయూ నాయకులు అడ్డుకున్నారు. మరికొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు తాళాలు పగులగొట్టి సెంటర్లను తెరిచారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సమ్మెనుద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు. దేవరకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సమ్మెను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రారంభించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీడీపీఓ కార్యాలయం ఎదుట సమ్మెనుద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు మాట్లాడారు. సూర్యాపేట,ములుగు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు.

అంగన్వాడీలపై నిర్బంధకాండను ఖండిస్తున్నాం

- సర్కారు బెదిరింపులను మానాలి
- సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి
- తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జేఏసీ నేతలు పి.జయలక్ష్మి, ఎన్. కరుణకుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్మినెంట్, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయడం, పెన్షన్ పెంపు వంటి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ కాండను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జేఏసీ నేతలు పి.జయలక్ష్మి(సీఐటీయూ), ఎన్.కరుణకుమారి(ఏఐటీయూసీ) తెలిపారు. టీచర్లు, హెల్పర్లపై బెదిరింపులను మానుకోవాలని సూచించారు. సమ్మె డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం చట్టబద్ధంగా 14 రోజుల ముందు ప్రభుత్వానికి, సంబంధిత రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. చట్టబద్ధంగా చేస్తున్న సమ్మెను అణచివేయాలని చూడటం సరిగాదని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టడం అత్యంత దుర్మార్గమని వాపోయారు. అంగన్వాడీ ఉద్యోగులను ఇండ్ల వద్దకెళ్లి మరీ అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన అప్రజాస్వామిక విధానాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సూచించారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యూరియా కొరతను నివారించాలి

- ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి :తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో తక్షణం యూరియా కొరతను నివారించి రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల వర్షాభావం తర్వాత కురుస్తున్న వానలకు రాష్ట్రంలోని మెట్ట, మాగాణి పంటలకు యూరియా అవసరం ఏర్పడిందని తెలిపారు. యూరియా వేయడం జాప్యం చేస్తే పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ప్రతి రైతు యూరియా కోసం రుణాలు తెచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. యూరియా కొరత ఉందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో రైతులందరికీ అవసరమైనంత అందుబాటులో వుంచాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిని గమనించి మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించే అవకాశం ఉందని తెలిపారు.ఒక బస్తా ధర రు.276 ఉండగా, నల్గొండ జిల్లాలో రు.100 లు అదనంగా అమ్ముతున్నారని పేర్కొన్నారు. కొన్ని కంపెనీల యూరియాలో నత్రజని శాతం తక్కువగా వున్నదని ప్రచారం చేయడం ద్వారా అందరూ ఒకే కంపెనీ యూరియా కావాలని డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం యూరియా బ్లాక్‌మార్కెట్ అవుతున్నదని "లిక్విడ్ యూరియా" (ద్రవరూప యూరియా), నీమ్ కోటెడ్ యూరియాను మార్కెట్‌లోకి తెచ్చింది. కానీ ఈ రెండు ఎరువులలో నత్రజని మూలకాలు తక్కువగా వున్నాయనే ప్రచారం జరగడంతో వాటిపట్ల రైతులు ఆసక్తి కనపర్చడంలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఎరువులను రాష్ట్రంలోని ఎరువుల లాబొరేటరీలో పరీక్షించి అవి నాణ్యమైనవా? కాదా అని తేల్చాలన్నారు. ఆ పని రాష్ట్రప్రభుత్వం చేయడం లేదని గుర్తు చేశారు. ఇదే అదునుగా రాష్ట్రంలో ఎక్కువ వాడుకలో వున్న ఎరువులను వ్యాపారులు అధిక ధరకు అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం పంటలకు 10.50లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలన్నారు. వ్యవసాయ శాఖామంత్రి యూరియా నిల్వలు వున్నాయని చెప్పినప్పటికీ రైతులు కోరుతున్న యూరియా అందుబాటులో లేదన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నాణ్యమైన యూరియాను మండల స్థాయిలో రైతులకు అందుబాటులో పెట్టాలనీ, బ్లాక్‌మార్కెట్‌పై చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానమే ఉండదన్న మాట నిలబెట్టుకోవాలి

- దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన రాఘవులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్షలు 8వ రోజుకు చేరాయి. సంగారెడ్డిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యమ కాలంలో.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానమే ఉండదని చెప్పిన కేసీఆర్ మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని తెలిపారు. కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం సేవలందిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సర్వశిక్షా అభియాన్ స్కీమ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పడినప్పటికీ అందులో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేయడం సరైందికాదన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, కృష్ణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శేషాద్రి, కార్యదర్శి ఉమారాణి పాల్గొన్నారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకోసం పోరాటాలకు సిద్ధం : టి సాగర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం కింద ఇండ్లు నిర్మించి ఇస్తామంటూ మాయమాటలు చెప్పిందని విమర్శించారు. ఇప్పుడు వాటి ప్రస్తావనే మరిచిందని తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎక్కడా ఆవాస్ యోజన పథకం కింద ఇండ్ల నిర్మాణం జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలను పేదల నిర్మించుకున్న గుడిసెల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిశవాసులపై కేసులు బనాయిస్తూ, నిరంకుశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నెలల తరబడి పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని, నివాసాలు ఉంటున్నారని తెలిపారు. వారిని అర్హులుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాటలతో కాల వెల్లబుచ్చుతున్నదని తెలిపారు. పేదల సంక్షేమం గురించి గొప్పలు చెప్పుడు తప్పితే.. చేసింది ఏమీ లేదని విమర్శించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కూడా నిజమైన లబ్ధిదారులకు అందడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నవారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన లక్షల మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలనీ, అవినీతి జరక్కుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే..రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.శిక్షణా తరగతుల్లో పి ఆశయ, కోట రమేష్, టి రమేష్ జే వెంకటేష్ క్లాసులను బోధించారు.

ఆధార్ వెరిఫికేషన్‌లో సమస్యలు

- నిలిచిన రిజిస్ట్రేషన్లు..రూ.100 కోట్లు నష్టం ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆధార్ కార్డు వెరిఫికేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టింది. సర్వర్ డౌన్ కావడమే ఇందుకు కారణమని తెలిసింది. దీంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్లు స్థంబించాయి. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం సుమారు రూ. 100 కోట్లు కోల్పోయిందనే ప్రచారం జరిగింది. అయితే అధికారులు ఈ విషయాన్ని ధృవీకరించడానికి నిరాకరించారు. ముఖ్యంగా దస్తావేజులు స్కానింగ్ చేయడం, ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్లు బయోమెట్రిక్ ద్వారా లాగిన్ కావాల్సి ఉండగా, అది కూడా పనిచేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. అలాగే రిజిస్ట్రేసన్ అయిన తర్వాత డాక్యుమెంట్లు స్కానింగ్ చేయడానికి అవకాశం లేదని అధికారులు చెప్పారు. ఇలా రకరకాలుగా తలెత్తిన సాంకేతిక కారణాల మూలంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 140కిపైగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగలేదని అధికారులు అంగీకరించారు. ఈ విషయమై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి శ్రీనివాసులు వివరణ కోరగా ఆధార్ వెరిఫికేషన్‌లో తలెత్తిన సాంకేతిక ఇబ్బందుల మూలంగానే రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా ఆగాయని చెప్పారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకే సాంకేతిక సమస్య కొలిక్కివచ్చిందనీ, ఆతర్వాత రిజిస్ట్రేషన్లు సాఫీగా నడిచాయని చెప్పారు. స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖలో ఎలాంటి సమస్యలూ లేవని వివరించారు. ఆగిపోయిన డాక్యుమెంట్లను మరుసటి రోజు స్కానింగ్ చేస్తారని చెప్పారు.

వీడేం దొంగరా బాబూ!

- ఆర్టీసీ బస్సునే చోరీ చేసి.. ప్రయాణికులకు ఎక్కించుకుని..
- డీజిల్ అయిపోయి బస్సు ఆగిపోవడంతో తుర్రుమన్న ఘనుడు
- ప్రయాణికుల గగ్గోలుతో తేరుకున్న ఆర్టీసీ అధికారులు
- ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టిన వైనం





నవతెలంగాణ - తంగళ్లపల్లి

వీడో చిత్రమైన దొంగ.. ఆర్టీసీ బస్సును దొంగిలించి.. డ్రైవర్‌లా ఫోజిచ్చి మరీ ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. తీరా కొంత దూరం వెళ్లాక డీజిల్ అయిపోయి బస్సు ఆగిపోవడంతో అక్కడి నుంచి తుర్రుమన్నాడు. బస్టాండ్‌లో బస్సు పోయినా సోయిలేని అధికారులు చివరకు ప్రయాణికుల గగ్గోలుతో విషయం తెలుసుకుని తేరుకున్నారు. ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు సదరు దొంగ కోసం వెతుకుతున్నారు. ఈ ఘటన సోమవారం సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి శివారులో జరిగింది. సిద్దిపేట బస్టాండ్‌లో ఉదయం 6గంటలకు ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు వేములవాడకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో డ్రైవర్, కండక్టర్ లేని సమయం చూసి ఓ దొంగ ఆ బస్సును చోరీ చేశాడు. నీలిరంగు చొక్కా, ప్యాంటు తొడిగి అచ్చం డ్రైవర్‌లా ఫోజిచ్చి డ్రైవర్ సీట్లో కూర్చొని సిద్దిపేట నుంచి మధ్యాహ్నం వేములవాడ బస్టాండ్‌కు బస్సు తీసుకొచ్చాడు. అక్కడ హైదరాబాద్ బోర్డు మార్చి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. బస్సు కొంత దూరం వెళ్లి సిరిసిల్ల జిల్లా కేంద్రం దాటుతుండగా.. కండక్టర్ ఏడని ప్రశ్నించిన ప్రయాణికులకు మధ్యలో బస్సు ఎక్కుతాడని సదరు చోరుడు బదులిచ్చాడు. తంగళ్లపల్లి వచ్చినా ఇంకా బస్సు ఎక్కని కండక్టర్ కోసం ఎదురుచూస్తున్నారు. సారంపల్లి గ్రామ శివారుకు రాగానే బస్సులో డీజిల్ అయిపోయి ఆగిపోయింది. ఏమైందని కిందికి దిగిన ప్రయాణికులకు వేరే బస్సు ఎక్కదండని ఆ దొంగ బదులిచ్చాడు. కండక్టర్ లేకపోవడం, డ్రైవర్ మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పలువురు అతన్ని నిలదీశారు. కొందరు అతన్ని వీడియో కూడా తీశారు. సరైన సమాధానం చెప్పకుండా మెల్లిగా అక్కడి నుంచి రోడ్డు దిగి తుర్రుమన్నాడు. దీంతో ప్రయాణికులు ఆగ్రహంతో విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలియజేశారు. ఏం జరిగిందో అర్థంకాక వేములవాడ ఆర్టీసీ అధికారులు ఘటనస్థలానికి చేరుకోగా.. అసలీ బస్సు ఎక్కడిదని ఆరా తీశారు. సిద్దిపేట బస్టాండ్‌లో ఉదయం చోరీకి గురైన బస్సు ఇదేనని నిర్ధారించుకున్నారు. బస్సు చోరీ అయిన విషయాన్ని పోలీసులకు, సిద్దిపేట అధికారులకు తెలియజేశారు. దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ విషయమై వేములవాడ డిపో మేనేజర్ మనోహర్‌ను 'నవతెలంగాణ' వివరణ కోరగా.. సిద్దిపేట డిపో ముందున ఆర్టీసీ బస్సు చోరీకి గురైన విషయం వాస్తవమేనని, సదరు బస్సు డ్రైవర్ డిపోలో రిపోర్టు చేయలేదని తెలిపారు. చోరీ అయిన బస్సు వేములవాడలో ప్రత్యక్షమైన ఉదంతంపై విచారణ చేశామని, సిద్దిపేటలో కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారని చెప్పారు.

ఉద్యమం చేసినం.. బాజాప్త అభివృద్ధి చేసుకుంటాం

- రేవంత్ వ్యాఖ్యలకు మంత్రి హరీశ్‌రావు కౌంటర్..
- ఈనెల 15న సిద్దిపేటకు బుల్లెట్ స్పీడ్‌లో రానున్న రైలు
- అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేరు..
- విద్యాలయాలకు ఆలయం సిద్దిపేట : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట/ చిన్నకోడూరు

సిద్దిపేట నుంచే పెద్ద ఎత్తున ఉద్యమం చేసినం.. బాజాప్త అభివృద్ధి చేసుకుంటాం.. మీ సమైక్య పాలనలో ఈ ప్రాంతం గోస పడ్డది. 60 ఏండ్ల ప్రతిపక్షాల కాలంలో లేని అభివృద్ధి.. ఈ తొమ్మిదేండ్లలో ఎలా జరిగింది.. తెలంగాణ ఉద్యమ గడ్డ.. సిద్దిపేట ప్రజలు రాష్ట్రం కోసం ఉవ్వెత్తున ఉద్యమించారు..' అంటూ సిద్దిపేట, గజ్వేల్‌లోనే అభివృద్ధి జరిగిందన్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో సోమవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు పత్రాలు, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న బుల్లెట్ స్పీడ్‌తో సిద్దిపేటకు రైలు రాబోతున్నదన్నారు. సిద్దిపేట ప్రజలు ఎక్కడికి వెళ్లినా వారి గౌరవం, ప్రతిష్ట పెంచామని తెలిపారు. సిద్దిపేట అభివృద్ధి చూసి ఓర్వలేరని, సిద్దిపేట ప్రజలు గొప్ప చైతన్యవంతులని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తుండటంతో ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలకు, బోధన చేసే సిబ్బందికి కొంత ఇబ్బంది కలుగుతుందన్నారు. అయినప్పటికీ సమాజంలో 50 శాతం మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిలో 50 శాతం వారి భాగస్వామ్యం ఉందన్నారు.

విద్యాలయాలకు ఆలయం సిద్దిపేట : మంత్రులు హరీశ్‌రావు, సబిత

వైద్య, వ్యవసాయ, పశువైద్య, ఫార్మసీ, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్నిరకాల విద్యను అభ్యసించడానికి సిద్దిపేటలో కళాశాలలు ఉన్నాయని, విద్యాలయాలకు ఆలయంగా సిద్దిపేట మారిందని మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండలంలోని రామంచ శివారులో నూతనంగా నిర్మించిన రంగనాయక స్వామి బీ ఫార్మసీ కళాశాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి, రాష్ట్రానికి సిద్దిపేట రోల్ మోడల్ అని తెలిపారు. స్వల్పకాలంలో కళాశాల నిర్మించి విద్యా సంవత్సరం ప్రారంభించిన ఎగ్జిబిషన్ సొసైటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు మారుమూలన ఉన్న పల్లెటూర్లు కూడా సమానంగా అభివద్ధి చెందుతున్నాయన్నారు. కరెంటు కోతలు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకష్ణ శర్మ, ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మెన్ శంకర్, చిన్నకోడూరు ఎంపీపి కూర మాణిక్య రెడ్డి, రామంచ సర్పంచ్ సంతోషవిక్రమ్, ప్రజా ప్రతినిధులు, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి

వారి సేవలను క్రమబద్ధీకరించాలి : ఏఎన్ఎంల కమిటీకి టీయుఎంహెచ్ఇయూ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి. వారి సేవలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ-సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియొద్దీన్, కె.యాదానాయక్, రాష్ట్ర కోశాధికారి ఎ.కవిత తదితరులు ఏఎన్ఎంల సమస్యలపై వేసిన ఉన్నతాధికారుల కమిటీ చైర్ పర్సన్ హైమావతి, సభ్యులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలనీ, పరీక్ష కోసం వేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలనే డిమాండ్లతో ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరిగిన సమ్మె కాలంలో రెండు సార్లు చర్చలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. సెప్టెంబర్ ఒకటిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముగ్గురితో కమిటీ వేశారనీ, దీనితో న్యాయం జరుగుతుందనే ఆశతో సెప్టెంబర్ 4న సమ్మె విరమించినట్టు చెప్పారు.

ఉమ్మడి రాష్ట్రంలో 2003 నుంచి దాదాపు 15 నుంచి 20 సంవత్సరాల సర్వీసును కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా డిస్ట్రిక్ట్ సెలెక్ట్ కమిటీ ద్వారా నియమితులైన వారిలో అత్యధిక మంది వయోపరిమితి దాటిపోయిందని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా జాబ్‌చార్ట్‌తో పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో 2వ ఏఎన్ఎంలు 3,958 మంది, ఈసీ ఏఎన్ఎంలు 644, ఎన్‌హెచ్ఎం 841, ఆర్‌బీఎస్ఎల్ 269, అవుట్‌సోర్సింగ్ ద్వారా 1,083, హెచ్ఆర్ డీ 47, 104 ఏఎన్ఎంలు 20 మంది పని చేస్తున్నారని తెలిపారు.

పీఆర్సీ ప్రకారం ఎంపీహెచ్ఏ (ఎఫ్) క్యాడర్ బేసిక్ రూ.31,040లుగా నిర్ణయించినప్పటికీ కాంట్రాక్ట్ ఏఎన్ఎం లకు ఇవ్వకుండా రూ.27 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. బేసిక్‌తో పాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర అలవెన్సులు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరి కి ఒకే రకమైన వేతనం ఇవ్వాలని సూచించారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాత పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 30 మార్కుల వెయిటేజీ ఇచ్చినప్పటికీ రెగ్యులర్ కావడానికి అవకాశం లేదని తెలిపారు. 6 వేల మంది ఉద్యోగులుంటే పోస్టులు 1,931 మాత్రమే ఇచ్చారని తెలిపారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు వయోపరిమితి ఎత్తివేయాలని కోరారు. అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్ఎంలకు పూర్తి సర్వీసుకు డీఎంహెచ్ఓల ద్వారా సర్వీస్ సర్టిఫికెట్లు, అపాయింట్ మెంట్ ఆర్డర్ కాపీలివ్వాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు, రాత పరీక్ష తేదీలను పొడిగించాలని కోరారు.

"ఏఎన్ఎంలకు యువిన్, ఎన్‌సీడీ పనులను రద్దు చేయాలి. హైదరాబాద్ నగరంలో 5 వేల జనాభాకు ఒక ఏఎన్ఎంను నియమించాలి. పని వేళల్లో మాత్రమే జూమ్ మీటింగ్ నిర్వహించాలి. మిగతా సమావేశాలు సైతం పని వేళల్లో మాత్రమే జరపాలి. సాయంత్రం 4 గంటల తర్వాత ఎలాంటి సమావేశాలు పెట్టరాదు. పై అధికారులు ఫోన్లు చేయరాదు. ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రుల్లో టెలిమనాస్ కార్యక్రమం నుంచి ఏఎన్ఎంలను మినహాయించాలి. ఆరోగ్య మహిళా కార్యక్రమానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. తక్కువ జీతాలు వస్తున్న 47 మంది హెచ్ఆర్డీ ఏఎన్ఎంలు, 104 ఏఎన్ఎంలను ఎన్‌హెచ్ఎంలో కలపాలి. ఈసీ ఏఎన్ఎంలకు ఐడీ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. ఈసీ ఏఎన్ఎంలకు ప్రతి నెలా మొదటి వారంలో జీతాలివ్వాలి. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి. కొత్త జిల్లాల్లోని స్థానికత ఆధారంగా బదిలీలకు అవకాశం కల్పించాలి. వ్యాక్సిన్ అలవెన్స్ రూ.500, యూనిఫాం అలవెన్స్ రూ.2,500 ఇవ్వాలి. 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులివ్వాలి. నైట్, ఓపీ డ్యూటీలు రద్దు చేయాలి. విధి నిర్వహణలో చనిపోయిన వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. హెల్త్ కార్డుల జారీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. ఫీల్డ్ డ్యూటీ చేస్తున్నందున ఎఫ్టీఏ సౌకర్యం కల్పించాలి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ నియమించాలి...." అని ఉన్నతాధికారుల కమిటీకి యూనియన్ ప్రతిపాదనలు సమర్పించింది.

ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్

- అంతర్జాతీయ మోడల్‌గా స్కూల్ వికీ పోర్టల్
- కేరళపై యునెస్కో ప్రశంసలు

తిరువనంతపురం : కేరళ ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్‌గా ఉందని, అంతర్జాతీయ మోడల్‌గా స్కూల్ వికీ పోర్టల్‌ను తీర్చిదిద్దిందని, దేశంలోనే ఇంటర్నెట్ కనెక్టివిటీలో ముందంజలో ఉందని యునెస్కో ప్రశంసల వర్షం కురిపించింది. యునెస్కో ప్రచురించిన 2023 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్ట్ కేరళను ప్రశంసించింది. కేరళ విద్యా రంగంలో సాంకేతికతను అనుసంధానం చేసినందుకు ఈ గుర్తింపు లభించిందని ఆ రాష్ట్ర సాధారణ విద్యాశాఖ మంత్రి వి.శివంకుట్టి తెలిపారు. యునెస్కో నివేదికలో రాష్ట్ర విద్యా రంగంలో సాంకేతికత వినియోగం గురించి మూడు ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నాయి. కైట్ నాయకత్వంలో పనిచేస్తున్న స్కూల్ వికీపోర్టల్ గురించి నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. 'నాణ్యత - కంటెంట్ సృష్టి యొక్క వైవిధ్యాన్ని కలిసికట్టుగా పనిచేయడం మెరుగుపరుస్తుంది' అనే శీర్షికతో స్కూల్ వికీపోర్టల్‌ను ఒక అంతర్జాతీయ మోడల్‌గా నివేదిక ప్రశంసించింది. ఉచిత సాఫ్ట్‌వేర్ వికీమీడియా ప్లాట్‌ఫారమ్‌పై అభివృద్ధి చేసిన స్కూల్ వికీపోర్టల్‌లో భాగస్వామ్య పద్ధతిలో 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్‌ను అభివృద్ధి చేయడం గొప్ప విజయం అని యునెస్కో నివేదిక పేర్కొంది. స్కూల్ వికీ (www.schoolwiki.in) పోర్టల్ అనేది భారతదేశ విద్యా రంగానికి సంబంధించి స్థానిక భాషలో అతిపెద్ద సమాచార రిపోజిటరీ. ఇందులో పాఠశాలలు, స్టేట్ స్కూల్ ఆర్ట్ ఫెస్టివల్ కంపోజిషన్‌లు, పెయింటింగ్‌లు, డిజిటల్ మ్యాగజైన్‌లు, కోవిడ్ కాలం నాటి కంపోజిషన్‌లకు సంబంధించిన సమాచారం ఉంటుంది.కేరళలోని పాఠశాలల్లో డిజిటల్ విద్య కోసం ఉచిత సాఫ్ట్‌వేర్‌లు మాత్రమే ఉపయోగించడాన్ని కూడా యునెస్కో ప్రత్యేకంగా పేర్కొంది.

'పోరాట పటిమ ఉంటేనే ఇండ్లు వస్తాయి'



నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రజల్లో పోరాట పటిమ ఉంటేనే అనుకున్నది సాధిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. నాగోల్ డివిజన్ పరిధిలోని నాంచారమ్మ బస్తీలో స్థాని కులకే మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఎరుకల సంగం అధ్యక్షుడు జగన్నాథం గంగయ్య ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్ష కు మద్దతు తెలిపారు. తదనంతరం ఆయన మాట్లా డుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేదల భూముల కోసం పోరాటం చేసింది కమ్యూనిస్టులు కాదా అని అన్నారు. రెండు వారాలుగా దీక్ష లు చేస్తున్న కూడా అధికార యం త్రాంగం,ప్రజా ప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం చాలా బాధాకరం అన్నారు. స్థానికులు చేస్తున్న దీక్షకు మద్దతు లభించేదాక పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ముత్యాల యాది రెడ్డి,బాత రాజు నర్సింహ, హేమలత, సుధాకర్, నాగయ్య,పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



నవతెలంగాణ-చైతన్యపురి

బీఆర్ఎస్ మహేశ్వరం నియోజక వర్గం ముఖ్య కార్యకర్తల విస్తత స్థాయి సమావేశా న్ని విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. సోమవారం ఆర్కేపురంలోని ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న మంగళవారం (నేడు) ఉదయం 10 గంటలకు జిల్లెల్లగూడలోని ఎస్‌వైఆర్ గార్డెన్‌లో సమావేశం ఉంటుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, చేసిన అభివృద్ధిని గడపగడపకు తీసుకు వెళ్లేందుకు కార్యాచరణ లాంటిపై విషయాలపై సమావేశంలో చర్చించనునట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, వివిధ సంస్థల చైర్మెన్‌లు, వైస్ చైర్మన్‌లు, ఉద్యమ నాయకులు పాల్గొనాలని తెలిపారు.

గణేశ్ నిమజ్జనానికి వాహనాలు సిద్ధం

- ఏర్పాట్లలో నిమగ్నమైన రవాణాశాఖ
- ఇప్పటికే 430 వాహనాలు సమీకరణ
- మరో 2వేల వాహన యాజమానులకు నోటీసులు..
- 28న మండపాల నిర్వాహకులకు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సామూహిక గణేష్ నిమజ్జనానికి కావాల్సిన వాహనాల కోసం రవాణా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఏర్పాటు కానున్న సుమారు లక్ష గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు పెద్దఎత్తున వాహనాలు అవసరం ఉండడంతో వాటిని సమకూర్చే పనిలో రవాణాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత ఆర్టీవోలు, ఎంవీఐలకు ఆదేశాలు కూడా జారీ చేశారు. 18న వినాయక చవితి, 28న గణేష్ నిమజ్జనం నేపథ్యంలో గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో ఇప్పటివరకు సుమారు 500 వాహనాలను సమీకరించిగా.. మరో 2వేల వాహన యాజమానులకు అందుబాటులో ఉండాలని నోటీసులు కూడా జారీ చేశారు. ఈ వాహనాలను ఈనెల 28న మండపాల నిర్వహకులకు అందజేయనున్నారు.

ఈ మేరకు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) పాండురంగ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన ఛాంబర్‌లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల డీటీసీలు, ఆర్టీవోలు, భాగ్యనగర్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. గణేష్ ఉత్సవ సమిటీ సభ్యులు కోరిన విధంగా 250 టస్కర్లు, ట్రైలర్స్, మరో 1750 భారీ, ఇతర వాహనాలను నిమజ్జనం నాటికి సమకూర్చనున్నట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా కమిటీ సూచించిన విగ్రహాలతో పాటు ఇతరులు ఎవరైనా వాహనాలు కావాలనుకుంటే తమ పరిధిలోని రవాణాశాఖ అధికారులను సంప్రదించాలని జేటీసీ సూచించారు. వినాయక నిమజ్జన ఉత్సవాలను ప్రతిఒక్కరూ ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

11 కేంద్రాల్లో వాహనాలు అందుబాటులో..

వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం వాహనాలను నగరంలోని మొత్తం 11 ప్రాంతాల్లో రవాణాశాఖ అందుబాటులో ఉంచనుంది. ఇందులో నెక్లెస్ రోడ్(సంజీవయ్య పార్క్), డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్(నాగోల్), ఆర్టీఏ మలక్‌పేట, ముసారాంబాగ్, ఆర్టీఏ వెస్ట్ జోన్(టొలిచౌకి), నార్త్ జోన్(తిరుమలగిరి), సౌత్ జోన్(కాటేదాన్), గచ్చిబౌలి స్టేడియం, ఆటోనగర్, కొంపల్లి, పటాన్‌చెరువు, కొత్తూరు కేంద్రాలున్నాయి. కాగా, ఈ 11 కేంద్రాలకు ఆర్టీవో అధికారులను ఇన్‌చార్జ్‌లుగా రవాణాశాఖ ఉన్నతాధికారులు నియమించారు. వీరికి సహాయకులుగా ఒక్కొక్క ఆర్టీవోకు ఆరుగురు చొప్పున ఎంవీఐ, ఏఎంవీఐలను ఇచ్చారు. ఇక నెక్లెస్‌రోడ్ వద్ద ఖైరతాబాద్ ఆర్టీవో ఎల్. రాంచందర్, నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, జి సురేష్ రెడ్డి, రవీందర్ కుమార్, మలక్‌పేట సుభాష్‌చందర్ రెడ్డి, టొలిచౌకి సీపీ వెంకటేశ్వర్‌రావు, తిరుమలగిరి శ్రీనివాస్‌రెడ్డి, బండ్లగూడ జి సదానందం, రంగారెడ్డి విజయా రావు, ఇబ్రహీంపట్నం రఘునందన్ గౌడ్, కొంపల్లి వద్ద మేడ్చల్ డీటీసీ ఎం.కిషన్, పటాన్‌చెరువు రాజా మొహమ్మద్, కొత్తూరు కేంద్రాలకు చిన్న బాలు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు.

లారీ సంఘాలు, ఉత్సవ సమితి నాయకులతో మీటింగ్

గణేష్ నిమజ్జన ఉత్సవంలో విగ్రహాల తరలింపునకు కావాల్సిన వాహనాలను రవాణాశాఖ సమకూర్చడంతో పాటు ఉత్సవ సమితి సూచించిన వారికి ఆ వాహనాలను అద్దెకు అందజేస్తోంది. వాహన క్యాటగిరి బట్టి ధరను రవాణాశాఖ ఫిక్స్ చేస్తోంది. ఇందులో బండి కిరాయి మండపాల నిర్వహకులు చెల్లిస్తారు. భారీ ట్రైలర్‌లకు రూ.20 వేలు, లారీలకు రూ.4,500, మధ్యతరహా వాహనాలకు రూ.5,500, టాటాఏసీ వంటి వాహనాలకు రూ.1000 చొప్పున అద్దె ఉండగా.. నిర్వాహకులే డీజిల్ సమకూర్చుకోవాలి. డ్రైవర్, క్లీనర్‌లకు రూ.500 చొప్పున బత్తా చెల్లిస్తారు. పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ట్రైలర్లు, టస్కర్ల ధరలు రూ.32-40వేల వరకు పెంచాలని లారీ అసోసియేషన్ నాయకులు ఆర్టీఏ అధికారులను కోరుతున్నారు. ఉత్సవ సమితి నాయకులు ఒప్పుకోకపోవడంతో ఒకటి రెండ్రుజుల్లో లారీ అసోసియేషన్, ఉత్సవ సమితి నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి.. అందులో ఒక నిర్ణయం తీసుకుంటామని జేటీసీ పాండురంగ నాయక్ తెలిపారు.



తల్లులు పోషకాహారం తీసుకోవాలి



- కార్పొరేటర్ జెనిగ భారతమ్మ కొమరయ్య

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో తల్లులు, గర్భిణులు, చిన్నారులు పౌష్టిక ఆహారం తీసుకోవటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని కార్పొరేటర్ జెనిగా భారతమ్మ కొమరయ్య అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 14 డివిజన్ పరిధిలో ఉన్న వెంకటాపూర్ సెక్టార్ అంగన్ వాడి కేంద్రంలో నిర్వహించిన పోషక అభియాన్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. తల్లులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్ వాడి కేంద్రాల ద్వార చిన్నారులకు,బాలింతలకు,గర్భిణులు అందించే పౌష్టిక ఆహారం తీసుకోవటం వల్ల ఎంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. డాక్టర్ల సలహా పాటించి చిన్నారుల పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందన్నారు.తల్లి పాలు చిన్నారులకు అమతంలా పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ ఏ.అనిత, అంగని వాడి కేంద్రం టీచర్ అనుపమ,ఆయా మంగ తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఐఆర్ ఇవ్వాలి



- డి. కిషన్

నవతెలంగాణ-మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ డ్- పే తదితర సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వారికి ఐఆర్ (భృతి) ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మీర్ పేట్ కార్పొరేషన్ రెవిన్యూ ఆఫీసర్ (ఆర్ఓ) అంజన్ రెడ్డికి కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పోలిస్తే మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న వేతనం ఏ మూలకు సరిపోవడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ లో ఇస్తున్నట్లుగా రూ 21000/- వేతనాలను ఇవ్వాలని, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్ డ్-పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, తెలంగాణ ప్రభుత్వం నియమించబోయే రెండో పీఆర్సీ కమిషన్ సిఫారసులలో భాగమైన ఐఆర్(మధ్యంతర భతి)ని పర్మినెంట్ ఉద్యోగులతోపాటు మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులుగా వర్తింపజేయాలని కోరారు. మున్సిపాలిటీల అభివద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యల విషయంలో మున్సిపల్ అధికారులు పాలకవర్గాలు జోక్యం చేసుకొని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కషి చేయాలని కోరారు. లేనియెడల సీఐటీయూ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలకు కార్మికులనంతా సిద్ధం చేసి సెప్టెంబర్ 30వ తారీఖున చలో హైదరాబాద్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు యంజే ప్రకాష్ కారత్, దాసరి భాస్కర్, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ యాదగిరి, కార్మిక నాయకులు బావమ్మ, భారతమ్మ, పద్మ, శ్రీలత, అంజలి, అన్నపూర్ణ, మౌనిక, రోజా, నవనీత, జ్యోతి, శ్రీధర్, నరసింహ, సత్తయ్య, తుల్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనిత నాయక్

నవతెలంగాణ-సంతోష్ నగర్

అందరి సహకారంతో మార్కెటగ్‌ల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనిత నాయక్ అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి, అధ్యక్ష, కార్యదర్శులు, కమిషన్ ఏజెంట్స్, ట్రేడర్స్, టీసీఏటీ, మిర్చి అసోసియేషన్, మహబూబ్ మాన్షన్ కాంప్లెక్స్, మలక్ పేట్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కమిటీ చైర్‌పర్సన్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. అన్ని రంగాల్లో రాణించాలంటే అభివద్ధి లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిర్ణయానుసారం మార్కెట్ యర్డుకు మిర్చి తెచ్చి అమ్ముకొన్న రైతులకు చెల్లింపులు " ఆన్ లైన్ " ద్వారా జరిగే విధముగా చర్యలు తీసుకునేందుకు ఆదేశించారు. కమిటీ డైరెక్టర్లు పీ మాణిక్యరావు, డీ పల్లి కంటి యాదగిరి, సీహెచ్ నరేష్ ఎండీ అజర్ సల్మాన్, మహమ్మద్ ఖాన్, రాములు యాదవ్, కమిటీ సభ్యులు, సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే అభివృద్ధి'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కేంద్రం,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే పేద ప్రజలు అభివృద్ధి సాధించారని బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నర్సింహా రెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని 13వ డివిజన్ బాలాజీ నగర్‌కు చెందిన పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు 13వ డివిజన్ కార్పొరేటర్ నేనవత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.అదే విధంగా కుర్మల్ గూడా జెన్నారం కాలానికి చెందిన పలువురు నాయకులు రియాజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎంతో మంది కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, ఎర్ర జైహింద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నాయకులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, గట్టు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయండి

- సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ సామిడి శేఖర్ రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పనామా చౌరస్తా నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీని నిర్వహించడానికి బైక్ లపై బయలుదేరిన పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగాలు ద్వారా తెలంగాణ ప్రాంతం విముక్తి అయిందన్నారు. పేదలకు రూ. 10 లక్షల ఎకరాల భూమిని పంచి మూడువేల గ్రామాలకు విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని, కామ్రేడ్ చాకలి ఐలమ్మ ఒక మహిళ దొరలకు ఎదురు తిరిగిందని, రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి నాయకత్వంలో జరిగిన పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లికించబడిందని అన్నారు. సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని కానీ సాధించిన తెలంగాణలో నేడు కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికి బీఆర్ఎస్ తెలంగాణ వారోత్సవాలను అధికారికంగా నిర్వహించకుండా మూర్ఖత్వంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వమే తెలంగాణ వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదికారం లేకున్నా పేదల ఇంటి స్థలాల కోసం భూ పోరాటాలు చేసి మహానగరంలో అనేక బస్తీలను ఏర్పాటు చేసింది కమ్యూనిస్టులు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహిస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10 తేదీ నుంచి 17 వరకు వారోత్సవాలను సీపీఐ నిర్వహిస్తుందని అయితే ఎల్బీనగర్ నియోజకవర్గంలో నిర్వహించడానికి ప్రయత్నించగాభాగ్యాలత భారత్ బెంజ్ షోరూం దగ్గర పోలీసులు అటకాయించి సుమారు మూడు గంటల పాటు నియోజకవర్గ కన్వీనర్‌తో పాటు సుమారు 100 మంది పార్టీ శ్రేణులు నిర్బంధించారని, వారోత్సవాలను జరుపడం కూడా నేరంగా పరిగణించడం సరికాదన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, నియోజకవర్గ కో కన్వీనర్ బాతరాజు నరసింహ, మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కష్ణ, నియోజకవర్గ సమితి సభ్యులు సుధాకర్, ఇమ్రాన్, రాములు గౌడ్, అరుణ్ కుమార్ గౌడ్, సక్రు నాయక్, సుభద్ర, సరిత, శ్రీదేవి, కష్ణ,,కళ్యాణి, సుజాత, దీపిక, శివ, జ్యోతి,విమల, శ్రీధర్ రెడ్డి తో పాటు పార్టీ శ్రేణులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-ఎల్బీనగర్

కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సరూర్ నగర్‌లో సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్వాడీ ఉద్యోగులు సోమవారం సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, పక్కాభవనాలు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ లను వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. 2018లో కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం అంగన్వాడీ టీచర్లకు రూ. 1500 , హెల్పర్లకు రూ. 750, మినీ వర్కర్లకు రూ. 1250 దానికి సరిపడా బడ్జెట్‌ను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు.బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని అన్నారు. మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించి ప్రకటించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జిల్లా నాయకులు ఎరుపుల నరసింహ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం వీరయ్య, ఆలేటి ఎల్లయ్య, ఎం గంగ, రబియా సుల్తాన్, కవిత, జానకమ్మ వై సత్తెమ్మ విజయలక్ష్మి సుకన్య, కె కవిత, శివ జ్యోతి , తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మి ప్రసన్నకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలి'



నవతెలంగాణ -ఎల్బీనగర్

వచ్చే ఎన్నికలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే గా లక్ష్మి ప్రసన్న పోటీ చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు ముద్ద గోని రామ్మోహన్ గౌడ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రెండు సార్లు బీఆర్ఎ స్ అభ్యర్థి గా ఎల్బీనగర్ లో పోటీ చేసినట్టు తెలిపారు. ప్రజలు తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనీ కోరుతున్నారని కావున లక్ష్మి ప్రసన్న పోటీ చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రజల ఎల్బీనగర్ లో పుట్టిన బిడ్డను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రస్తు త ఎమ్మెల్యే సుదీర్ రెడ్డిని మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేయించి, ఎల్బీనగర్ లో లక్ష్మి ప్రసన్న కు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించాలని కోరారు. సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే గెలిచి బీఆర్ఎస్‌కు వచ్చి స్వంత పార్టీ నాయకులను అనుగదొ క్కుతున్నాడని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్స్ వజీర్ ప్రకాష్ గౌడ్, జిన్నారం విఠల్ రెడ్డి, సామ రమణారెడ్డి మాట్లాడుతూ 11మంది కార్పొరేటర్స్‌ను ఓడించిన ఘనత ఎమ్మెల్యే సుదీర్ రెడ్డికి దక్కుతుంది అన్నారు. గతంలో 11మంది కార్పొరేటర్లు చేసిన అభివద్ధి ఎల్బీనగర్ లో ఉంది అన్నారు. డబుల్ బెడ్ రూమ్స్, దళిత బంధు, బీసీ బంధులను ఎమ్మెల్యే ఇష్టం ఉన్నవారికే ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే అభ్యర్థి దేవి రెడ్డి సుదీర్ రెడ్డిని మార్చాలని కోరారు. ఎల్బీ నగర్ లో ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి చేసిన అభివద్ధి ఏమిలేదన్నారు. కార్పొరేటర్ సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్ షాలిని, బీఆర్ఎస్ నాయకులు మమ్మద్ జానీ, కత్తి రాంబాబు, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ హుండి లెక్కింపు



నవతెలంగాణ-సంతోష్ నగర్

కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీ ఆదాయం 31,54,065, ఒక వంద యూఎస్ డాలర్లు, 10 బ్రిటీష్ పౌండ్స్ వచ్చినట్టు దేవాలయ చైర్మెన్ నల్ల రఘుమారెడ్డి కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస శర్మ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా దేవాదాయకాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో దేవాలయ చైర్మెన్ ధర్మకర్తల సమక్షంలో సోమవారం హుండీ లెక్కించినట్టు తెలిపారు. అట్టి హుండీ ఆదాయాన్ని కర్మన్ ఘాట్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ శంకరాచారి ,సిబ్బందికి అందజేసినట్టు చెప్పారు. ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి ,బబ్బురి ఆనంద్ గౌడ్ ,మధుసాగర్, నారగోని శ్రీనివాస్ యాదవ్, యాదగిరి ,గూడూరు మధుసూదన్ రెడ్డి ,మేక సురేందర్ రెడ్డి ,చీర తిరుమలేష్, సిబ్బంది శ్రీనివాస్, అర్చక బృందం అంబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ సూర్యగిరి ఫర్నిచర్ అండ్ హెూం నీడ్స్ షోరూం ప్రారంభోత్సవంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యజమాని అనిత అరవింద్ కుమార్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి నాయకులు పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-వనస్థలిపురం

ప్రయివేటు ఆస్పత్రుల తనిఖీలెక్కడ..?

- నర్సింగ్ హెూంలు, ల్యాబ్‌లలోనూ..
- జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణపై విమర్శలు



నవతెలంగాణ-హయత్‌నగర్

ఒకవైపు సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హెూమ్స్, ల్యాబ్‌ల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రయివేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హెూమ్స్, ల్యాబ్‌లను తనిఖీలు చేయాల్సిన అధికారులు పర్యవేక్షణ కరువైందని తెలుస్తోంది. జిల్లాలో అసలు ముఖ్యంగా ఎన్ని ప్రయివేటు హాస్పిటల్స్ ఉన్నాయి... అందులో ఎన్నిటికి అనుమతులు ఉన్నాయి... ఎన్ని నర్సింగ్ హెూమ్స్ ఉన్నాయి... అందులో ఎన్ని అనుమతులతో నడుస్తున్నాయి.ఎన్ని రక్త పరీక్ష కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి... అందులో పనిచేయాల్సిన వారు నిబంధనలకు లోబడే ఉన్నారా అనే అంశాలపై ప్రతి ఏటా తనిఖీలు చేపట్టాల్సిన జిల్లా వైద్య అధికారులు అమ్యమ్యాలకు లొంగుతున్నారా అనే సందేహాలు ప్రజలకు వ్యక్తమవుతున్నాయని చెప్పవచ్చు.

అర్హులైన వైద్యులే సేవలు అందించాలి... ఆయుర్వేదిక్ వైద్యులు అల్లోపతి రాయకూడదు... ప్రతి ప్రయివేటు ఆస్పత్రిలో రిజిస్ట్రేషన్ కాపీ నోటీస్ బోర్డ్ లో పెట్టాలి, ల్యాబ్‌లలో ధరల పట్టిక పెట్టాలి, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, బయో కెమిస్ట్రీల అనుమతి లెటర్ చూపాలి.రోజులకు సరిపడా మరుగుదొడ్లు, తగినంత స్థలం కల్గి ఉండాలి. వైద్య సేవల చార్జీలు సైతం నోటీసు బోర్డుపై ఉండాలి. పలు ప్రాంతాల్లో వీటిని పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. కావున అధికారులు వీటి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రతీ గల్లీలో నర్సింగ్ హెూంలు..!

రంగారెడ్డి జిల్లా లో ప్రతి గల్లీ లో నర్సింగ్ హెూమ్‌లు, ల్యాబ్ లు ఏర్పాటు అవుతున్నాయి.దాంతో కార్పొరేట్ వైద్యం పొందలేనిచాలా మంది నిరుపేదలు సమయం ఆదా తో పాటుగా తక్కువ ఖర్చుతో వైద్యం అవుతుందని భావిస్తున్నారు. కానీ అనుభవం లేని వైద్యులతో ప్రాణాలకే ముప్పు అని తెలుసుకోలేకపోతున్నారు. కావున ప్రయివేటు ఆస్పత్రుల్లో, నర్సింగ్ హెూమ్స్‌లలో, ప్రయివేటు ల్యాబ్స్‌లలో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


తక్కువ ధరకు మెరుగైన వైద్యం అందాలి



రంగారెడ్డి జిల్లా పరిధిలో విచ్చల విడిగా ప్రవేటు హాస్పిటల్స్ రోగులను డబ్బు కోసం వైద్యం చేస్తున్నారే తప్పా వైద్య వృత్తిని సేవా భావంతో చూడడం లేదు.కనీసం నెలకు ఒకసారి అయిన ప్రవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హెూమ్స్, ల్యాబ్ లను జిల్లా వైద్య ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంగం అధ్యక్షుడు కండెల వెంకటేశ్వర్లు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.

-ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కండెల వెంకటేశ్వర్లు

ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు ఉంటాయి



జిల్లా పరిధిలో 2వేల నర్సింగ్ హెూమ్ లు ఉన్నాయి. నిత్యం ప్రజా రోగ్యం పై దృష్టి ఉంటుంది. ప్రయివేటు హాస్పిటల్స్ పై ఫిర్యాదు లు వస్తేనే వాటిపై తనిఖీలు నిర్వహిస్తాం.ఇటీవల అమ్మ, లెజెండ్ హాస్పిటల్స్ పై ఫిర్యాదు లు వచ్చాయి. నకిలీ లైసెన్స్ సంబంధించినది కోర్ట్ పరిధిలో వుంటుంది. మాకు పనిభారం ఎక్కువగా ఉంటుంది కాబట్టి నిరంతరం ప్రయివేటు హాస్పిటల్స్ పై నిఘా అసాధ్యం

- రంగారెడ్డి జిల్లా వైద్య ఉన్నతాధికారి వెంకటేశ్వరరావు

యువతి అదృశ్యం..పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు


అఖిల

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ నగర్‌లోని శ్రీరామనగర్ కాలనీలో తాటికొండ పాండు, భార్య, పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. పాండు చిన్న కూతురు అఖిల(19) ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదివింది. ఈ నెల 11న కడుపునొప్పితో బాధపడుతూ నిమ్మరసం తాగేందుకు నిమ్మకాయలు తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అఖిల ఆచూకి కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మునీరాబాద్‌లో ఎస్టీ భవన స్థలం కోసం కృషి

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని మునీరాబాద్ గ్రామంలో ఎస్టీ భవనం స్థలం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు కుతాడి నరేందర్ తెలిపారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 26లో 300గజాల ప్రభుత్వ స్థలాన్ని ఎస్టీ భవన నిర్మాణం కోసం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. గత నాలుగు నెలల నుండి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు తిరిగి ఎస్టీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. గ్రామానికి ఎస్టీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించే వరకు నిరంతరం పోరాటం చేస్తానని వెల్లడించారు.


కుతాడి నరేందర్

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-ఉప్పల్

నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ(ఎం) నాయకులు ఎర్రం శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రామంతపూర్ రాజేంద్రనగర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం డీమార్ట్ వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాన్నారు. ఏ కూరగాయలు కొన్నా రూ.60కి తక్కువగా రావడం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఏం కొనాలో, ఏం తినాలో తెలియక పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎర్రం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎండీ గౌస్, శ్రీనివాస్, బాలయ్య చలపతి, అశోక్ యాదగిరి తదితరులున్నారు.


హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు ఉన్నారు.
నవతెలంగాణ-కాప్రా

మార్వాడీ మహిళల ఆధ్వర్యంలో బచ్చబరాస్ పండుగ



నవతెలంగాణ-ఉప్పల్

మార్వాడీ మహిళా మండల్ సమాజ్ ఆధ్వర్యంలో చిల్కానగర్ డివిజన్ సాయిరాం నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బచ్చబారస్ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ గీత హాజరై కార్పొరేటర్ మాట్లాడుతూ.. మార్వాడీ సమాజం మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు అందరూ కలిసికట్టుగా బచ్చబరస్ కార్యక్రమాన్ని నిర్వహించడం మహిళల ఐక్యతకు చిహ్నం అని అన్నారు. ఈ సందర్భంగా వారందరికీ బచ్చబారస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బన్సీలాల్, రామచందర్, గణపతి లాల్, సురేష్ చంద్, మనీక్‌చంద్, మార్వాడీ మహిళా సంఘం సభ్యులు సంతోష్‌దేవి, తారాదేవి, రుక్మాదేవి, రేఖాదేవి, ఇంద్రాదేవి, మునీదేవి, కుమావత్ ఉన్నారు.

కరాటే పోటీలో సిల్వర్ మెడల్ సాధించిన సలోమి



నవతెలంగాణ-కాప్రా

షాటోకాన్ కరాటే అకాడమీ తెలంగాణా ఆధ్వర్యంలో ఈ నెల 9, 10తేదీలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 33 నేషనల్ కరాటే, కుంపు ఛాంపియన్ షిప్ 2023 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో 55 కేజీల విభాగం అండర్ 16లో కురునెల్లి సలోమి సిల్వర్ మెడల్ సాధించింది. సలోమికి టోర్నమెంట్ చీఫ్ ఆర్గనేజర్ సినీ ప్రొడ్యూసర్ సి. రాజు , కాయి తెలంగాణా ప్రెసిడెంట్ నరేంద్ర, సెక్రెటరీ శ్రీనివాసు, సీనియర్ మాస్టర్ రవీంద్ర, మాస్టర్ దయాకర్, సురేష మెడల్, సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు.

బొంతు శ్రీదేవిని కలిసిన ఇందిరా నగర్ కాలనీ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ ఇందిరా నగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ బీవీ.నర్సింహరెడ్డి, జనరల్ సెక్రెటరీ భాస్కరాచారి, వైస్ ప్రెసిడెంట్ శివారెడ్డి, కృష్ణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, రాం ప్రసాద్, ట్రెజరర్ వెంకటరావు, కాలనీ మెంబర్లు భిక్ష పతిగౌడ్, వెంకటేష్, నజీర్, అహ్మద్, విజయ్, సీఎంరెడ్డి, సాయి వంశీ, శ్రీ చరణ్, అరుణ్, లోకేష్, రవి కుమార్, నాయకులు బాల్‌రెడ్డి, కనకరాజ్‌గౌడ్, విద్యా సాగర్, శ్రీకాంత్ యాదవ్, రాఘవ రెడ్డి, నర్సింహ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించిన శ్రీదేవి

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని డెక్కన్ కాలనీలో వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న మంచినీటి పైప్ లైన్ పనులను, వీఆర్ కాలనీలో 250మీటర్ల మంచి నీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి
- ఇతర సమస్యలు పరిష్కరించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్,ఎంఈవో కార్యాలయాల ఎదుట ధర్నాలు



శామీర్‌పేట్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (సీఐటీయూ- ఏఐటీయూసీ) పిలుపు మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు ధర్నాలకు దిగారు. ఈ సందర్భంగా కీసర, మల్కాజిగిరి, దుండిగల్, అల్వాల్, కాప్రా, శామీర్‌పేట, ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ప్రభుత్వం తమనెందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, తమ గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, పండిచ్చేరి రాష్ట్రాల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినట్టు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో హెల్త్ కార్డులు ఇచ్చారని, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తదితర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. కర్నాటకలో గ్రాడ్యుటీ చెల్లిస్తున్నామని, తమకెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలని, పీహెచ్‌సీల్లో వంట చేసే విధానాన్ని రద్దు చేయాలని, జీపీఎస్ యాప్‌ను రద్దు చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు సునిత, ఉపాధ్యక్షురాలు బాలమణి, సహాయ కార్యదర్శి శివరాణి, శైలజ, అరుణ, రాణి, ఆశారాణి, వహిద, మంజు, రాధ, సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్, అశోక్, జి.శ్రీనివాసులు, వెంకన్న, జి.గణేష్, సబిత, లింగస్వామి, పాల్గొన్నారు.


కాప్రాలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

'అంగన్వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి'



నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం. వినోద, సీఐటీయూ ఉప్పల్ నాయకులు వెంకన్న మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు అంగన్వాడీ టీచర్స్‌కు సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. సమస్యలను పరిష్క రించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో సీఐటీయూ నాయకులు జోసెఫ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ప్రేమలత, శుక్ల , హరిప్రియ, సంతోష్, వాణీ, నాగరాణి, స్వాతి, అవిల్లమ్మ రాజేశ్వరి, లలిత, ఉష తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

- బీసీ కార్మిక సేవా సంఘం యూత్ అధ్యక్షుడు దాసరి విజయ్



నవతెలంగాణ-శామీర్‌పేట

బీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని బీసీ కార్మిక సేవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు దాసరి విజయ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. రమేశ్‌గౌడ్, దాసరి విజయ్ ముదిరాజ్‌కు శామీర్‌పేటలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధనకు అహర్నిశలు పాటుడాలని సూచించారు. బీసీల కులవృత్తుల అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపారు. అనంతరం దాసరి విజయ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. బీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేమురి శివగౌడ్, దాసరి మహేష్, దాసరి భూపాల్, రుద్రబోయిన అశోక్, యాదగిరి, నిరుగొండ బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్‌ను గెలిపించాలి

- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ నియోజకవర్గంలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్‌కు ప్రజా పార్టీ పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం కొంపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యావంతుడైన వెంకటేశ్వర్లు యాదవ్‌కు మేడ్చల్ నియోజకవర్గంలోని ఓటర్లందరూ మద్దతు తెలిపి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ 20 ఏండ్ల నుంచి ఐటీ, పరిశ్రమ అభివద్ధిపై అనేక సేవా కార్యక్ర మాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నిరుద్యోగ యువతకు ఐటీ రంగంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అన్ని వర్గాల ప్రజలందరూ ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్‌కు అండగా ఉండాలన్నారు. ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ.. తనకు మద్దతు తెలుపుతున్న ప్రజా పార్టీ అధ్యక్షుడు అజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పలు పార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కుల సంఘాలన్నీ మద్దతు కూడగట్టుకుని ముందుకు వెళ్తానన్నారు. ఈ సమావేశంలో ప్రజా పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు అంజి యాదవ్, స్టేట్ మీడియా కన్వీనర్ ప్రశాంత్, పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-ఘట్కేసర్

రోటర్ డ్యామ్ రాష్ట్రస్థాయి రెండో రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్‌లో గెలుపొందిన వారికి సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. దేవేంద్ర విద్యాలయ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో, మెరిడియన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. వారికి మేయర్ జక్కా వెంకటరెడ్డి ముఖ్యతిథిగా హాజరై ట్రోఫీలు అందజేశా రు. కార్యక్రమానికి రోటర్ డ్యామ్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి, తెలంగాణ రోప్ స్కిప్పింగ్ జనరల్ సెక్రటరీ భాను ప్రకాష్ నాయర్, పీర్జాదిగూడ కార్పొరేటర్ శారదా ఈశ్వర్‌రెడ్డి, రోటర్డ్యామ్ డైరెక్టర్ శ్వేతారెడ్డి, హాజరయ్యారు.

అంతకుముందు జక్కా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ "ఒక మంచి అభిరుచితో ఆశయ సాధనే తమ లక్ష్యంగా పాల్గొన్నారని చెప్పారు. రోప్ స్కిప్పింగ్ జనరల్ సెక్రటరీ భానుప్రకాష్ నాయర్ మాట్లాడుతూ.. గతేడాది ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనడం ఆనందకరం అన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి చేరికలు : మంత్రి



నవతెలంగాణ-ఘటకేసర్

బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని యానంపేటలో రూ.50లక్షలతో సీసీరోడ్డు, పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. 3వ వార్డు పరిధిలోని లక్ష్మీనరసింహా కాలనీలో రూ.15 లక్షలతో సీసీరోడ్డు, 15వ వార్డు బాబా నగర్‌లో లైబ్రరీ, రూ.50లక్షల ఎమ్మెల్యే నిధులతో భూగర్భ డ్రయినేజీ ఔట్‌లెట్, గణేష్ నగర్‌లో రూ.12లక్షలతో సీసీరోడు, 17వ వార్డు సురేందర్ రెడ్డినగర్ కాలనీలో సీసీరోడ్డు పనులకు మున్సిపాలిటీ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లారెడ్డి శకుస్థావన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలో స్థానికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే విధంగా చూస్తానన్నారు. నియోజకవర్గానికి 11 వందల ఇండ్లను కేటాయించారని, వాటిని రెండు దశలుగా పంపిణీ చేస్తామన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మీ పథకం వర్తింపజేస్తామన్నారు. అనంతరం కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆధ్వర్యంలో 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ నానావత్ రెడ్యా నాయక్, కమిషనర్ వేమన్ రెడ్డి, ఏఈ నరేష్ కుమార్, కౌన్సిలర్లు నర్రి ధనలక్ష్మీ, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నల్లవెల్లి లక్ష్మీ, అబ్బవతిని సరితి స్వామి, సుర్వి సుధా లక్ష్మీ కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ ఆలీ, దాసరి శంకర్, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మందడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, ఘటకేసర్ మండల అధ్యక్షుడు నాగులపల్లి రమేష్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



- మున్సిపల్ కమిషనర్ టీఎస్‌వీఎన్ త్రిల్లేశ్వర్‌రావు

నవతెలంగాణ-మేడ్చల్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ టీఎస్‌వీఎన్ త్రిల్లేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వీపు ఎన్నికల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పీలు ముగ్గుల వేసి ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తున్నే మార్చేస్తుందని అన్నారు. కుల,మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18ఏండ్లు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 1వ తేదీతో 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రవణ్ కుమార్ గుప్తా, మున్సిపల్ ఇన్‌చార్జి ఆర్వో రాంచందర్, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com

నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ పరిశీలించారు. రోడ్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నమన్నారు. నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని, నాణ్యత ప్రమాణంలో రాజీ పడేది లేదని తెలిపారు. సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ కాంట్రాక్టర్లకు సూచించారు. డివిజన్‌లోని సోనియా గాంధీ నగర్‌లో రూ. 35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి మంత్రి సత్యనారాయణ పరిశీలించారు. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం ప్రతి కాలనీకి నాణ్యమైన రోడ్డు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హెచ్ఎల్ బషీరుద్దీన్ , నగేష్ , రాణి , గణేష్ రెడ్డి , స్థానికులు తదితరులు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- డీసీ రాజు



నవతెలంగాణ-మల్కాజిగిరి

హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటి కమిషనర్ గోధుమలు రాజు అన్నారు. సోమవారం వినాయక నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సోమవారం బృందావన గార్డెన్స్ ఆనంద్ బాగ్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

గణేశ్ నిమజ్జనానికి అంతా సంసిద్ధం చేసుకోవాలి

- మీ సమిష్టి కృషి, సమన్వయంతోనే నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించగలం
- అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్



నవతెలంగాణ-మల్కాజిగిరి

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాలైన భద్రత ఏర్పాట్లు సంసిద్ధం చేసుకోవాలని రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహన్ ఐపీఎస్ అన్నారు. సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఘనంగా నిర్వహించనున్న గణేష్ నవరాత్రులు, నిమజ్జనానికి చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తల మీద రాచకొండ సీఎ౦ డీఎస్ చౌహన్ ఐపీఎస్ నేరేడ్మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖతోపాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది సమిష్టి కృషి, సమన్వయం తోనే గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించగలమని వారిని ఉద్దేశించి అన్నారు. గణేష్ నవరాత్రోత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన రాచకొండ పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులతోలి సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా గణేష్ ఉత్సవాల సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తల మీద చర్చించడానికి వీలుంటుందని, నిమజ్జనం ప్రశాంతంగా ఎటువంటి శాంతి భద్రతల సమస్య లేకుండా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. గణేష్ విగ్రహ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన సీపీ, పలు చెరువులు, కుంటలు, చిన్న చెరువులు, సరస్సులను నిమజ్జనానికి నోటిఫై చేశామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వం నోటిఫై చేసి, ఏర్పాటు చేసిన చెరువులు, సరస్సుల్లో మాత్రమే నిమజ్జనానికి భక్తులు రావాలని సీపీ సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని సీపీ ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా అధికారుల సమన్వయంతో ముందుగానే చెరువులు, ఇతర నిమజ్జన నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్రేన్ ఆగిపోకుండా ఎప్పటికప్పుడు క్రేన్ ఆపరేటర్లు రెడీగా ఉండేవిదంగ చూసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లను, బారికేడ్లను, మంచినీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. నిమజ్జనానికి చేరుకునే దారుల్లో రోడ్లమీద ఎటువంటి ఆటంకాలు గుంతలు లేకుండా చూడాలని ప్రజలు, భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతు పనులు, శానిటైజేషన్ పనులను చేపట్టాలన్నారు. నిమజ్జనోత్సవానికి అవసరమైన పోలీస్ బందోబస్తు, స్విమర్స్, నిమజ్జనానికి వినియోగించే భారీ క్రేన్స్, లైటింగ్స్, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు కావాల్సిన అనుమతులు పోలీసుల నుంచి తీసుకోవాలని, జీహెచ్ఎంసీ సూచనలను పాటించాలని, ఉత్సవాలు పూర్తయ్యే వరకు భక్తులు, నిర్వాహకులు భద్రతా చర్యలు పాటించాలని సీపీ పునరుద్ఘాటించారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహిం చేందుకు నిర్వాహకులు సహకరించాలని సీపీ కోరారు. ఈ సమావేశంలో యాదద్రి డీసీపీ రాజేష్ చంద్ర ఐపీఎస్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ 1 అభిషేక్ మహంతి ఐపీఎస్, డీసీపీ ఎస్వో బాలస్వామి ఐపీఎస్, ఎస్ఓటి మల్కాజిగిరి డీసీపీ గిరిధర్ ఐపీఎస్, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ ఐపీఎస్, ఎల్బి నగర్ డీసీపీ సాయి శ్రీ, ట్రాఫిక్ డీసీపీ 2 శ్రీనివాసులు, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్. టి, డీసీపీ క్రైమ్స్ అరవింద్, డీసీపీ రోడ్ సేఫ్టీ శ్రీబాలా, ఎస్ఓటి డిసిపి 2 మురళీధర్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ రవీందర్ రెడ్డి, ఎల్బి నగర్ జోనల్ కమషనర్ పంకజ, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీకి షాక్.. కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి చేరికలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి వందలాది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతుండటంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతోంది. తాజాగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం 129 డివిజన్ పరిధిలో సంజయ్ గాంధీనగర్‌కు చెందిన రోషన్‌తో పాటు దాదాపు 300 మంది బీఆర్ఎస్, బీజేపీల కు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ అవినీతి పాలనపై నిరంతర పోరాటం చేస్తున్న.. రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. అవినీతి పాలన సాగి స్తోన్న బీఆర్ఎస్ పార్టీని గద్దెదించి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చేందుకు నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ వైపు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇండ్లు నిర్మించుకునేం దుకు కాంగ్రెస్ పార్టీ రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేస్తుందంటూ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్. అవిజె జేమ్స్, సిద్దనోళ్ళ సంజీవ రెడ్డి, వీరేష్ గుప్తా, సంగం వెంకటేష్, బుజ్జి (అనిల్), సంతోష్ ముదిరాజ్, హనీఫ్, బాబన్, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10వ రోజు పాదయాత్ర చేసిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు, శేరిలింగంపల్లి శాసన సభ్యులు, ప్రభుత్వ వీప్ ఆరెకపూడి గాంధీ పిలుపుమేరకు ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆల్విన్ కాలనీ డివిజన్ సమస్యలపై చేస్తున్న పాదయాత్రలో భాగంగా సోమవారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, మహాత్మాగాంధీ నగర్, గణేష్ నగర్, తారకరామ్ నగర్ కాలనీలలో జీఎచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అభివృద్ధి పనులన్నీ దాదాపు తొంభై శాతం పూర్తయ్యాయని అన్నారు. కాలనీలలో కొంతమేర పెండింగులో ఉన్న డ్రయినేజీ సీసీ రోడ్డు పనులను తొందరలో పూర్తిచేస్తామని తెలిపారు. మ్యాన్ హెల్స్ మూతలు, విద్యుత్ దీపాలు, విద్యుత్ వైర్లు వంటి చిన్న చిన్న సమస్యలను స్థానికులు మా దృష్టికి తీసుకువచ్చారని, వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. పాదయాత్ర చేస్తూ ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆప్యాయంగా స్వాగతం పలుకుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు, డ్రయినేజీ, త్రాగునీరు వంటి ఎటువంటి సమస్యలు ఉన్నా పాదయాత్రలో భాగంగా నోట్ చేసుకుని త్వరలో పూర్తిచేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మబండలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని మరియు అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పేసేంట్లు మరియు పిల్లలతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు మరియు అందించిన సంక్షేమ పథకాలను ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి అందించారు. ఈ కార్యక్రమంలో జీఎచ్ఎంసీ అధికారులు వాటర్ వర్క్స్ రవీందర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, లైన్ మ్యాన్ నరసింగరావు, ఎస్.ఎఫ్.ఎ మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, కాశినాథ్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కూకట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభించారు. ముందుగా ఉదయం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు కార్యాలయంలో లక్ష్మి నరసింహ స్వామి వ్రతం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం జరిగిన కుకట్‌పల్లి ప్రగతి నివేదన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లిలో ఒకప్పుడు, ఏవీబీపురం ప్రశాంత్ నగర్ కూకట్‌పల్లి గ్రామంలో ఆడపిల్లలు మంచి నీరు లేక ఇబ్బంది పడే వారన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కొన్ని లక్షల గ్యాలన్ల నీటి రిజర్వాయిర్లు కట్టి నేడు ఆ కొరత తీర్చామని అన్నారు. అలాగే కూకట్‌పల్లిలో 436 ఏండ్ల చరిత్ర గల రామాలయం పునర్ నిర్మాణం చిత్తరమ్మా దేవాలయంతో పాటు, మసీదు, చర్చిలకు కూడా తన వంతు సహాయం అందించి అభివృద్ధి చేశామని తెలిపారు. ఎంపీగా గెలిపించిన రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నాడు, వచ్చిన ఎంపీ నిధులు ఎక్కడ పెడుతున్నది ఎవరికి తెలియదు అని ఎద్దేవ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడైనా ఫించన్లు 3 వేలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. నిరుపేదల ఆడ బిడ్డ పెళ్లికి 1 లక్షా 116 ఇచ్చిన ఘనత ఉందా అని ప్రశ్నించారు. అలాగే అర్హులకు అందరికీ డబుల్ బెడ్ రూం ఇల్లు వస్తాయని దీంట్లో సందేహం లేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధి చూసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో పాటు నియోజక వర్గ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వం అంగన్ వాడి సమస్యలు పరిష్కరించాలి



- కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలి
- సీఐటీయు

నవతెలంగాణ-దుండిగల్

చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు అంగన్ వాడి ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ఎంతో సేవలు అందిస్తున్నారని, వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించి, పర్మినట్ చేయాలని కనీస వేతనం రూ.26000 వేలు ఇవ్వాలని సీఐటీయు దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి అన్నారు. దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలోని అంగన్వాడి టీచర్ల సమస్యలు పరిష్కారం చేయాలని సోమవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయు మండల కన్వీనర్ లింగస్వామి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమాలు తెలిపారు. అనంతరం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కి , కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుండి అంగన్వాడీలో పనిచేస్తున్న టీచర్లను ఆయాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారని తక్షణమే ప్రభుత్వం స్పందించి వీరి న్యాయమైన కోరికలు తీర్చాలని తెలిపారు లేనియెడల సమ్మెను మరింత ఉధృతం చేసి ప్రజలందరి మద్దతు కూడగట్టి పెద్ద పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో రాధా , సునీత , శోభ రాణి, విజయనిర్మల , పద్మావతి ,ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఫారెస్ట్ భూమి కబ్జాకు యత్నం '



- కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కీసర గ్రామంలో ఫారెస్ట్ భూమిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారని, కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కీసర గ్రామానికి చెందిన జలాల్పురం సత్తిరెడ్డి కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ కీసర గ్రామంలోని సర్వే నెంబర్ 131లో 105.26 గుంటల ఫారెస్ట్ భూమి ఉందని.. ఈ భూమి లోపలికి కమసాని సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి చొరబడి చెట్లు నరికి భూమిని చదును చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ నెల 9వ తేదీన రెండు ఇటాచీలు, ట్రాక్టర్ల సహాయంతో భూమిలో బ్లాస్టింగ్ చేసినట్టు తెలిపారు. ఈ బ్లాస్టింగ్ సమయంలో కీసరగుట్ట చౌరస్తాలో ప్రజలు ఉన్నారని, వారిలో ఒక వ్యక్తి తలపై బండరాయి పడి తీవ్ర గాయాలైనట్టు గుర్తు చేశారు. క్షతగాత్రుడు లేబర్ అని కూడా తెలిపారు. కీసర గ్రామానికి దాదాపుగా 610.89 హెక్టార్ల అటవీ భూమి అంటే 1508.24 ఎకరాలు అటవీ శాఖకు చెందిన భూమి ఉండాలని తెలిపారు. ఈ అటవీ ప్రాంతంలో కాలేజీలు, క్రషర్స్ విచ్చలవిడిగా వెలసినట్టు పేర్కొన్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. సీఐకి ఫోన్ లైన్‌లో సమాచారం అందించినా కనీస స్పందన లేదని చెప్పారు. కామసాని సుధాకర్‌రెడ్డి ఫారెస్ట్ భూమిని కబ్జా చేస్తున్నా కాపాడలేని సంబంధిత అధికారులను విధుల నుంచి తొలగించి అటవీ భూమిని రక్షించాలని ప్రజావాణిలో కోరారు. ఈ వ్యవహారం అంతటికి ముఖ్య కారకుడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, రవి ప్రకాష్ అని, వీరిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్ధారణ కోసం కీసర విలేజ్ మ్యాప్, ఇతర మ్యాపులు జతపర్చినట్టు తెలిపారు.



అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

- బాలానగర్ తహసీల్దార్ వై. శ్రీనివాస్



నవతెలంగాణ-బాలానగర్

18 ఏండ్లు నిండినవారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళశాలలో విద్యార్థులకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రో.కె.పద్మావతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్లు చాలా చైతన్యంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తద్వారా అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా నిర్ణయాత్మక పాత్రను పోషించడమే కాకుండా అభివృద్ధికి చేయూతనిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యం విజయవంతం కాపడానికి ఓట్లు చాలా ఉత్తమమైన పాత్రను పోషించడమే కాకుండా చైతన్య పర్చడంలో ప్రధాన భూమికను పోషిస్తుందని చెప్పారు. ఓట్లు వెలకట్టలేనివని, వసతుల కల్పనకు చాలా గొప్పగా వ్యవహరిస్తాయని మరియు భవిష్యత్తు నిర్దేశిస్తుందన్నారు. ఏ ప్రజాస్వామ్య దేశమైనా విజయవంతమవడానికై ఓటర్లను జాగృత పర్చాలని వారికి అన్ని వసతులను తప్పనిసరిగా అందించాలని చెప్పారు.

ప్రజల సహకారంతోనే సమస్యలు పరిష్కారం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా సహకారంతోనే సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తున్నానని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో కలిసి సోమవారం పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్డు, డ్రయినేజీ, పనులను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో స్పందించిన ఆయన మాట్లాడుతూ డ్రయినేజీ సమస్యతో పాటు రోడ్డు పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను త్వరలోనే పూర్తి చేస్తానని తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ. తిరుపతి, వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్, స్థానిక నాయకులు హాజీ , సత్యరాజ్, సన్నీ బాయ్, రామరాజు, కిరణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



- కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి
- సీఐటీయు

నవతెలంగాణ-మల్కాజిగిరి/దుండిగల్

రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్ బడి ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి మండల కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేపట్టారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర పిలుపులో భాగంగా మండల కేంద్రంలో నిరవధిక సమ్మెకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా మల్కాజిగిరి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద అంగన్వాడి ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించి ఎమ్మార్వో వెంకటేశ్వర్లుకు సమస్యల విజ్ఞాపన అంద చేయడం జరిగిందని తెలిపారు. ఈ అంగన్వాడీ ఉద్యోగుల ధర్నాకు ముఖ్య అతిథిగా సీఐటీయు జిల్లా కమిటీ నాయకులు, మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శి బంగారు నర్సింగ రావు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా టీచర్స్ హెల్పర్స్ అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఈఎస్ఐ , పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. 60 సంవత్సరాల పైబడిన అంగన్వాడి టీచర్స్ కు , వర్కర్స్ కు వాలంటరీ రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలి. పీఆర్సి ఏరియల్ 2021 జూలై అక్టోబర్ నవంబర్ మూడు నెలలవి పెండింగులు వెంటనే చెల్లించలేదు. వర్కర్స్ కు టీచర్స్ అందరికి హెల్త్ కార్డులు జారీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ గారు ఇచ్చిన హామీలు అమలు జరపటం లేదన్నారు. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ ఐక్యంగా ఆందోళన పోరాటంలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం దిగి వచ్చి అంగన్వాడి వర్కర్స్ ఆయాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మల్కాజిగిరి మండల నాయకురాలు ఎర్రోళ్ల సుమిత్ర అంగన్వాడి టీచర్స్ శోభ, ఆశలత, మీనాక్షి, రాణి ఎస్కే షాహిని, భాగ్యలక్ష్మి, అనురాధ, శ్రీదేవి, స్వప్న పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందుతారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు.జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల కొండపై వెలిసిన మాణిక్యేశ్వర మాత ఆలయం ఆలయంలో చివరి శ్రావణ సోమవారం సందర్భంగా చాముండేశ్వరి హెూమ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్ స్వామి, ప్రవీణ్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు విట్టల్ రెడ్డి, సుభాష్ రెడ్డి, ఉదయ్ ,నాగరాజు, రెడ్డి, నాయకులు విట్టల్ ముదిరాజ్, కరుణాకర్, విగ్నేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి..



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 130 అర్జీలు స్వీకరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ విషయంలో అధికారులు ప్రాధాన్యతాక్రమంలో అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి 130 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి ప్రజలు అందజేసే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమస్యలకు సంబంధించి వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని, వాటిని సైతం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ,గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్ పరిధిలో శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఒడిబియ్యం అన్నదాన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ భాయ్, గడ్డం నరసింహ, బోనాల చిన్న గౌడ్, మురళీకృష్ణ ,మహేందర్ రెడ్డి, పాల్గొన్నారు.



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

10

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com



చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ బంజారాహిల్స్ లోని టీడీపీ భవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ జూబ్లీహిల్స్ సనత్ నగర్ నియోజకవర్గాలతో పాటు నగరంలోని అన్ని నియోజక వర్గాల ప్రధాన నాయకులు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్లా కార్డులను ప్రదర్శించి తమ నిరసనను తెలియజేశారు.

- నవతెలంగాణ-బంజారా హిల్స్

18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి : ఎఈఆర్ఒ ఎమ్ ఎస్ శైలజ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ అసిస్టెంట్ ఎలక్ట్రో ల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఎఈఆర్ఒ)ఎమ్ఎస్ శైలజ తెలిపారు. సోమవారం అబిడ్స్ లోని ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు.ప్రజలకు ఓటునమోదుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఇప్పటివరకు 14,500 మంది కొత్త ఓటర్లుగా పేరు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈనెల 19 తేదీ వరకు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమాన్ని వాల్ పోస్టర్ల ద్వారా యువతకు,ప్రజలకు, మహిళలకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పార్లమెంట్ సమావేశాల్లో రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

- జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏండ్లుగా మహిళా బిల్లుకు మోక్షం లభించకుండా పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. అనాదిగా అన్ని రంగాల్లో మహిళలకు అన్యాయం జరుగు తోందని ఆవేదన, మహిళా బిల్లు కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టిన పోరాటానికి ఇప్పటికే దేశవ్యాప్తంగా మద్దతు లభించిందని, అందువల్ల ఆ బిల్లును ఆమోదించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని వారు స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఏకమై అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని డిప్యూ టీ మేయర్ తెలిపారు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ విజ్ఞప్తి చేశారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం కేసీఆర్



నవతెలంగాణ-ఓయూ

సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వివిధ చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. వెనుక బడిన కులా లకు ప్రయోజనం కలిగించే ఇటువంటి కార్యక్రమాలకు ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీసీ కులాల లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం సితాఫలమండీ క్యాం పు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కులాలకు చెందిన వారికీ ఆర్థికంగా ఉపకరించి, స్వయం ఉపాధిని కల్పించేందుకు వీలుగా లక్ష రూపాయల మేరకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నామన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలకు నిరంతరం తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ యువ నేతలు కిషోర్ కుమార్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 మంది లబ్దిదారులకు రూ. లక్ష మేరకు ఆర్థిక సాయం చెక్కులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అందించారు.

ఇండ్ల మరమ్మతులకు సర్కారు సాయంతో ఉపశమనం

- గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

వాంబే, జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇండ్లకు మరమ్మ తులు చేపట్టేందుకుగానూ సర్కారు 100 కోట్ల రూపాయలు మంజూరు చేసేందుకు నిర్ణయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో శిథిలావస్థలో ఉన్న, ఇండ్లు కూలిన బాధితు ల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయ డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి తెలిపారు.ఈ నేపథ్యంలో తార్నాకలోని చంద్రబాబు నాయుడు నగర్ బస్తీ వాసులు, స్థానికులు గ్రేటర్ హైదరా బాద్ నగర డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని కృతజ్ఞతలు తెలి పారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా ఇల్లు కోల్పోయిన బాధితులను పరామర్శించి, వారికి ఆర్థికంగా అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నివాసాలు లేక, వర్షాల కారణంగా ఇండ్లు కూలి ఇబ్బందులు పడుతున్న వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు అందేలా తమవంత సహకారం అందిస్తామని తెలిపారు.

నిర్మాణాత్మక కార్యకలాపాలకు హైదరాబాద్ నిలయం

- ఐటి కార్యదర్శి జైయేష్ రంజాన్, ఐఏఎస్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీజేపీ మతోన్మాద ఫాసిస్టు నియంతృత్వ విధానాలు, బడా సంపన్న అనుకూల విధానాలు, పేదల ప్రజల వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సభ్యులు తెలిపారు. అదేవిధంగా కేసీఆర్ ప్రభుత్వ అడ్డు అదుపు లేని అవినీతి, ఆర్థిక దోపిడీ నియంతృత్వ రాచరిక పాలనకు వ్యతిరేకంగా వామ పక్ష పార్టీలు, లౌకిక ప్రజాస్వామిక సంస్థలు కలిసి ఐక్యంగా ఉమ్మడి కార్యచరణ కొరకు గత రెండు నెలలుగా అనేక దఫాలు సమావేశాలు నిర్వహించినట్లు, ఉమ్మడి విధానపత్రం, ఉమ్మడి కార్యచరణను రూపొందించుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం),సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ (యు) న్యూ డెమోక్రసీ, ఆర్ఎస్‌పీ, బీఎల్ ఎఫ్,భారత జాతీయ ఉద్యమ సంఘం,తదితర అనేక లౌకిక ప్రజాసంఘాలు కలిసి విధాన పత్రాన్ని, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉమ్మడి కార్యచరణను విస్తృతంగా చర్చించి రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సోమజిగుడా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్తగా నైనాల గోవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సభకు వినాయ కొరెడ్డి(రిటైర్డ్ ప్రొఫెసర్) అధ్యక్షత వహించారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లా డుతూ బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆదాని అంబానీ లాంటి కొద్దిమంది పెట్టుబడి దారులకు దోచిపెడుతున్న తీరును వివరించారు. కేసీఆర్ పభుత్వం తెలంగాణలో ఒక ఆధునిక రాచరిక వ్యవస్థను నెలకొలిపి ప్రజల హక్కులను ఉక్కు పాదంతో అణిచివేసిందని ఈ సందర్భంగా తెలిపారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వాడి చలపతిరావు మాట్లాడుతూ మత విభజన విద్వేషాలను దేశంలో రెచ్చగొడుతూ ప్రజల వాస్తవ జీవిత సమస్యల నుంచి పక్కదారి పట్టిస్తూ, అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదా రులకు దారాధత్తం చేస్తుందన్నారు. కే గోవర్ధన్, బాల మల్లేష్, హన్మేష్, జానకి రాములు, తుకారాం గుర్రం విజయ్ కుమార్, కృష్ణ ప్రసాద్ తదితర నాయకులు పాల్గొని మాట్లాడారు.తెలంగాణ లోక్‌సత్తా అధ్యక్షులు మన్నారం నాగరాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, సోగరా బేగం, అబ్దుల్ హుక్ కమీర్, ఇస్లాముద్దీన్, కామేశ్వరరావులు తదితర పాల్గొన్నారు.

కృష్ణకాంత్ పార్క్‌లో పనులను పూర్తి చేయండి



- కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

యూసుఫ్ గూడ కృష్ణకాంత్ పార్క్‌లో ప్రజలకు, వాకర్స్ కోసం మంజూరు చేసిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌తో కలిసి కృష్ణకాంత్ పార్క్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ స్థలం, ఎస్.పీ.ఆర్ ప్లేగ్రౌండ్‌లను పరిశీలించారు. కమిషనర్ మాటా డుతూ కృష్ణకాంత్ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, వాష్ రూమ్, టాయిలెట్, సీవరేజ్ డ్రైన్ బాక్స్ నిర్మాణం, క్యాంటీన్ మరమ్మతులు పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకు ండా వెంగళరావునగర్ లో చేపట్టనున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన నేపథ్యంలో అంచన ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రహమత్ నగర్‌లో ఎస్.పీ.ఆర్ ప్లే గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అం చనాలు తయారు చేయాలని ఆదే శించారు. కష్ణకాంత్ పార్క్‌లో ప్రతిపాదించిన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపది కన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట అడిషనల్ కమిషనర్ వి.కష్ణ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈ ఈ రాజ్ కుమార్ కార్పొరేటర్లు దేదీప్య, సి.యన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష తగదు



- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య
- వన్ నేషన్-వన్ ఎలక్షన్‌లో బీసీల వాటా ఎంత? సీట్లు ఎన్ని?
- బీసీ బిల్లు పెట్టిన తర్వాతనే వన్ నేషన్-వన్ ఎలక్షన్ పెట్టాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో బీసీ బిల్లు మహిళా బిల్లు పెట్టాలని తర్వాతనే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు ప్రవేశపెట్టాలని లేనియెడల 21న చలో ఢిల్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం కాచిగూడ అభినందన్ హెూటల్లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జరిగిన అభివృద్ధి గురించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్ర మంత్రులు ప్రకటించారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళా బిల్లులో మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో బీసీ లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని సెప్టెంబర్ 21న చలో ఢిల్లీ ఉద్యమ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.6 సంవత్సరా లుగా బీసీలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని, పార్లమెంటు ప్రత్యేక సమావే శాలలో మహిళా బిల్లు పెట్టాలని ప్రతిపాదించారు. అయితే మహిళా బిల్లులో ఆర్. బీసీ/ఎస్సీ/ఎస్టీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికి మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది అని లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం ల మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్ల తో పాటు విద్యా ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్ల ను ప్రవేశపెట్టాలని, రాజ్యాంగ రచనలో బి.సిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాలలో రిజర్వేషన్లు పెడితే ఎంతో ప్రగతి జరిగేదన్నారు. బీసీ నాయకులు నీలం వెంకటేష్, రాజు కుమారు, అనం తయ్య, ఆది మల్లేష్, సుధాకర్, గంగాభవాని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఎల్బీ స్టేడియం వద్ద చెటు కొమ్మల్లో మాంజా ఉచ్చులో చిక్కుకొని విలవిలలా డుతున్న కాకిపక్షిని ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్‌రాజు కాపాడినట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వ ర్యంలో సోమవారం అబిడ్స్‌లోని స్టాన్లీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహిం చారు. ఈ సందర్భంగాఆయన శంకర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులో డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదమన్నారు. ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్. హెచ్ ఓ డి అనురాధ. ప్రొఫెసర్ గంగాధర్. ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారం కృషి

కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్ పేట కార్పొ రేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని న్యూ పటేల్ నగర్‌లో నూతన డ్రయినేజ్ పైప్ లైన్ వేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్ ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ వీలైనంత తొందరగా నూతన డ్రయినేజ్ పైప్ లైన్లు వేయాలని సమస్య పునారావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ నాయకులు రామ్ చందర్ గుప్తా,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, మహేష్ ముదిరాజ్,ఆదిల్,యూసుఫ్ బాబా,లక్ష్మణ్, శంకర్ గౌడ్,ఏఈ యాదగిరి రెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ, ఎస్ఎఫ్ఏ సిబ్బంది ఉమేష్,పాషా,విజయ్,చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణేష్‌లను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడదాం

- హెచ్ఎండీఏ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఇ) సిహెచ్. పరంజ్యోతి



నవతెలంగాణ-ముషీరాబాద్

పర్యావరణానికి హానికరం కాని మట్టి గణేష్ విగ్రహాలనే ప్రతిష్టించాలని హెచ్ఎం డిఏ సూపరింటెం డెంట్ ఇంజనీర్ (ఎస్ఇ) సిహెచ్. పరంజ్యోతి అన్నారు. సోమవారం హెచ్ఎండిఏ హెడ్ఆఫీస్‌లో హెచ్ఎండిఏ - హైదరాబాద్ జిందాబాద్‌ల ఆధ్వర్యంలో మట్టి గణేష్‌ల ఉచిత పంపిణీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ. ఈ ఏడాది లక్ష మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ లాంటి స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా విగ్రహాలు పంపిణి చేస్తున్నాయని, కీలక కూడళ్లు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య మాట్లాడుతూ పర్యావరణానికి హాని చెయ్యని మట్టి విగ్రహాలనే ప్రతిష్టించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ ఉపాధ్యక్షులు బి.ఎన్ .సుదర్శన్, సంయుక్త కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, పి. శ్రీనివాస్‌రావు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ నిధులను ప్రజా సంక్షేమానికే ఉపయోగిస్తాం



- తెలంగాణ ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్
- సినీ నటి హేమ జిల్లోజు ఆప్‌లో చేరిక

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అవినీతికి తావులేకుండా పౌరులకు ఉచిత విద్య, విద్యుత్, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను, ఇతర సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వ నిధులను ఉపయోగిస్తామని హామీ ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరుస్తామని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. సోమవారం హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ 119 అసెంబ్లీ నియో జక వర్గాల్లో ఆప్‌అభ్యర్థుల గెలుపుకోసం వ్యూహలు రూపొందించడానికి సెప్టెంబర్ 24న హైదరా బాద్ లో ఆప్ వాలంటీర్‌ల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, ఇం దులో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్ లు, జిల్లా ఇంచార్జిలు, మండల కన్వీనర్ లు పాల్గొంటారని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం 119 స్థానాల్లో పోటీ చేస్తుందని, ఖచ్చితంగా అసెంబ్లీలోకి అడుగుపెడుతామన్నారు. గొప్ప తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్షికోత్స వాలను ఆప్ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తుందని, అందులో భాగంగా హైదరాబాద్ ఆప్ రాష్ట్ర కార్యాల యంలో జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని దిడ్డి సుధాకర్ తెలిపారు.

సినీ నటి హేమ జిల్లోజు ఆప్ లో చేరిక

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ సమక్షంలో టాలీవుడ్ సినీ నటి హేమ జిల్లోజు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు.ఆప్ టోపీ, ఖండువా వేసి ఆమెను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా హేమ జిల్లోజు మాట్లాడుతూ అవినీతిని అంతం చేయాలనే నిబద్ధతతో అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టి పెను మార్పు తీసుకువచ్చిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను చూసి ఆప్‌లో చేరాలని నిశ్చయించుకున్నాన్నారు. ఈ సమావేశంలో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఎండి.మజీద్, డాక్టర్ పాండు రంగయ్య, దివ్య, కమిటీ అధ్యక్షులు దర్శనం రమేష్, అధికార ప్రతినిధి ప్రవీణ్ యాదవ్, నేతలు సలావుద్దీన్, ఫైజల్ పాల్గొన్నారు.

జూనియర్ సీనియర్ అసిస్టెంట్‌లను క్రమ పద్ధతిలో బదిలీ చేయాలి

కాంగ్రెస్ నాయకుడు బిట్టు భరత్ ప్రసాద్



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా సంవత్సరాలుగా బదిలీలు కాకుండా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న జూని యర్ సీనియర్ అసిస్టెంట్లను క్రమ పద్ధతిలో బదిలీ చేయాలని యువజన కాంగ్రెస్ నాయకుడు బిట్టు భరత్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.హైదరాబాద్ వ్యాప్తంగా రెవె న్యూ మండల, కలెక్టర్, ఆర్డిఓ కార్యాలయాలలో విధులు నిర్వహిస్తు న్న జూనియర్ సీనియర్ అసిస్టెంట్లు గత తొమ్మిది సంవత్సరాలుగా రెగ్యులర్ పద్ధతిలో బదిలీ అవ్వ కుండా ఒకే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నవారిని క్రమపద్ధతిలో బదిలీ చేయాలన్నారు. కరోనా కారణంగా బదిలీకి నోచుకోని సిబ్బంది కరోనా తరువాత కూడా తమ పలుకుబడితో ఒకే కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సమయపాలన పాటించకపోవడం వలన మండల కార్యాలయాలను సందర్శించే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయన్నారు. నిబంధనల ప్రకారం రెండు నుంచి మూడు సంవత్సరాలలో రెగ్యులర్ పద్ధతిలో బదిలీ కావలసిన సిబ్బంది 9 సంవత్సరాలుగా ఒకే కార్యాల యంలో విధులు నిర్వహించడంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రెగ్యులర్ పద్ధతిలో బదిలీలు చేపట్టాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలి



ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. కవాడిగూడ డివిజన్ లోని హుస్సేన్ సాగర్ నాలా వరద ముప్పు ప్రాంతాలు అయినటువంటి ముగ్గు బస్తి, సింగాడి కుంట, ఉని కోటా బస్తీలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. హుస్సేన్ సాగర్ నాలా వరదనీటి ప్రవాహంలో ఇటీవల ప్రమాదవశాత్తు మహిళ కొట్టుకుపోవడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. హుస్సేన్ సాగర్ నాలా ప్రహరీ గోడ పూర్తిస్థాయిలో పటిష్టంగా నిర్మించి వరద నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేస్తామన్నారు. ప్రజల అ ధైర్యపడవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువ నాయకులు ముఠా జై సింహ, లక్ష్మీ గణపతి దేవాలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ ప్రెసిడెంట్ వల్లల శ్యామ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు

సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేయాలి



హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు రాధ రెడ్డి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ విద్యాశాఖ సమగ్ర శిక్షా లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు జి.రాధారెడ్డి అన్నారు. సోమవారం గన్ ఫౌండ్రీలోని జిల్లా డీఈఓ కార్యాలయ ఆవరణలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అధ్యక్షురాలు రాధారెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్షాఉద్యో గులందరిని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటివరకు కనీస వేతనాల స్కేల్ను అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వెంటనే ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, సరిత, ఉపాధ్యక్షులు షేక్ పాషా, మోహన్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

'సమాజ హితం కోసం పని చేయాలి

- నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.బీమా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో విద్యార్థులు సమాజ హితం కోసం పని చేయాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా విద్యార్థులకు సూచించారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం నిజాం కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి ప్రొఫెసర్ బి.బీమా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ లాంటి వారి త్యాగాలతో తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ అంతరించిపోయి అన్ని వర్గాల ప్రజలకు వ్యవసాయ భూమి దక్కిందన్నారు.భూమి కోసం, భుక్తి కోసమే కాకుండా బానిసత్వ విముక్తి కోసం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ స్వతంత్రాల కోసం ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రేణుక, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.కవిత, ఈవోసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.తిరుపతి, రీసెర్చ్ సెండ్ డెవలప్మెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సాంబశివ, డిప్లమా కోర్సెస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భవాని శంకర్, విద్యార్థులు, నాన్ టీచింగ్ స్టాఫ్ తదితవరులు పాల్గొన్నారు.

పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు



ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమూద్ అలీ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

చంద్రయాత్రలో మన దేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి నిరూపించుకున్నామని, కానీ మరోవైపు దేశంలో 50 శాతం మంది ప్రజలు పేదరికంతో కొట్టుమిట్లాడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, న్యాయవాది మహమూద్ అలీ ఆరోపిం చారు. సోమవారం బషీర్ బాగ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఏ దేశం సైకో ప్లాంట్ల బానిసత్వం నుంచి అభివృద్ధి చెందలేదని, బూటకపు దేశభక్తి బానిసత్వం నుంచి ప్రజలు విముక్తి పొంది దేశాన్ని కాపాడుకోవాలని సూచించారు. గతం మిమ్మల్ని ఎప్పుడు గతానికి తీసు కెళ్లదని, వర్తమానం మాత్రమే భవిష్యత్తు వైపు నడిపిస్తుందని, గతానికి కాకుండా భవిష్యత్తుకు ప్రయాణించడానికి ప్రస్తుత భారత రాజ్యాంగానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

ఉదయనిధిస్టాలిన్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సనాతన ధర్మాన్ని అంతం చేయాల్సిన అవసరం ఉం దని ఉదయనీధి స్టాలిన చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆధ్వ ర్యం లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నాయకులు సోమవారం రహమత్ నగర్ చౌరస్తాలో ఈదహన కార్యక్రమం నిర్వహించారు. ఇండియా కూటమి సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ మా టలను ఖండించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లంకాల దీపక్‌రెడ్డి, నగరకార్యదర్శి ప్రేమ్ కుమార్, సీనియర్ నాయకులు చిన్న శ్రీనివాస్, డివిజన్ అధ్య క్షులు కనకరాజు, విజయకుమార్, చంద్రమోహన్, రాజేష్, మహిళా నాయ కురాలు స్వప్న, ప్రమీల, నాగమణి, నాగల క్ష్మి, ఎస్సీమోర్చా నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ ప్రాచీన కళలను విస్మరిస్తున్న నేటి తరం పిల్లలు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నేటి తరం పిల్లలు పాశ్చాత్య సాంస్కృతికి అలవాటు పడి భారతీయ ప్రాచీన కళ లను విస్మరిస్తున్నారని, వారికి కళలను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ తల్లిదండ్రులపై ఉందని శ్రీ క్లాసికల్ డాన్స్ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ డైరెక్టర్, నిర్వాహకులు నిర్మలా రాణి, లక్ష్మిలు అన్నారు. ఇనిస్టిట్యూట్ 10వ వార్షికోత్సవ వేడుకలను శివోహం పేరిట నగరంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎంతో మంది విద్యార్థులకు కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.ఐదేళ్ల వయస్సు నుండి 40 ఏళ్ల వయస్సు వరకు తమ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నట్లు , ఈ వేడు కలలో 40 మంది విద్యార్థులు మహా గణపతిమ్, కామాక్షి స్తుతి, తాండవ నృత్యం, చిదంబరేశ్వర స్తోత్రం, శివాష్టకం తదితర విభాగాలపై ప్రదర్శించిన నృత్యాలు ఆహు తులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి సంగీత నాటక అకాడమీ అవార్డ్ గ్రహీత వేదాంత రాధేశ్యామ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మానవి 13
www.navatelangana.com హైదరాబాద్
మంగళవారం 12 సెప్టెంబర్ 2023

పిల్లలు వివిధ విషయాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్న ఆరాటం తల్లిదండ్రుల్లో ఉంటుంది. ఈ అత్యుత్సాహంతోనే వారి ఇష్టాయిష్టాలు గ్రహించకుండా కొన్ని విషయాల్లో పేరెంట్స్ వాళ్లను బలవంత పెడుతుంటారు. అయితే ఇలాంటి ప్రవర్తన పిల్లల మనసుపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అందుకే బలవంతం చేయడం కంటే వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో ప్రోత్సహిస్తే వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా వారు ఉన్నతి సాధించగలరు. మరి దీని కోసం ఏం చేయాలో తెలుసుకుందాం...

ఒత్తిడి చేస్తున్నారా..?



పిల్లలు బాగా చదువుకొని ప్రయోజకులైతే ముందుగా సంతోషపడేది తల్లిదండ్రులే. అయితే వారు నిరంతరం చదువుతూ ఉండడం వల్లే ఇది సాధ్యపడుతుందన్న ఆలోచనలో ఉంటారు కొందరు తల్లిదండ్రులు. అందుకే పదే పదే 'చదువు..చదువు' అంటూ వారిపై ఒత్తిడి తెస్తుంటారు. ఇక దీనికి తోడు పిల్లలతో పుస్తకాలు చదివించే అలవాటు చేయాలనుకుంటారు మరికొందరు పేరెంట్స్. అయితే చదువు విషయంలో ఇలా పిల్లల్ని బలవంత పెట్టడం వల్ల అది వారి మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా చదవాలన్న ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.

మీరు చదువుతూ...

పిల్లలు చదువులో మెరుగ్గా ఉండాలంటే వారి కోసం ఒక చక్కటి ప్రణాళిక రూపొందించాలి. అందులో వారికి నచ్చిన వ్యాపకాలకు తగిన సమయం కేటాయించేలా శ్రద్ధ చూపాలి. అప్పుడే వారు మానసికంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. పాఠ్యాంశాల పైన ఆసక్తి పెంచుకోగలుగుతారు. ఇక పిల్లల్లో ఇతర పుస్తకాలు చదివే ఆసక్తిని పెంచాలంటే చిన్న వయసు నుంచే వారికి అలవాటు చేయాలి. అది కూడా మీరు చదువుతూ వారికి చెప్పడం వల్ల చిన్నారులకు పుస్తకాల విలువ తెలుస్తుంది.



నచ్చినా నచ్చకపోయినా

పిల్లల విషయంలో ఈ మొండిపట్టుదల వద్దంటున్నారు నిపుణులు. వారికి ఇష్టమో, కాదా అన్నది తెలుసుకోకుండా 'నువ్వు ఐఏఎస్ అవ్వాలి', 'సంగీతం నేర్చుకుంటే నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది' అంటూ తమ ఇష్టాయిష్టాల్ని చిన్నారులపై రుద్దాలని చూస్తుంటారు కొందరు తల్లిదండ్రులు. ఇలా మీ బలవంతం వల్ల నచ్చని అంశాన్ని ఎంచుకొని పిల్లలు రాణించలేరు. అటు వారికి నచ్చిన అంశంపై దృష్టి పెట్టే అవకాశం ఉండదు. దీనివల్ల వారి భవిష్యత్తు ఎటూ కాకుండా తయారవుతుంది. ఇలా కూడా పరోక్షంగా మీకే నష్టం. కాబట్టి మీ ఇష్టాయిష్టాలు పక్కన పెట్టి... పిల్లలకు ఏ అంశంపై ఆసక్తి ఉందో ముందు తెలుసుకునే ప్రయత్నం చేయండి. అది మీకు నచ్చకపోయినా నిరుత్సాహపరచకుండా వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేయండి. దీనివల్ల తప్పకుండా వారు అందులో రాణించగలుగుతారు. ఇలా నచ్చిన రంగాన్ని ఎంచుకొని విజయం సాధించిన వారి స్ఫూర్తి గాథలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు.

ఆ పొరపాటు వద్దు

ఇంటికి ఎవరైనా బంధువులొచ్చినప్పుడు చాలా మంది పేరెంట్స్ తమ పిల్లల్ని వారికి తోడుగా ఉండమని చెప్పి వాళ్ల పనుల్లో వాళ్లు నిమగ్నమవుతుంటారు. అక్కడితే ఆగకుండా బలవంతంగా వారికి షేక్‌హ్యాండ్ ఇవ్వమనడం, ముద్దు పెట్టమనడం, వారు పిల్లలకు పెట్టేంత చొరవనివ్వడం వంటివి చేస్తుంటారు. నిజానికి వీటికి చిన్నారులు అంత ఆసక్తి చూపరు. అయినా బలవంతం చేయడం వల్ల అవతలి వారు మీ పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించేందుకు, లైంగిక వేధింపులకు గురి చేసేందుకు మీకు మీరే అవకాశం కల్పించినట్లవుతుంది. కాబట్టి ఇలాంటివి ప్రోత్సహించకూడదు. అలాగే మీ చిన్నారులు వాళ్లతో దూరంగా ఉన్నప్పటికీ ఓ కన్నేసి ఉంచడం ముఖ్యం.



జామాకుతో ఫేస్‌ప్యాక్

జామపండులోని పోషకాలు ఆరోగ్యానికి మేలు చేస్తే వాటి ఆకులు సౌందర్య పోషణకు ఉపయోగపడతాయి. అదెలాగో చూద్దాం...

- గుప్పెడు జామాకులను మెత్తగా నూరి దానికి రెండు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి రాయాలి. దీన్ని అరగంట పాటు ఆరనిచ్చి చన్నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. జిడ్డు తొలగి మోము తాజాగా కనిపిస్తుంది.
- గుప్పెడు జామాకులకు నీళ్లు, పావుచెంచా పసుపు, చెంచా కలబంద గుజ్జు కలిపి మిక్సీలో వేసి పేస్టులా చేయాలి. దీన్ని ముఖానికి రాసి 20 నిమిషాలు ఆరనిచ్చి కడగాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే ముఖంపై మొటిమలు, బ్లాక్ హెడ్స్ తొలగిపోతాయి.
- కప్పు మరిగే నీటిలో గుప్పెడు జామాకులను వేసి పది నిమిషాలు ఉడికించాలి. ఈ నీటిని వడకట్టి చల్లారాక స్ప్రే బాటిల్‌లో నింపాలి. చర్మం ఇరిటేటింగ్‌గా ఉన్నప్పుడు దీన్ని కాస్త చల్లితే సరి. సమస్య అదుపులోకి వస్తుంది. దోమ కాటుకు కూడా ఇది పని చేస్తుంది. దీనికి కొన్ని చుక్కల టీ ట్రీ ఆయిల్‌ను కలిపి స్ప్రే చేస్తే ముఖంపై మొటిమలు దూరమవుతాయి. ❋

అతి అనర్థం

స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో మహిళల ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలేంటో తెలిస్తే మీరిక వాటికి దూరంగా ఉంటారు.

- ప్రపంచ వ్యాప్తంగా 74 శాతం మంది మహిళలు స్మార్ట్ ఫోన్ వినియోగంతో ఒత్తిడికి లోనై, నిద్రలేమికి గురవుతున్నారని అమెరికాలోని 'స్పెయిన్ ల్యాబ్స్' చేసిన అధ్యయనాలు చెబుతున్నాయి.
- సామాజిక మాధ్యమాలు, గేమ్స్ వల్ల మగవారితో పోలిస్తే మహిళలు 29 శాతం అధికంగా ఎక్కువ ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. ఫొటోలు, రీల్స్ అంటూ వ్యక్తిగత గోప్యతను నెట్టింట్లో ఉంచి సమస్యలెందుర్కొంటున్నారు. వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్యాహత్నానికి పాల్పడుతున్నారు.



- ఫోన్‌ని పొత్తి కడుపు, ఛాతీ మీద పెట్టుకొని నిద్రపోవడం వల్ల దాని ప్రభావం పునరుత్పత్తి వ్యవస్థపై పడి, అండాశయ నిల్వలు తగ్గుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
- నెలసరి క్రమం తప్పి పీసీఓఎస్, పీసీఓడీ సమస్యలతో సతమతమవుతున్నారు.
- నిద్రలేమి, నడుము, వెన్ను, మెడ నొప్పులకు గురవుతున్నారు. ❋



కారణం ఏంటో..?

ఎప్పుడూ ఏదో ఒక కారణంతో ఒత్తిడి, ఆందోళనల్ని ఎదుర్కొనే వారు ఎందరో. నిజానికి ఇలాంటి టెన్షన్స్ దీర్ఘకాలంలో ఎన్నో అనారోగ్యాలకు కారణమవుతాయి. ఈ విషయం గుర్తెరిగినా కొందరు అనవసర భయాందోళనలకు గురవుతుంటారు. కానీ ఇంకొంత మంది మాత్రం వీరికి పూర్తి భిన్నంగా ప్రవర్తిస్తుంటారు. తమ చుట్టూ ఏం జరిగినా సానుకూలంగానే స్పందిస్తూ... ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తుంటారు. కానీ వాళ్ల రోజువారీ అలవాట్లు, పాటించే కొన్ని నియమాలే వారిని మానసికంగా ప్రశాంతంగా ఉంచుతాయని చెబుతున్నారు నిపుణులు.

- అది చిన్న విషయమైనా, పెద్ద సమస్యైనా... అవసరమున్నా, లేకపోయినా కొందరు దాని గురించే పదే పదే లోతుగా ఆలోచిస్తుంటారు. నిజానికి దీనివల్ల సమయం వృథా అవడంతో పాటు మానసికంగా ఒత్తిడి ఎదురవుతుంటుంది. కానీ మానసికంగా దృఢంగా ఉన్న వాళ్లు అస్సలు ఇలా చేయరు. ఏదైనా సమస్య వస్తే దాన్ని త్వరగా పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తారు తప్ప దాని గురించే లోతుగా ఆలోచించి మనసు పాడుచేసుకోరు.



- చదువు, కెరీర్, పెండ్లి, పిల్లలు... ఇలా జీవితంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇవి కాకుండా అనుకోకుండా కొన్ని మార్పులొస్తుంటాయి. వాటిని అర్థం చేసుకొని స్వీకరించినప్పుడే హ్యాపీగా ఉండగలం. ఎప్పుడూ మానసికంగా సంతోషంగా ఉండే వాళ్లు ఇలాగే చేస్తారని చెబుతున్నారు నిపుణులు.
- నచ్చకపోతే చిన్న విషయానికే కోపగించుకోవడం, చిరాకు పడడం వంటివి చేస్తుంటారు మనలో చాలామంది. కానీ మానసికంగా దృఢంగా ఉండే వారు ప్రశాంతంగా దాని గురించి ఆలోచించే ప్రయత్నం చేస్తుంటారు. తమ ఆధీనంలో లేని దాని గురించి పాకులాడకుండా తమ సాధ్యాసాధ్యాల గురించి తొలుత ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు.
- శరీరాకృతి దగ్గర్నుంచి, వేసుకునే దుస్తుల దాకా... ఎదుటి వారికి అందంగా కనిపించాలన్న ఆలోచనే కొంత మంది మనసును తొలిచేస్తుంటుంది. నిజానికి ఇదే మానసిక ఒత్తిళ్లకు కారణమవుతుంటుంది. కానీ తాము మాత్రం చుట్టూ ఉన్న వాళ్ల కోసం కాకుండా... తమకు నచ్చినట్లుగా ఉండడంలోనే సంతోషాన్ని, సంతృప్తిని వెతుక్కుంటామంటున్నారు మానసికంగా బలంగా ఉండే అమ్మాయిలు.
- గతం గత: అనుకొని ఈ క్షణాన్ని ఆస్వాదిస్తూ, భవిష్యత్తు గురించి ఉన్నతంగా ఆలోచించే వారే జీవితంలో పైచేయి సాధిస్తారు. మానసికంగా దృఢంగా ఉండే వారి ఫిలాసఫీ కూడా ఇదే. అందుకే గత జ్ఞాపకాల్ని తవ్వుకొని బాధపడకుండా పాజిటివ్‌గా ఆలోచించడం, సంతోషంగా జీవించడం నేర్చుకుందాం.
- ఈర్ష్యాద్వేషాలు, అసూయ, ఎదుటివారి గెలుపును జీర్ణించుకోలేకపోవడం ఇవన్నీ మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తుంటాయి. అందుకే కొంతమంది వీటి జోలికి పోరు. తద్వారా సంతోషంగా ఉండగలుగుతారు. పైగా విజేతల్ని ప్రశంసించడం, కష్టపడే వారిని ప్రోత్సహించడం వీరికి అలవాటు కూడా.
- 'కోరుకున్నవన్నీ జరగాలని లేదు. జరగనంత మాత్రాన బాధపడడం అనవసరం' అనుకుంటారు మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తులు. అందుకే నిత్యం సంతోషంగా ఉంటారు. కాబట్టి గొంతెమ్మ కోరికలు కోరుకోకుండా మన సమర్థత, వనరుల్ని దృష్టిలో ఉంచుకొనే ఏ విషయంలోనైనా అడుగు ముందుకేయడం మంచిది.
- స్నేహితుల్ని ఎంచుకోవడంలోనూ జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు మానసికంగా దృఢంగా ఉండే అమ్మాయిలు. చాడీలు చెప్పడం, అసూయ పడడం, ఎదుటివారి ఓటమిలో సంతోషాన్ని వెతుక్కోవడం లాంటి లక్షణాలున్న వ్యక్తుల్ని దూరం పెడుతుంటారని, ఒక వేళ చెలిమి చేసినా వారి గురించి తెలిశాక మాత్రం వారితో స్నేహ బంధాన్ని తెంచుకోవడానికి సిద్ధంగా ఉంటారు.
- కొంతమంది మొహమాటానికి పోయి చాలా పనుల్ని నచ్చకపోయినా స్వీకరిస్తుంటారు. కానీ, మానసికంగా బలంగా ఉండే వారు ఈ విషయంలో నిక్కచ్చిగా వహవహరిస్తుంటారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో వాళ్ల ఆత్మగౌవరానికి, సామర్థ్యానికే ప్రాధాన్యమిస్తుంటారు. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది.
- రిస్క్ తీసుకోవడానికి భయపడకుండా, ఓటమినీ గెలుపుతో సమానంగా స్వీకరించడం మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తులకే చెల్లుతుంది.
- నిజానికి మనకు నచ్చినట్లుగా ఉన్నప్పుడే సంతోషంగా ఉండగలం. మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తులు పాటించే సూత్రం కూడా ఇదే. సమాజంతో పని లేకుండా తమకు నచ్చినట్లుగా ఉండాలనుకుంటారు, స్వీయ ప్రేమను పెంచుకుంటారు.
- మానసికంగా దృఢంగా ఉన్న వ్యక్తులు అనారోగ్యాల బారిన పడే అవకాశం చాలా తక్కువని చెబుతోంది ఓ అధ్యయనం. ఈ క్రమంలో రోజూ వ్యాయామం చేయడం, చక్కటి పోషకాహారం తీసుకోవడం, కంటి నిండా నిద్ర పోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లే వాళ్ల సంతోషానికి కారణమని నిపుణులు అంటున్నారు. ❋

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి



(మొదటిపేజీ తరువాయి)

పారితోషకాలు సరిపోక ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రూ.18 వేలకు వేతనం పెంచి అందించాలని కోరారు. అలాగే ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు, ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కవోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశ వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. టీ.బీ. లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. క్వాలిటీతో కూడిన ఐదు సంవత్సరాల పెండింగ్ యూనిఫార్మ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంగళవారం నుంచి ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు .

ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగమని, నాయకులు మీనా, సుమారు నాలుగు వేల మంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో పలువురు ఆశావర్కర్లతో పాటు సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

దీంతో పోలీసుస్టేషన్ ఎదుటే ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఆదిభట్లలో ఆశావర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం నుంచి చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో తహసీల్దార్ కార్యాయాన్ని ముట్టడించారు. కరీంనగర్ జిల్లాలో పలువురు ఆశా కార్యకర్తలను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. గన్నేరువరం, చిగురుమామిడి, తిమ్మాపూర్ సహా పలు మండలాల్లో ఆశాలను పోలీసులు స్థానిక స్టేషన్లకు తరలించారు.

నిఫ్టీ తొలిసారి 20వేల మార్క్

ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీ తొలిసారి 20వేల మార్క్‌ను తాకింది. కొనుగోళ్ల మద్దతుతో నిఫ్టీ–50 ఓ దశలో 20,008 గరిష్ట స్థాయికి ఎగిసింది. తుదకు 176 పాయింట్లు లేదా 0.89 శాతం పెరిగి 19,996 వద్ద ముగిసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 528 పాయింట్లు రాణించి 67,127 వద్ద ముగిసింది. బిఎస్ఇలో అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అపోలో హాస్పిటల్స్, హిందాల్కో, పవర్ గ్రిడ్, యుపిఎల్ షేర్లు అదికంగా లాభపడిన వాటలో ముందు వరుసలో ఉన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.2 శాతం, 0.7 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 3 శాతం పెరగ్గా.. లోహ, ఆటో సూచీలు 1.7 శాతం చొప్పున పెరిగాయి. ఢిల్లీలో నిర్వహించిన జి20 శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంతో మార్కెట్లలో విశ్వాసం పెరిగిందని బ్రోకర్లు పేర్కొన్నారు.

పౌర సమాజానికి చోటేది?

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. మణిపూర్‌లో కుకీలు, మైతీల మధ్య జరిగిన ఘర్షణలు కూడా మతపరమైనవే. నూహ్‌లో జరిగిన హింసాకాండ కూడా అలాంటిదే. ఈ సంఘటనలను గమనిస్తే దేశంలో పౌర సమాజానికి రానురానూ చోటు కుంచించుకుపోతోందని అర్థమవుతుంది.

2021 అక్టోబర్ నుంచి 2022 మార్చి వరకూ ఉత్తర భారతదేశంలోని ఐదు రాష్ట్రాలలో విద్వేషపూరిత నేరాలకు సంబంధించి 89 కేసులు నమోదయ్యాయి. ఇటీవల రైల్వే రక్షణ దళానికి చెందిన కానిస్టేబుల్ ముగ్గురు ముస్లిం ప్రయాణికులను కాల్చి చంపిన ఘటన ఈ నేరాలకు పరాకాష్ట. ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకున్నప్పుడు సాధారణంగా పౌర సమాజం స్పందిస్తుంది. కానీ మన దేశంలో ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఎవరైనా గొంతు విప్పితే వారిపై దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారు. ప్రభుత్వంలోనే కాదు... ప్రభుత్వ సంస్థలలో సైతం ఇలాంటి అరాచకమే కన్పిస్తోంది. బెంగళూరులోని ఐఐఎంలో ఇటీవల జరిగిన ఘటనను నిరసిస్తూ 17 మంది బోధనా సిబ్బంది గళం విప్పారు.

కార్పొరేట్ సంస్థలదీ అదే దారి

దేశంలోని పలు కార్పొరేట్ సంస్థలు ఇలాంటి ఉదంతాలపై కనీస స్పందనను కూడా వ్యక్తం చేయడం లేదు. ఆ సంస్థలకు ఎంతసేపూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న తాపత్రయమే కానీ ఇతర విషయాలు పట్టించుకోవు. అదే సంపన్న దేశాలలో దుష్ప్రచారం సాగించే వారిని, దుందుడుకు వైఖరులకు ఆజ్యం పోసే మీడియా సంస్థలను కార్పొరేట్ సంస్థలు బహిరంగంగానే వ్యతిరేకిస్తుంటాయి. ప్రమాదకరమైన ప్రచారం చేస్తోందన్న కారణంతో ఫేస్‌బుక్‌ను ప్రసిద్ధ అంతర్జాతీయ కంపెనీలైన ఆదిదాస్, దయాజియో, ఫోర్డ్, హోండా, హెచ్‌పీ,



హర్షేస్, కోకాకోలాలు బహిష్కరించాయి. మన దేశంలో పౌర సమాజం నుండి తగినంత ఒత్తిడి లేకపోవడంతో ఇలాంటివి జరగడం లేదు. అయితే కొందరు పారిశ్రామికవేత్తలు మాత్రం గతంలో దీనిపై ఆందోళనలు వ్యక్తం చేశారు.

మీడియాపై కార్పొరేట్ ప్రభావం

వార్తా ఛానల్స్‌పై కార్పొరేట్ శక్తుల ప్రభావంతో వాస్తవాలు మరుగునపడుతున్నాయి. వార్తలను నియంత్రించి, తమకు అనుకూలంగా ప్రసారం చేయడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో ఒక్కో సందర్భంలో తప్పుడు వార్తలు కూడా ప్రచారంలోకి వస్తున్నాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ, విద్య వంటి ప్రజా ప్రయోజన అంశాలకు పత్రికలు, ఛానల్స్‌లో తగిన ప్రాధాన్యత లభించడం లేదు. రాజకీయ నాయకులు, పార్టీల అధీనంలోని వార్తా ఛానల్స్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. సొంత డబ్బా కొట్టుకోవడం తప్పించి వాటిలో మరే ఇతర విషయానికీ ప్రాధాన్యత లభించదు. ఇక సమాజానికి సంబంధించిన అంశాలపై ఏ ఛానల్‌లోనూ చర్చా గోష్టులు నిర్వహించడం లేదు.

మరోవైపు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరిస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టులపై వేధింపులు పెచ్చుమీరిపోతున్నాయి. 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్' అనే సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం నిర్భయంగా వార్తలు రాసిన 59 మంది పాత్రికేయులు హత్యకు గురయ్యారు. ఏడుగురు జర్నలిస్టులు కారాగారంలో మగ్గుతున్నారు.

విద్యా సంస్థల్లో సైతం...

ఇక విద్యా సంస్థలలో నెలకొన్న పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. విద్యాలయాలలో హిందూత్వ భావనలు, విద్వేషాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. బీజేపీ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ నేతృత్వంలో పూనేలోని సింబయాసిస్ కళాశాలలో జరిగిన నిరసన కారణంగా ఓ అధ్యాపకుడిని యాజమాన్యం విధుల నుంచి తప్పించింది. ఆ తర్వాత ఆయనను అరెస్ట్ కూడా చేశారు. 'భారత్‌లో ప్రజాస్వామ్యం' అనే అంశంపై అశోకా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రచురించిన పరిశోధనా వ్యాసం వివాదానికి దారితీయడంతో ఆయన రాజీనామా చేశారు.

చట్టసభలలో సైతం ప్రజా ప్రయోజనం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు జరగడం లేదు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తీరును గమనిస్తే ఇది అర్థమవుతుంది. ముఖ్యమైన బిల్లులపై కనీసం చర్చ కూడా జరపకుండానే ఆమోదించిన పరిస్థితిని ప్రజలంతా గమనించారు. పౌర సమాజం సమర్థవంతంగా పని చేసినప్పుడే ఏ దేశంలో అయినా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అయితే పౌర సమాజం అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడం, దాని గొంతు నొక్కడం, ప్రశ్నించే వారిపై నిర్బంధాలు అమలు చేయడం వంటివి మన దేశంలో నెలకొన్న దుస్థితికి కారణమని చెప్పక తప్పదు.

ముందస్తు అనుమతి అక్కర్లేదు

న్యూఢిల్లీ : సీనియర్ ప్రభుత్వ అధికారులపై వచ్చిన అవినీతి కేసులు దర్యాప్తు చేపట్టడానికి సీబీఐ ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరన్న నిబంధన చెల్లదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. 2014లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునే రాజ్యాంగ ధర్మాసనం సోమవారం పునరుద్ఘాటిస్తూ, ఇది తీర్పు ఇచ్చినతేదీ నుంచే కాదు, సీబీఐకి మార్గ నిర్దేశం చేసే ఢిల్లీ ప్రత్యేక పోలీసు వ్యవస్థ (డీఎస్‌సీఈ) చట్టానికి సెక్షన్ 6ఏను జోడించిన తేదీ నాటి నుంచే అంటే 2003 సెప్టెంబరు 11 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించాలని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. సెక్షన్6ఎ ఏం చెబుతోంది? ప్రభుత్వ ఉన్నతాధికారులపై అవినీతి వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని అంటోంది.

2014లో డాక్టర్ సుబ్రమణ్యం స్వామి కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ సెక్షన్–6ఏ రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. దీంతో జాయింట్ సెక్రటరీ ఆపై ర్యాంక్ అధికారులను సీబీఐ ప్రాథమికంగా విచారణ జరపాలంటే సీబీఐకి ముందస్తు అనుమతి అవసరం లేదు. అయితే, కోర్టు తీర్పు ఇచ్చిన తేదీ నుంచే అమల్లోకి వస్తుందని, అంతకుముందు నమోదయిన అవినీతి కేసుల్లో ఇరుక్కున్న సీనియర్ బ్యూరోక్రాట్లకు సెక్షన్–6ఏ కింద రక్షణ ఉంటుందని కొందరు వాదించారు. ఈ వాదనలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం, ఆ సెక్షన్‌ను ఎప్పుడు చట్టంలో చేర్చారో ఆనాటి నుంచే దాని చెల్లుబాటు రద్దయిందని రద్దు చేస్తున్నట్లుగా వస్తుందని పున రుద్ఘాటించింది. సెక్షన్–6ఎ అనేది రాజ్యాంగంలోని సమానత్వ హక్కుకు హామీ ఇస్తున్న ఆర్టికల్14కి విరుద్ధమని రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది.

అవినీతి దేశానికి శత్రువు

అవినీతి దేశానికి శత్రువు. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగి (పబ్లిక్ సర్వెంట్) పెద్ద స్థాయిలో ఉన్నాసరే, వారిని అరెస్టు చేయడానికి, శిక్షించడానికి అవినీతి నిరోధక చట్టం–1988ను కచ్చితంగా అనుసరించాలి.

సదరు ప్రభుత్వ ఉద్యోగి హోదా లేదా స్థితి కారణంగా ఆ వ్యక్తికి ఎటువంటి మినహాయింపు ఇవ్వడం సరికాదు. వారు అందరి లాగే నేరం చేసినందున అవినీతి అధికారులను రెండు కేటగిరీలుగా విభజించరాదు. అలా చేయడం 1988 అవినీతి నిరోధకచట్ట లక్ష్యాలకే విరుద్ధం. వీరి విషయంలోనూ సాధారణ విచారణ, దర్యాప్తు క్రమాన్ని అనుసరించాలని 2014 తీర్పులో సుప్రీం పేర్కొంది. సెక్షన్–6ఏ అవినీతి పరులైన సీనియర్ బ్యూరోక్రాట్లను గుర్తించేందుకు ఆటంకం కల్పిస్తోంది. ఇది వారికి ఒక రక్షణ కవచంగా ఉంది అని సుప్రీం ధర్మాసనం ముక్తాయింపు ఇచ్చింది.

పూర్తి కాని ప్రాజెక్టును ప్రారంభిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో పాలమూరు వలసలు ఆగలేదనీ, అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు నుంచి ఎంపీ గెలిచిన తర్వాత ఆ జిల్లాకు చేసిందేంటని కేసీఆర్‌ను ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి వందలాది మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్, మల్లు రవి, డీసీసీ అధ్యక్షులు జి మధుసుధర్‌రెడ్డి తదితరులు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ సీతా దయాకర్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే దోపిడీ దొంగల కంటే దారుణంగా తయారయ్యారని విమర్శించారు. కాంట్రాక్టులు, కమీషన్లు తప్ప ఎమ్మెల్యేకు దేవరకద్ర అభివృద్ధి పట్టడంలేదన్నారు. నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతలను పడావుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాలో 14 సీట్లకు 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సీతక్కను రాజకీయంగా పార్టీ అన్ని రకాలుగా ఆదుకుంటుందని చెప్పారు. నా రాజకీయ ఎదుగుదలలో కొత్తకోట దయాకర్‌రెడ్డి కుటుంబం నాకు అండగా నిలబడిందని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్సీగా గెలిచేందుకు ఆయన అండగా నిలబడ్డారని తెలిపారు. టీడీపీతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నప్పుడు(2009)లో ఎంపీగా కేసీఆర్ గెలువడంలో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతలకు కాంగ్రెస్‌పార్టీ అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.16,17,18న సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఖర్గే, జాతీయ నాయకులు రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. ఈ నెల 17న తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే విజయ భేరికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆకలి-అసమానతలకు పరిష్కారమేది?

(మొదటిపేజీ తరువాయి)

ఈ పరిస్థితి కన్పిస్తోందని తెలిపింది. 'జీ–20 సదస్సు సందర్భంగా సుందరీకరణ పేరుతో దేశ రాజధానిలోని అనేక మురికివాడలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. దీంతో వేలాది మంది పేదలు నిరాశ్రయులయ్యారు. పౌర సమాజ సంస్థల సమావేశాలను కూడా అడ్డుకున్నారు. సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయంతో డిక్లరేషన్‌ను రూపొందించినందుకు భారత ప్రభుత్వానికి అభినందనలు. కానీ, పధ్నాలుగు వేల పదాలకు పైగా ఉన్న ఈ డిక్లరేషన్ ప్రపంచ దేశాలను వెంటాడుతున్న సంక్షోభాలపై విశ్లేషణ జరిపి, పరిష్కారాలను సూచించలేకపోయింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ సంబంధమైన అసమానతలు, జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న ముప్పు వంటి అంశాలపై డిక్లరేషన్ స్పష్టత ఇవ్వలేదు. నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలను, జీడీపీ కేంద్రీకృత అభివృద్ధి నమూనాను అంచనా వేయడంలో సదస్సు విఫలమైంది. ముదురుతున్న అంతర్జాతీయ సంక్షోభాన్ని పట్టించుకోలేదు. డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం వచ్చినప్పటికీ అందులో జరిగిన జాప్యం అనేక అనుమానాలకు తావిస్తోంది. డిక్లరేషన్ అమలు పైన కూడా మాకు అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే దాని అమలు కోసం నిర్దిష్టమైన, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ఏదీ లేదు. స్వతంత్ర జవాబుదారీతనం కానీ, పర్యవేక్షణ యంత్రాంగం కానీ లేవు' అని పీపుల్స్ 20 సంస్థ ఆ ప్రకటనలో విమర్శించింది.

ఆర్థికాభివృద్ధిలో ప్రైవేటు రంగం పాత్రపై జీ–20 సదస్సు అనవసరమైన దృష్టి సారించిందని పీపుల్స్ 20 సంస్థ అభిప్రాయపడింది. దీనివల్ల ప్రభుత్వ విధానాల పైన, ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల పైన కార్పొరేట్ ప్రభావం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. డిక్లరేషన్‌లో పేటెంట్ హక్కుల రద్దు, అంతర్జాతీయ పన్ను వ్యవస్థ, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలలో సంస్కరణలు వంటి కీలక అంశాల ప్రస్తావనే లేదని ఎత్తిచూపింది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన 60 దేశాల రుణాలను రద్దు చేసే విషయంలో చొరవ చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పౌర సమాజ సంస్థల సిఫార్సులకు డిక్లరేషన్‌లో చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. వివిధ దేశాలలో పెరుగుతున్న సైనిక వ్యయం, ఆయుధ వ్యాప్తి వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించలేదని పీపుల్స్ 20 సంస్థ తెలిపింది.

రూ.25 కోట్ల ప్రైజ్‌మనీ

యుఎస్ ఓపెన్ సింగిల్స్ చాంపియన్లు భారీ నగదు బహుమతి సొంతం చేసుకున్నాడు. మెన్స్, ఉమెన్స్ సింగిల్స్ విజేతలకు సమాన నగదు బహుమతి అందిస్తున్న యు.ఎస్ ఓపెన్.. నోవాక్ జకోవిచ్, కొకో గాఫ్‌లకు చెరో రూ.25 కోట్లు అందజేసింది. సింగిల్స్ రన్నరప్‌లు డానియల్ మెద్వదేవ్, సబలెంకలు సైతం చెరో రూ.12.5 కోట్లు ఖాతాలో వేసుకున్నారు.

36లో 24

- మెన్స్ సింగిల్స్ చాంప్ జకోవిచ్
- 36 ఏండ్ల వయసులో 24వ గ్రాండ్ విక్టరీ
- ఫైనల్లో మెద్వదేవ్‌పై ఘన విజయం

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. టెన్నిస్ ఓపెన్ శకంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన మార్గరేట్ కోర్టు రికార్డును సమం చేశాడు. రష్యా స్టార్ డానియల్ మెద్వదేవ్‌పై మెరుపు విజయంతో యు.ఎస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ చాంపియన్‌గా అవతరించిన జకోవిచ్.. కెరీర్ 24వ గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకున్నాడు. 36 ఏండ్ల వయసులో 24వ గ్రాండ్‌స్లామ్ విజయం అందుకున్న జకోవిచ్ టెన్నిస్‌లో ఆల్‌టైమ్ రికార్డు టైటిల్‌కు మరో అడుగు దూరంలోనే నిలిచాడు!.

నవతెలంగాణ-న్యూయార్క్

అంచనాలు నిజమయ్యాయి. అద్భుతాలు ఏమీ జరుగలేదు. సెర్బియా స్టార్, రెండో సీడ్ నొవాక్ జకోవిచ్ యు.ఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్లో జకోవిచ్ వరుస సెట్లలో టైటిల్ విజయం సాధించాడు. సుమారు మూడున్నర గంటల టైటిల్ పోరులో మూడో సీడ్ డానియల్ మెద్వదేవ్‌పై 6-3, 7-6(7-5), 6-3తో నొవాక్ జకోవిచ్ గెలుపు గర్జన చేశాడు. ఈ విజయంతో యు.ఎస్ ఓపెన్‌లో టైటిల్ నెగ్గిన అతిపెద్ద వయస్కుడిగా జకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. 1970లో కెన్ రోస్‌వాల్ 35 ఏండ్ల వయసులో టైటిల్ సాధించగా.. ఇప్పుడు జకోవిచ్ 36 ఏండ్ల వయసులో ఈ ఘనత సాధించాడు. ఇక ఆల్‌టైమ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేటలో టెన్నిస్ దిగ్గజం మార్గరెట్ కోర్టు (24) రికార్డును సైతం జకోవిచ్ సమం చేశాడు. యుఎస్ ఓపెన్ (2021) మాజీ చాంపియన్ డానియల్ మెద్వదేవ్ ఫైనల్లో గట్టిగా ప్రతిఘటించినా రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకోక తప్పలేదు.



ఆల్‌టైమ్ గ్రేట్! : యుఎస్ ఓపెన్ ట్రోఫీతో నొవాక్ జకోవిచ్

జకోవిచ్ జోరు :

రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన నొవాక్ జకోవిచ్.. న్యూయార్క్‌లో ఒక్క విజయంతో రెండు రికార్డులు ఖాతాలో వేసుకున్నాడు. లేటు వయసులో హాట్ ఫామ్‌లో దూసుకెళ్తున్న జకోవిచ్.. రష్యా స్టార్ ఆటగాడు డానియల్ మెద్వదేవ్‌పై వరుస సెట్లలో విజయం అందుకున్నాడు. తొలి సెట్‌ను 6-3తో గెల్చుకున్న జకోవిచ్‌కు రెండో సెట్‌లో మెద్వదేవ్ చుక్కలు చూపించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్ 104 నిమిషాల పాటు సాగింది. టైబ్రేకర్‌లో 7-5తో పైచేయి సాధించిన జకోవిచ్.. మెద్వదేవ్‌పై మానసికంగా విజయం సాధించాడు. దీంతో కీలక మూడో సెట్లోనూ జకోవిచ్ జోరు కొనసాగించింది. మూడో సెట్‌ను సైతం 6-3తో సొంతం చేసుకున్న జకోవిచ్ కెరీర్ 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు.

టైటిల్ పోరులో జకోవిచ్ 38 విన్నర్లు కొట్టగా, మెద్వదేవ్ 32 విన్నర్లు సంధించాడు. జకోవిచ్ 35 అనవసర తప్పిదాలే చేయగా.. మెద్వదేవ్ ఏకంగా 39 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు. మెద్వదేవ్ సర్వ్‌ను జకోవిచ్ మూడుసార్లు బ్రేక్ చేయగా.. మెద్వదేవ్ ఒకే ఒక్క బ్రేక్ పాయింట్‌తో రేసులో వెనుకంజ వేశాడు. మెద్వదేవ్ 6 ఏస్‌లతో మెరువగా.. జకోవిచ్ 4 ఏస్‌లతో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. పాయింట్ల పరంగా జకోవిచ్ 118-97తో మెద్వదేవ్‌పై పైచేయి సాధించాడు. సొంత సర్వ్‌లో మెద్వదేవ్ 11 గేములు గెల్చుకోగా.. జకోవిచ్ 15 గేములు సొంతం చేసుకున్నాడు.

చరిత్రపై కన్నేసి..! :

'ప్రపంచాన్నే జయించినట్టుగా అనిపిస్తుంది. ఇప్పటికీ ఓ బాలుడిగా నేను స్వప్నించిన ఆటనే ఆడుతున్నాను. ఈ స్థాయిలో నిలుస్తానని ఎన్నడూ ఊహించలేదు. కానీ గత రెండేండ్లుగా చరిత్రపై ఎందుకు గురి పెట్టకూడదని అనుకున్నాను. టైటిళ్లు అందుబాటులో ఉండగా.. ఎందుకు అందుకోకూడదని భావించాను. ఈ ఏడాది వింబుల్డన్ నెగ్గలేదనే పశ్చాత్తాపం నాలో ఏమాత్రం లేదు. నిజానికి నా ఆట తీరు పట్ల ఎంతో సంతోషంగా ఉన్నాను' అని రికార్డు గ్రాండ్‌స్లామ్ విజయం అనంతరం జకోవిచ్ అన్నాడు. రఫెల్ నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డును అధిగమించిన జకోవిచ్.. ఈ ఏడాది వింబుల్డన్‌లో యువ సంచలనం అల్కరాస్‌కు గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ కోల్పోయాడు. ఈ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఏకంగా మూడింట విజయాలు నమోదు చేసిన నొవాక్ జకోవిచ్.. వచ్చే ఏడాది జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికగా ప్రపంచ టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఘనత దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జకోవిచ్ ఇప్పటికే 10 టైటిళ్లు సాధించి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.



పోరాడినా.. : రన్నరప్ ట్రోఫీతో డానియల్ మెద్వదేవ్

శతక తాండవం

- కోహ్లి, రాహుల్ అజేయ సెంచరీలు
- పాక్‌పై భారత్ ఏకపక్ష విజయం

పాకిస్థాన్‌పై శతక తాండవం. బ్యాటింగ్ మాస్టర్ విరాట్ కోహ్లి (122 నాటౌట్), కెఎల్ రాహుల్ (111 నాటౌట్) అజేయ సెంచరీలతో చెలరేగారు. భారత టాప్-4 బ్యాటర్ల మెరుపులతో భారత్ 356/2 పరుగుల భారీ స్కోరు చేయగా.. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/25) ఐదు వికెట్ల మాయాజాలం ప్రదర్శించాడు. పాకిస్థాన్‌ను 128 పరుగులకే కుప్పకూల్చిన భారత్ 228 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది.

నవతెలంగాణ-కొలంబో



కెఎల్ రాహుల్ (111)

పాకిస్థాన్ చిత్తు. భారత్ ఏకపక్ష విజయం. కుల్దీప్ యాదవ్ (5/25) ఐదు వికెట్ల మాయజాలంతో చెలరేగటంతో భారీ ఛేదనలో పాకిస్థాన్ చేతులెత్తేసింది. 128 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్.. 32 ఓవర్లలోనే భారత్‌కు తలొగ్గింది. దీంతో భారత్ 228 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. అంతకుముందు,. విరాట్ కోహ్లి (122 నాటౌట్, 94 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు), కెఎల్ రాహుల్ (111 నాటౌట్, 106 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సులు) అజేయ సెంచరీలతో కదం తొక్కారు. వర్షం అంతరాయం కలిగిన భారత్, పాకిస్థాన్ ఆసియా కప్ సూపర్4 మ్యాచ్‌లో రిజర్వ్ డే బ్యాటింగ్‌కు వచ్చిన విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ జోడీ పాకిస్థాన్ బౌలింగ్‌ను చీల్చిచెండాడింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (58, 52 బంతుల్లో 10 ఫోర్లు), రోహిత్ శర్మ (56, 49 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సులు) అర్థ సెంచరీలు సాధించిన సంగతి తెలిసిందే.

శతక గర్జన :

ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత టాప్-4 బ్యాటర్లు విఫలమవగా.. తాజాగా సూపర్4 మ్యాచ్‌లో టాప్-4 బ్యాటర్లే విరుచుకుపడ్డారు. తొలుత ఓపెనర్లు రోహిత్, గిల్ 121 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. కొత్త బంతితో పాక్ పేస్ త్రయం షహీన్, నసీం, రవూఫ్‌లపై ఎదురుదాడి చేసిన ఓపెనర్లు 100 బంతుల్లోనే 121 పరుగులు జోడించి భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. స్వల్ప విరామంలో ఓపెనర్లు నిష్క్రమించినా, వరుణుడి అంతరాయంతో ఆదివారం రోజు ఆట సోమవారానికి వాయిదా పడినా.. విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ శతక తాండవం నుంచి పాకిస్థాన్ తప్పించుకోలేకపోయింది. తొలుత కోహ్లి ఆచితూచి ఆడగా.. కెఎల్ రాహుల్ కాస్త దూకుడు ప్రదర్శించాడు. సోమవారం ఆటలో కోహ్లి దూకుడుగా ఆడగా.. రాహుల్ నెమ్మదిగా పరుగులు సాధించాడు. రాహుల్ ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 60 బంతుల్లో అర్ధ సెంచరీ నమోదు చేయగా.. విరాట్ కోహ్లి నాలుగు ఫోర్లతో 55 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. ఫిఫ్టీ తర్వాత విరాట్ కోహ్లి గేర్ మార్చాడు. వేగంగా పరుగులు పిండుకున్నాడు. వికెట్ల మధ్య చురుగ్గా పరుగులు తీశాడు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 84 బంతుల్లోనే వన్డేల్లో కెరీర్ 47వ సెంచరీ నమోదు చేశాడు. ఇక వన్డేల్లో వేగంగా 13000 పరుగులు సాధించిన బ్యాటర్‌గా సైతం కోహ్లి రికార్డు నెలకొల్పాడు. మరో ఎండ్‌లో ఈ ఏడాది మే 1 తర్వాత తొలిసారి ఆడుతున్న కెఎల్ రాహుల్ రీ ఎంట్రీ ఘనంగా చాటాడు. పది ఫోర్లు, రెండు సిక్సర్లతో 100 బంతుల్లో 100 పరుగుల మైలురాయి చేరుకున్నాడు. పాక్ స్పిన్నర్లు, పేసర్లను దంచికొట్టిన ఈ జోడీ.. మూడో వికెట్‌కు అజేయంగా 233 పరుగులు జోడించింది. చివరి ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్ సంధించిన విరాట్ కోహ్లి భారత ఇన్నింగ్స్‌కు పర్‌ఫెక్ట్ ముగింపు అందించాడు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది (1/79), షాదాబ్ ఖాన్ (1/71) చెరో వికెట్ పడగొట్టారు.

కుల్దీప్ మాయ

357 పరుగుల ఛేదనలో పాక్ 128 పరుగులకే కుప్పకూలింది. ఇమామ్ (9) వికెట్‌తో బుమ్రా బ్రేక్ సాధించగా.. క్రమం తప్పకుండా పాక్ వికెట్లు చేజార్చుకుంది. బాబర్ (10), రిజ్వాన్ (2), సల్మాన్ (23), ఇఫ్తికార్ (23), షాదాబ్ ఖాన్ (6), ఫహీం (4), జమాన్ (27)లు తేలిపోయారు. కుల్దీప్ యాదవ్ మాయలో విలవిల్లాడిన పాక్ బ్యాటర్లు.. పోరాడకుండానే ఓటమికి సిద్ధపడ్డారు. 32 ఓవర్లలోనే లాంఛనం ముగించిన భారత్.. సూపర్4 దశలో ఘన విజయం సాధించింది.



విరాట పర్వం : వన్డేల్లో 47వ సెంచరీ బాదిన కోహ్లి (122).. వేగంగా 13000 పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు.

చీఫ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్

ఆసియాలో క్వార్టర్స్ నుంచి బరిలోకి..

ముంబయి : 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత మెన్స్ క్రికెట్ జట్టుకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. మహిళల జట్టుకు హృసికేశ్ కనిట్కర్ చీఫ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకోనున్నాడు. ఈ మేరకు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. మెన్స్ జట్టుకు సాయిరాజ్ బహుతులె, మునీశ్ బాలిలు బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లుగా ఉండగా.. రజిబ్ దత్తా, సుబాదీప్ ఘోష్‌లు మహిళల జట్టుకు బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు సేవలు అందించనున్నారు. ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్స్ నుంచి బరిలోకి దిగుతున్నాయి. ఐదు రోజుల వ్యవధిలోనే భారత జట్టు మూడు మ్యాచులు ఆడాల్సి ఉంటుంది!. మెన్స్ జట్టు అక్టోబర్ 3న క్వార్టర్స్‌లో, అక్టోబర్ 5న సెమీస్‌లో నెగ్గితే..అక్టోబర్ 7న ఫైనల్స్ ఆడనుంది. మహిళల జట్టు సెప్టెంబర్ 21న క్వార్టర్స్, 23న సెమీస్.. టైటిల్ పోరుకు చేరితే 25న ఫైనల్లో తలపడనుంది.



పేసర్ల వర్క్‌లోడ్ ఎలా?!

- నేడు శ్రీలంకతో భారత్ ఢీ
- మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-కొలంబో : ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే తొలిసారి భారత జట్టు వరుసగా మూడు రోజుల పాటు వైట్‌బాల్ ఫార్మాట్‌లో ఆడబోతుంది!. భారత్, పాకిస్థాన్ సూపర్ 4 సమరం రెండు రోజుల పాటు సాగగా.. మరుసటి రోజే శ్రీలంకతో సూపర్ 4 పోరుకు టీమ్ ఇండియా సిద్ధమైంది. విరామం లేకుండా వరుస వన్డే మ్యాచులతో.. భారత పేసర్ల పని భారంపై ఫోకస్ కనిపిస్తుంది. జస్‌ప్రీత్ బుమ్రా ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చాడు. దీంతో అతడిని వరుసగా రెండు మ్యాచుల్లో బరిలోకి నిలుపుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా స్థానంలో మహ్మద్ షమిని తుది జట్టులోకి తీసుకుంటారేమో చూడాలి. సిరాజ్‌కు సైతం విశ్రాంతి లభిస్తే..ప్రసిద్ కృష్ణకు అవకాశం లభించవచ్చు. బ్యాటింగ్ లైనప్‌లో టాప్-6 బ్యాటర్లు భీకర ఫామ్‌లో ఉన్నారు. రోహిత్, గిల్, విరాట్, రాహుల్, కిషన్, హార్దిక్‌లను నిలువరించటం శ్రీలంకకు నేడు కత్తి మీద సామే కానుంది. సూపర్4లో గత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలుపొందిన శ్రీలంక.. టైటిల్ ఫేవరేట్ భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

పుష్ప 2.. రిలీజ్ డేట్ ఫిక్స్



అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప' ది రైజ్.. ఎంతటి సంచలన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. 2021 బిగ్గెస్ట్ కమర్షియల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. అంతేకాదు అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలవడంతోపాటు.. తనకు జాతీయస్థాయి అవార్డు తెచ్చి పెట్టిన చిత్రంగానూ నిలిచింది. దీంతో దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'పుష్ప ద రూల్' చిత్రం పై భారీ అంచనాలు పెరిగాయి. ఎప్పుడెప్పుడు ఈ సినిమా విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు సోమవారం చిత్ర యూనిట్ గుడ్ న్యూస్ అందించింది. వచ్చే ఏడాది స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి నవీన్ ఎర్నేని, వై రవిశంకర్ నిర్మాతలు.

దీపావళి కానుకగా విడుదల



రాఘవ లారెన్స్

దర్శక, నిర్మాత కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్‌లో స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కార్తికేయన్ నిర్మిస్తున్న చిత్రం 'జిగర్ తండా డబుల్ ఎక్స్'. రాఘవ లారెన్స్, ఎస్.జె.సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హై యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను సోమవారం హీరో మహేష్‌బాబు రిలీజ్ చేయగా, తమిళ టీజర్‌ను ధనుష్, కన్నడ టీజర్‌ను రక్షిత్ శెట్టి, మలయాళ టీజర్‌ను దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేశారు. అన్ని భాషల్లో టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకునే పనిలో ఉంది. దీపావళికి సినిమాను రిలీజ్ చేయబోతున్నారు.



స్వాతి రెడ్డి

నవీన్ చంద్ర, స్వాతి రెడ్డి జంటగా నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై దీనిని నిర్మిస్తున్నారు. దీనికి సుమంత్ దామ సహ నిర్మాత, రఘువర్మ పేరూరి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

ఆ నిజం ధైర్యాన్నిస్తుంది

ఈ సినిమా అక్టోబర్ 6న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా స్వాతి రెడ్డి మాట్లాడుతూ, 'మాకు తెలిసిన నిజాన్ని ఇందులో నిజాయితీగా చెప్పాం. ఆ నిజం ధైర్యం ఇచ్చేలా ఉంటుంది' అని తెలిపారు.'మేము ఎంత ప్యాషనేట్‌గా తీశామో.. ప్రేక్షకులకు కూడా అంతే చక్కగా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు చెప్పారు.



ప్రేక్షకుల్ని నవ్వించే సినిమా

రవితేజ ప్రొడక్షన్ బ్యానర్ ఆర్‌టి టీమ్‌వర్క్స్ నుంచి వస్తున్న మరో కాన్సెప్ట్ బేస్డ్ చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. సతీష్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మిస్తున్నారు. కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటిస్తున్నారు. ఈనెల 15న వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ని లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ,'సతీష్ కథ చెబుతున్నపుడు దర్శకుడు పాత వంశీ గుర్తుకు వచ్చారు. అలాంటి హ్యూమర్, ఈస్ట్ గోదావరి వెటకారం, కథ ఇవన్నీ నాకు బాగా నచ్చాయి. మొదటి నుంచి సినిమా పై చాలా నమ్మకం ఉంది' అని తెలిపారు. 'రెండు గంటల సినిమాలో గంటన్నర ఖచ్చితంగా నవ్వుకుంటారు. ఫ్యామిలీతో పాటు చూసే క్లీన్ ఎంటర్ టైనర్ చేశాం' అని డైరెక్టర్ సతీష్ వర్మ చెప్పారు.

సామాన్యుడి పోరాటం

డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'పెదకాపు-1'. విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 29న విడుదల కానున్న నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను డైరెక్టర్ వివి వినాయక్, నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ లాంచ్ చేయగా, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి అతిథులుగా విచ్చేసి, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



విరాట్‌కర్ణ, ప్రగతి శ్రీ వాస్తవ

ఈ ఈవెంట్‌లో వివి వినాయక్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బావుంది. సినిమా అద్భుతంగా వుంటుంది. రవీందర్ రెడ్డి ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నారు' అని తెలిపారు. 'ఈ సినిమాకి ఓ మంచి ఉద్దేశంతో సామాన్యుడి సంతకం అని పెట్టాను. ఒక సామాన్యుడ్ని తెరమీద కొన్ని కోట్లమంది చూసుకొని, ఆ సామన్యుల తరపున నిలబడే ఒక పాత్రని మలిచినదే ఈ పెదకాపు1' అని దర్శకుడు అన్నారు.

డెవిల్‌లో నైషధ..

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ జోడీగా సంయుక్త నటిస్తోంది. సోమవారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రంలో సంయుక్త పోషించిన నైషధ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.
పాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను నవంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.
ఈ చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా కళ్యాణ్ రామ్ ఆకట్టుకోబోతున్నారు.



సంయుక్త

నవచిత్రం

సరికొత్త విశాల్‌ని చూస్తారు



విశాల్ హీరోగా, రీతూ వర్మ హీరోయిన్‌గా నటించిన చిత్రం'మార్క్ ఆంటోని'. పాన్ ఇండియా మూవీగా రూపొందిన ఈ సినిమాను మినీ స్టూడియో బ్యానర్‌పై అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్.వినోద్ కుమార్ నిర్మించారు. ఎస్.జె.సూర్య, సెల్వ రాఘవన్, సునీల్ ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈనెల 15న రిలీజ్ కాబోతోన్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.
హీరో నితిన్ మాట్లాడుతూ,' ఈ చిత్ర ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్ అన్నీ క్రేజీగా ఉన్నాయి. సినిమా కచ్చితంగా సక్సెస్ అవుతుంది. అధిక్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. విశాల్ ఈ మూవీతో మరో స్థాయికి వెళ్లాలి' అని తెలిపారు.
'నా కెరీర్‌లోనే ఇది భారీ బడ్జెట్ చిత్రం. వేణు ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. నన్ను నమ్మి ఈ సినిమాను తీసుకున్న నిర్మాత, డిస్ట్రిబ్యూటర్లందరికీ థ్యాంక్స్. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. అంతేకాదు ఆడియెన్స్ పెట్టే డబ్బులకు న్యాయం జరుగుతుంది. రెండున్నర గంటలు నవ్వుకునేలా సినిమా ఉంటుంది' అని హీరో విశాల్ చెప్పారు. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ, 'ఇది తండ్రీ కొడుకుల కథ. విశాల్ కెరీర్ బెస్ట్ పర్ఫామెన్స్ ఇచ్చారు. అంతేకాదు ఆయనలోని పరిపూర్ణమైన నటుడ్ని చూస్తారు' అని అన్నారు.

వాస్తవ కథతో..

దర్శకుడు పాలిక్ తాజాగా బియస్ ఆర్ కె క్రియేషన్స్, రావుల రమేష్ క్రియేషన్స్, పాలిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం-2 చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇవ్వగా, తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ కెమెరా స్విచాన్ చేశారు. టి.రామసత్య నారాయణ స్క్రిప్ట్ అందచేయగా దర్శకుడు, నటుడు గూడ రామకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రావుల రమేష్ మాట్లాడుతూ, 'ఇప్పటికే పాలిక్ దర్శకత్వంలో 'రౌద్ర రూపాయ నమః' చిత్రం నిర్మించాను. అక్టోబర్‌లో దీన్ని రిలీజ్ చేస్తాం. ఆయన దర్శకత్వంలోనే ఈ చిత్రం ప్రారంభించాం' అని అన్నారు. 'ములుగు, వరంగల్, అరకు ప్రాంతాల్లో షూట్ ప్లాన్ చేశాం' అని మరో నిర్మాత భోగి సుధాకర్ చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది 1960-1980 మధ్య తెలంగాణలో జరిగిన యథార్థ కథకు ఆధారంగా తెరకెక్కించే పీరియాడిక్ మూవీ. జాన్ భూషణ్ అద్భుతమైన ఆరు పాటలు అందించారు. దానికి సురేష్ గంగుల సాహిత్యాన్ని సమకూర్చారు. నాలుగు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తి చేస్తాం' అని తెలిపారు.



రఘు, అనుశ్రీ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815

బిజినెస్

అప్పు కట్టకుంటే తీహార్ జైలుకే..

- 22లోగా క్రెడిట్ సూస్సెకు రుణం చెల్లించాల్సిందే
- మీరు చచ్చినా బాధపడేది లేదు :

స్పైస్‌జెట్ ఛైర్మన్‌కు సుప్రీం తీవ్ర హెచ్చరిక



న్యూఢిల్లీ : విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ఛైర్మన్ అజయ్ సింగ్‌కు అత్యున్నత న్యాయస్థానం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. యూరోపియన్ బ్యాంక్ క్రెడిట్ సూస్సెకు ఈ నెల 22లోగా 5,00,000 డాలర్ల వాయిదా మొత్తం సహా డిఫాల్ట్ అయినా 10 లక్షల డాలర్లు (రెండూ కలిపి దాదాపు రూ.12 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. లేదంటే తీహార్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. "క్రెడిట్ సూస్సె వద్ద తీసుకున్న రుణం చెల్లించకుంటే మేం తదుపరి తీవ్రమైన చర్య తీసుకోవాల్సి ఉంటుంది. మీరు సంస్థను మూసేసినా మాకు ఆందోళన లేదు. ఈ దాగుడు మూతల వ్యవహారం ఇక చాలు. మీరు షరతులకు కట్టు బడి ఉండాల్సిందే. మీరు ఒకవేళ చనిపోయిన మేం బాధపడం.. ఇది చాలా తీవ్రమైన అంశం. ఇకపై జరిగే ప్రతీ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది.' అని అజయ్ సింగ్‌ను ఉద్దేశించి ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

2015 నుంచి క్రెడిట్ సూస్సె, స్పైస్‌జెట్ మధ్య న్యాయ వివాదం కొనసాగుతోంది. స్పైస్‌జెట్ తమకు 24 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 200 కోట్లు) బకాయిలు చెల్లించాల్సి ఉందని క్రెడిట్ సూస్సె ప్రకటిం చింది. దీనిపై మద్రాస్ హైకోర్టును ఆ బ్యాంక్ ఆశ్రయించింది. 2021లో స్పైస్ జెట్ సంస్థను మూసేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ స్పైస్‌జెట్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు చర్చించుకుని పరిష్కారానికి రావాలని సూచించింది. కాగా.. గతేడాది ఆగస్టులో ఇరు పక్షాలు వివాద పరిష్కారానికి అంగీకారానికి వచ్చినట్లు సుప్రీంకోర్టుకు తెలిపాయి. అయినప్పటికీ ఇరు పక్షాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కూడా స్పైస్‌జెట్ బకాయిలు చెల్లించలేదు. స్పైస్‌జెట్ నిర్లక్ష్య తీరుపై ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ సూస్సె సుప్రీంకోర్టును ఆశ్రయించి.. కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారించిన సుప్రీం బెంచ్.. అజయ్ సింగ్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. తిరిగి ఈ కేసును సెప్టెంబర్ 22న విచారించనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం

- ప్రచారకర్తగా ఎన్‌టిఆర్ నియామకం :

గ్రీన్‌ప్లై సిఇఒ వెల్లడి

హైదరాబాద్ : భారత సంఘటిత ప్లైవుడ్ మార్కెట్‌లో 25-30 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నామని గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్ జాయింట్ ఎండి, సిఇఒ మనోజ్ తుల్సియన్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నటుడు జూనియర్ ఎన్‌టిఆర్‌ను తమ ప్రచారకర్తగా నియమించుకున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో సంఘటిత, అసంఘటిత ప్లైవుడ్ మార్కెట్ ప్రతీ ఏడాది దాదాపు రూ.32వేల కోట్ల విలువ కలిగి ఉందన్నారు. గతేడాది రూ.1800 కోట్ల రెవెన్యూ సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2వేల కోట్ల టర్నోవర్ అంచనా వేస్తున్నామన్నారు. వినియోగదారులు మొత్తం ఇంటీరియర్ డిజైన్‌లో ప్రస్తుతం 75 శాతం ఫర్నీచర్‌కే వ్యయం చేస్తున్నారన్నారు.

14నుంచి జాగల్ ఐపిఒ

- ధరల శ్రేణీ రూ.156-164

హైదరాబాద్ : ఫిన్‌టెక్ సంస్థ జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వస్తోంది. ఈ నెల 14న ఇష్యూ ప్రారంభమై.. 18తో ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ సెప్టెంబర్ 13న ప్రారంభమవుతుంది. సోమవారం వర్చ్యువల్‌గా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ఎండి, సిఇఒ అవినాష్ రమేష్ గొడ్‌ఖిండి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాజ్ పి నారాయణమ్, సిఎఫ్ఒ ఆదిత్యా కుమార్ గ్రంధి మాట్లాడుతూ.. ఐపిఒ వివరాలను వెల్లడించారు. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.392 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఇష్యూలో 1.04 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనుంది. కంపెనీ ప్రమోటర్లు రాజ్ పి నారాయణమ్, అవినాష్ రమేష్ గోడ్‌ఖిండిలు సహా ఇందులో వాటాలు కలిగిన పలు సంస్థలు తమ వాటాలను విక్రయిస్తున్నారు. ఈ ఇష్యూలో కనిష్టంగా 90 ఈక్విటీ షేర్లు, ఆ తర్వాత 90 ఈక్విటీ షేర్ల గుణిజాలలో బిడ్లు వేయడానికి వీలుందని ఆ వర్గాలు తెలిపాయి.


సాయుధ దళాల కోసం మానవరహిత యుజివి అభివృద్ధి

- స్టార్టప్ అరోబోట్ వెల్లడి



హైదరాబాద్ : ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ తయారీలో ఉన్న రఘువంశీ గ్రూప్, పార్ ఈస్ట్‌ల భాగస్వామ్యంలోని స్టార్టప్ సంస్థ అరోబోట్ కొత్తగా సాయుధ దళాల కోసం మానవరహిత గైడెడ్ వెహికిల్ (యుజివి)ను అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. ఇది సైన్యానికి రవాణా, నిఘా, క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు, ఉపరితలాల్లో ఎంతో సహాయపడుతుందని పేర్కొంది. ఇది 200 కిలోల వరకు బరువును 30 డిగ్రీల వ్యూతో లక్ష్యాన్ని నిర్దేశించుకోగలదు. దీనికి అదనపు ఎటాచ్‌మెంట్లు పెడితే ఇంకా అనేక ఇతర విధులను కూడా చేయగలదని ఆ సంస్థ తెలిపింది. "డిజిటలైజేషన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్ రంగాల్లో మా స్టార్టప్ దూసుకెళ్తోంది. అత్యాధునిక పరిష్కారాల ను అందించడం ద్వారా, ఆధునిక యుగంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన సాధనాలతో పరిశ్రమలను శక్తివంతం చేయాలని అరోబోట్ యోచిస్తోంది" అని అరోబోట్ సహ వ్యవస్థాపకుడు, సిఇఒ రవి ఆచంట తెలిపారు. వచ్చే ఏడాదిలోగా కొత్తగా 100 మంది ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. "రఘువంశీ గ్రూపులో మా విలువైన వినియోగదారులకు వినూత్న సాంకేతిక పరిష్కారాలను అందించడానికి మాకు ఎనలేని నిబద్ధత ఉంది. మిస్సైల్ సిస్టమ్స్, ఎలక్ట్రో ఆప్టిక్స్, జెట్ ఇంజిన్లు, లోయిటరింగ్ మారణాయుధాలు, డ్రోన్లు, మరెన్నో రంగాలలో అత్యాధునిక ఉత్పత్తులను అభివద్ధి చేయడానికి మాకు వీలు కల్పించే అన్ని ప్రధాన తయారీ డొమైన్లలో అంతర్గత నైపుణ్యాన్ని కలిగి ఉన్న కొన్ని సంస్థలలో మేము ఉండటం నిజంగా గర్వకారణం" అని రఘువంశీ గ్రూపు ఎండి వంశీ వికాస్ పేర్కొన్నారు.

క్యాంపస్ నియామకాల్లో 'డెలివరూ'



హైదరాబాద్: యూనివర్సిటీల్లో క్యాంపస్ నియామకాలు చేపడుతున్నామని గ్లోబల్ ఫుడ్ డెలివరీ కంపెనీ డెలివరూ తెలిపింది. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుండి విద్యార్థులను ఉద్యోగాలలో నియమించుకునే లక్ష్యంతో ప్రత్యేక క్యాంపెయిన్‌ను చేపడుతున్నామని పేర్కొంది. హైదరాబాద్‌లో ఉన్న తమ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పని చేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని డెలివరూ ఇండియా వైస్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్ శశి సోమవరపు తెలిపారు. ఇందుకోసం ఐఐటి హైదరాబాద్, ఎన్ఐటి వరంగల్, చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ (సిబిఐటి), వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తదితర విద్యాసంస్థల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు చేపట్టాలని యోచించామన్నారు.

జమిలి ఎన్నికలు ఎందుకో...!?

రాజకీయ లబ్ధి కోసమేనంటున్న ప్రపంచ దేశాల అనుభవాలు



న్యూఢిల్లీ : 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన బీజేపీ మేనిఫెస్టోలో చేర్చిన జమిలి ఎన్నికల ఆలోచనకు కార్యరూపం ఇవ్వడానికి ప్రధాని నరేంద్ర మోడీ సిద్ధపడ్డారు. అందులో భాగంగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక సంస్థలకు, రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన సిఫార్సులు చేస్తుంది. ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయంపై కంటితుడుపు చర్యగా ఏర్పాటు చేసిన కమిటీకి మాజీ రాష్ట్రపతి నేతృత్వం వహించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. కోవింద్ 1991లో బీజేపీలో చేరారు. పరంభ్‌లో పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన ఇంటిని ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌కు విరాళంగా ఇచ్చారు. ప్రధాని మోడీ అభీష్టం మేరకే రాష్ట్రపతి అయ్యారు. అలాంటి వ్యక్తి ఇచ్చే నివేదిక ఎలా ఉంటుందో ఊహించడం కష్టమేమీ కాదు.

జమిలి ఎన్నికలపై 2015లోనే మోడీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నుండి సిఫార్సులు అందుకున్నారు. అయితే ఆ కమిటీ దేశంలో రెండు దశలుగా ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. దీనికి ఎన్నికల కమిషన్ కూడా అంగీకారం తెలిపింది. అయితే ఇప్పుడు కేంద్రం మూడు స్థాయిలలోనూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తోంది.

రాజకీయ అస్థిరతలతో...

వాస్తవానికి దేశంలో లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు గతంలో ఒకేసారి ఎన్నికలు జరిగేవి. అయితే 1971లో ఈ ఆనవాయితీకి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ స్వస్తి పలికారు. పార్టీలో అసంతృప్తులను తటస్థం చేసేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే 1989-1996 మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రాభవం మసకబారింది. ప్రతిపక్షాల కూడా సైద్ధాంతిక విభేదాలతో కలసికట్టుగా వ్యవహరించలేకపోయాయి. 1977-80, 1989-90, 1996-99 కాలంలో దేశంలో రాజకీయ అస్థిరత ఏర్పడింది. 1994-2014 మధ్యకాలంలో రెండు ప్రధాన కూటములు ఏర్పడి, సంకీర్ణ భాగస్వామ్య పక్షాలుగా దేశాన్ని పాలించాయి. 2014, 2019 ఎన్నికలలో బీజేపీకి, ఎన్డీఏ కూటమికి మూడింట రెండు వంతుల మెజారిటీ లభించడంతో కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారింది. మిగిలిన ప్రతిపక్షాల బలం మూడో స్థానానికే పరిమితమైంది.

మరుగున పడిన ప్రతిపాదన

ఇక రాష్ట్రాల విషయానికి వస్తే 1967 ఎన్నికల నుండే అస్థిరమైన సంకీర్ణ ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేకపోయాయి. 1971 వరకూ రాష్ట్రాలలో తరచూ మధ్యంతర ఎన్నికలు జరిగాయి. నాలుగో లోక్‌సభను కూడా రద్దు చేసి మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు. దీంతో జమిలి ఎన్నికల ఆలోచనే మరుగున పడింది. 1972లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 18 రాష్ట్రాల శాసనసభలను రద్దు చేసి, తిరిగి ఎన్నికలు జరిపారు. 1975-76లో లోక్‌సభ పదవీకాలాన్ని సంవత్సరం పాటు పొడిగించడం, 1978లో రాష్ట్రాల శాసనసభలను మొరార్జీ దేశాయ్ రద్దు చేయడం, 1980లో తిరిగి ఇందిరా గాంధీ అధికారంలోకి రావడం వంటి పరిణామాలతో జమిలి ఎన్నికల వ్యవహారం పూర్తిగా వెనక్కి పోయింది. 1989 నుండి దేశంలో ఎన్నికల కోలాహలం బాగా పెరిగిపోయింది. అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించి బలాన్ని పెంచుకున్నాయి. పార్లమెంట్ ఎన్నికలలోనూ సత్తా చాటాయి. అంతిమంగా జాతీయ కూటములలో చేరి, ఉనికిని ప్రదర్శించాయి.

దేశంలో ఏదో ఓ ప్రాంతంలో ఎప్పుడూ ఎన్నికలు జరగడం నిత్యకృత్యంగా మారిపోయింది. అది ఓ నిరంతర ప్రక్రియ అయింది. ఈ దశలో లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న లక్ష్యాన్ని సాధించడానికి సమగ్ర రాజకీయ, సంస్థాగత, ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని 1999లో లా కమిషన్ తన 170వ నివేదికలో సూచించింది.

ఎందుకీ హడావిడి ?

అయితే ప్రధాని మోడీ, బీజేపీ పార్టీలు ఎందుకింత హడావిడిగా జమిలి ఎన్నికలకు తహతహలాడుతున్నాయి? మన దేశంతో పాటు ఇతర దేశాలలో ఎదురైన కొన్ని అనుభవాలు ఈ ప్రశ్నకు సమాధానాలు అందిస్తాయి. బ్రిటన్, బ్రెజిల్, అర్జెంటీనా, కెనడా, జర్మనీ, అమెరికా, యూరప్ దేశాలలో జమిలి ఎన్నికలు జరిగినప్పుడు జాతీయ స్థాయిలోనూ, ప్రాంతీయ స్థాయిలోనూ ఒకే రకమైన ఫలితాలు వచ్చాయి. 2000వ సంవత్సరంలో ఉక్రెయిన్‌లో మాత్రం పరస్పర విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి.

మధ్యాహ్న భోజన నిధులు వెంటనే విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి నిధులు విడుదల చేయడంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అనుచిత వైఖరిని ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ విమర్శించింది. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ ప్రకటన విడుదల చేశారు. "మధ్యాహ్న భోజన పథకం కేంద్ర కార్యక్రమంగా అమలవుతోంది. నిబంధనల ప్రకారం ఆహార ధాన్యాలు, నిర్వహణ వ్యయంలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందించాలి. అయితే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అసమంజసమైన వాదన లను ఉటంకిస్తూ చెల్లింపులను నిలిపివేస్తోంది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వాలను సంక్షోభంలోకి నెట్టివేస్తోంది. 2021-22 సంవత్సరానికి సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదు" అని పేర్కొన్నారు.

"మధ్యాహ్న భోజన పథకం దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక ముఖ్యమైన పథకం. దేశంలోని సామాన్య ప్రజలకు విద్యను అందించడంలో కూడా ఈ పథకం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మధ్యాహ్న భోజన పథకాన్ని ధ్వంసం చేయడంతో మోడీ ప్రభుత్వం వారిని విద్యారంగం నుంచి బయటకు నెట్టే ప్రయత్నం చేస్తోంది" అని విమర్శించారు.

"అన్ని రాష్ట్రాలకు మధ్యాహ్న భోజన నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. దేశంలోని ప్రగతిశీల విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐ ప్రభుత్వ విద్యా వ్యవస్థను రక్షించడానికి కట్టుబడి ఉందని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాం.

మోడీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై తమ విధ్వంసక కార్యక్రమాలతో ముందుకు వెళుతుంటే, దేశంలోని ఐక్య విద్యార్థి ఉద్యమం నుండి భారీ ప్రతిఘటనను ఎదుర్కోవల్సి వస్తుంది. దీని కోసం దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ చొరవ తీసుకుంటుంది" అని పేర్కొన్నారు.



సౌదీ యువరాజు సల్మాన్‌తో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ : భారత్ పర్యటనలో ఉన్న సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌తో సోమవారం ప్రధాని మోడీ భేటీ అయ్యారు. వాణిజ్య, ఆర్థిక, రక్షణ రంగాలతోపాటు సాంస్కృతిక సహకారం వంటి ప్రధాన అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన వ్యూహాత్మక భాగస్వామ్య మండలి మొదటి సమావేశానికి ఇరువురు నేతలు అధ్యక్షత వహించారు. 2019లో రియాద్‌లో భారత్, సౌదీ అరేబియాల మధ్య జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక ఒప్పందంపై ఇరు దేశాలు సంతకం చేసిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా భారత్‌ను అత్యంత సన్నిహిత, వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా భావిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఆ ప్రాంత, ప్రపంచ సంక్షేమం, స్థిరత్వం కోసం ఇరుదేశాల భాగస్వామ్యం కీలకమని అన్నారు. నేటి సమావేశం తమ బంధానికి కొత్త కోణాన్ని ఇచ్చిందని, మానవజాతి కోసం పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సౌదీ యువరాజు సల్మాన్ భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి.

అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కడప ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా పడింది. సుప్రీంకోర్టులో సోమవారం అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు కేసు విచారణ జరిగింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా వేయాలని సుప్రీంను వైఎస్ వివేకా కూతురు సునీతా రెడ్డి కోరారు. దీంతో ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణను సుప్రీంకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది. వివేకా హత్య కేసులో ఎ8 అవినాష్‌కి మే 31న తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో సునీతా రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. తన తండ్రి హత్యకు ప్రధాన సూత్రధారి అవినాష్ రెడ్డి అని కేసు దర్యాప్తుకి సహకరించకుండా తప్పించు కుంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో సిబిఐ అఫిడవిట్ దాఖలు చేసింది.

వివేకా హత్యకు భాస్కర్ రెడ్డి, అవినాష్ రెడ్డి కుట్ర చేశారని అఫిడవిట్‌లో సిబిఐ పేర్కొంది. రాజకీయ వైరంతోనే వివేకా హత్య జరిగిందని సిబిఐ స్పష్టం చేసింది. గుండెపోటు అంటూ కట్టుకథ అల్లారని పేర్కొంది. అవినాష్ రెడ్డి పాత్రపై ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని సిబిఐ వెల్లడించింది.

వివేకా వెంట కారులో ప్రయాణిస్తూనే గంగిరెడ్డి.. నిందితుడు సునీల్‌కి ఫోన్ చేసినట్లు పేర్కొంది. ఆ సమయంలో అవినాష్ రెడ్డి ఇంట్లోనే సునీల్ యాదవ్ ఉన్నాడని స్పష్టం చేసింది. వివేకా హత్యకు అవినాష్ రెడ్డి , భాస్కర్ రెడ్డిలే సూత్రదారులు అనడానికి అన్ని ఆధారాలు ఉన్నాయని అఫిడవిట్‌లో సిబిఐ పేర్కొంది.

వియత్నాం నేతలతో బైడెన్ భేటీ

- సంబంధాల మెరుగుదలకు అంగీకారం

హనోయ్ : శాంతి, సహకారం, సుస్థిర అభివృద్ధి కోసం తమ సంబంధాలను మరింత మెరుగుపరచుకోవాలని వియ త్నాం, అమెరికా అంగీకరించాయి. రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదివారం హనోయ్ చేరుకున్నారు. అక్కడ వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నుగుయెన్ ఫూ ట్రాంగ్‌తో ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. ఏళ్ళ తరబడి ఇరు దేశాల సంబంధాల్లో నెలకొన్న సానుకూల అభివృద్ధి పట్ల ఇరువురు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. వియత్నాం - అమెరికా సంబంధా లను నిర్వచించే మార్గదర్శక సూత్రాలను పూర్తిగా గౌరవించా ల్సిన అవసరం వుందని వారు తెలిపారు. . ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి ఇది అత్యంత కీలకమైన అంశమని అన్నారు. ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని, అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఇరు పక్షాలు గౌరవించా లని పేర్కొన్నారు.

కర్నాటకలో ప్రయివేట్ వాహన యజమానుల సమ్మె విరమణ



బెంగళూరు : కర్నాటకలో సోమవారం ప్రయివేట్ వాహన యజమానులు నిర్వహించ తలపెట్టిన ఒక రోజు సమ్మెను మధ్యాహ్నానికే విరమించారు. వాహన యజమానుల సమస్యలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తీసుకెళ్తామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ఇచ్చిన హామీ మేరకు యజమానులు ఈ సమ్మెను విరమించారు. 36 ప్రయివేట్ వాహన యజమానుల సంఘాలతో ఏర్పడిన ఫెడరేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. ఫ్రీడం పార్క్ వద్ద ఆందోళన చేస్తున్న వాహన యజమానుల వద్దకు మంత్రి రామలింగ రెడ్డి చేరుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇలాంటి ప్రయివేట్ వాహన యజమానుల కోసం ఒక కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆటోలు, ట్యాక్సీలు, ఎయిర్‌పోర్ట్ ట్యాక్సీలు, మిక్సీ క్యాబ్స్, సరుకు రవాణా వాహనాలు, పాఠశాలల వాహనాలు, స్టేజ్ క్యారియర్లు, కాంట్రాక్ట్ క్యారియర్లు వంటి ప్రయివేట్ వాహన యజమానులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఇలాంటి వాహనాలు రాష్ట్రంలో సుమారు 10 లక్షల వరకూ ఉంటాయని అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన శక్తి స్కీమ్‌ను రద్దు చేయాలని ప్రయివేట్ వాహన యజమానులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని యాప్ ఆధారిత రవాణా సేవలను పూర్తిగా నిషేధించాలని, ప్రతి డ్రైవర్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం చేయాలని, తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించాలని కోరారు. ముంబయి నుంచి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న భారత క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే ప్రయివేట్ వాహనాలు అందుబాట్లో లేక బెంగళూరు మెట్రోపాలిటన్ రవాణా కార్పొరేషన్ బస్సులో తన నివాసానికి వెళ్లారు. ఆ ఫోటోను అనిల్‌కుంబ్లే ట్వీట్ చేశారు.

గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి ఊరట

- హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే
- ప్రతివాదులకు నోటీసులు.. కౌంటర్ దాఖలకు ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టులో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోమవారం సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించారని కృష్ణ మోహన్ రెడ్డిని అనర్హుడిగా హైకోర్టు ప్రకటించింది. అంతేకాదు డికె అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే హైకోర్టు తీర్పుపై కృష్ణ మోహన్ రెడ్డి సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్త నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే ఇప్పటికే డికె అరుణను ఎమ్మెల్యేగా గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కేసులో సుప్రీంకోర్టులో డికె అరుణ కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు.

చిలీ సైనిక కుట్రకు అర్ధ శతాబ్దం !

- అమెరికా సాయంతోనే అంతా

శాంటియాగో : చిలీ సోషలిస్టు నేత సాల్వడార్ అలెండె నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అమెరికా కూలదోసి, సైనిక పాలన విధించి ఇప్పటికి అర్ధ శతాబ్దం గడిచింది. ఆనాటి సైనిక కుట్రకు, అలెండె హత్యకు అమెరికా మద్దతు వుందని వెల్లడిస్తూ కొద్ది రోజుల క్రితమే ఒక నివేదిక వెలువడింది. ఆనాటి కుట్రలో ఆచూకీ తెలియకుండా పోయిన వారికోసం గాలింపు జరిపేందుకు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఒక ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అలెండె ప్రభుత్వాన్ని అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు అమెరికా చాలా ప్రయత్నించింది. అందులో విజయం సాధించలేకపోయింది. 1973 సెప్టెంబరు 11న సైన్యం, జనరల్ అగస్టో పినొచెట్ సాయంతో ప్రభుత్వాన్ని కూలదోసింది. ఇక ఆ తర్వాత నుంచి 17ఏళ్ల పాటు పినొచెట్ నేతృత్వంలో అణచివేత పాలన సాగింది. అమెరికాతో పొత్తు పెట్టుకుంది. ఈ 17ఏళ్ల కాలంలో మూడు వేల మందికి పైగా గల్లంతయ్యారు. 38వేల మంది రాజకీయ ఖైదీలుగా మారారు. వారిలో చాలా మంది వేధింపుల బాధితులే. కుట్ర రోజున, అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సిఐఎ అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు పంపిన నివేదికను విడుదల చేశారు. 'గత మూడేళ్లుగా అధ్యక్షుడు, విదేశాంగ మంత్రి హెన్నీ కిస్సింగర్ ప్రోత్సహిస్తూ వచ్చిన సైనిక కుట్ర ఇప్పటికి జయప్రదంగా పూర్తయింది' అని ఆ నివేదిక పేర్కొంది.

రైతన్నకు నష్టం



- అమెరికన్ యాపిల్స్‌పై దిగుమతి సుంకం కోత వద్దు
- తప్పుబట్టిన రైతు సంఘాలు

న్యూఢిల్లీ: భారత్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ పర్యటనకు ముందు అమెరికా బాదం, యాపిల్స్, వాల్‌నట్‌లు, పప్పులపై దిగుమతి సుంకాలు తగ్గించిన అంశంపై రైతు సంఘాలు తీవ్రంగా స్పందించాయి. కేంద్రం నిర్ణయం ప్రకారం.. వాషింగ్టన్ యాపిల్స్‌పై దిగుమతి సుంకాలను 35 శాతం నుంచి 15 శాతానికి తగ్గింది. కనీస మద్దతుపై కొనుగోళ్లు లేకపోవడంతో ఇప్పటికే వాతావరణ మార్పు, బహిరంగ మార్కెట్‌లో దోపిడీ ధరల కష్టాలతో పోరాడుతున్న తరుణంలో యాపిల్స్, మసూర్ పప్పుపై దిగుమతి సుంకాలు తగ్గించడం వారి జీవితాలపై విపత్కర ప్రభావాన్ని చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. "వాతావరణం అనుకూలంగా ఉంటే నేను కొంత లాభం పొందవచ్చు. గత సీజన్‌లో క్వింటాల్‌కు రూ.3,200 చొప్పున విక్రయించాను. ఇక్కడ ఎంఎస్‌పీ సేకరణ లేదు. ధరలు మరింత తగ్గితే మనం ఎలా బతకాలి?" అని మధ్యప్రదేశ్‌కు చెందిన రైతు సురేంద్ర సింగ్ వాపోయారు. యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సోహన్ ఠాకూర్ మాట్లాడుతూ.. దిగుమతి సుంకం తగ్గింపు యొక్క తక్షణ ప్రభావం భారత మార్కెట్లో చౌకైన వాషింగ్టన్ ఆపిల్‌లను డంప్ చేయడానికి దారితీస్తుందని అన్నారు. "భారత మార్కెట్‌లో దాదాపు రూ. 6,000 కోట్ల వరకు యాపిల్స్‌ను డంప్ చేస్తారని మా అంచనా. హిమాచల్ ప్రదేశ్ రైతులు ప్రతి సంవత్సరం ఇంత విలువైన యాపిల్స్‌ను ఉత్పత్తి చేస్తారు"అని ఆయన అన్నారు.

వాషింగ్టన్ యాపిల్ పెంపకందారులు అసాధారణమైన రాయితీలను పొందుతారని ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అమెరికన్ యాపిల్ పెంపకందారులు తక్కువ ధరలకు ఉత్పత్తులను విక్రయించటమూ మంచి లాభాలను ఆర్జించ డానికి ప్రధాన కారణమని తెలిపారు. "అమెరికన్ యాపిల్ పెంపకందారులు ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 32 శాతం రాయితీలను పొందుతున్నారని డేటా సూచిస్తున్నది. అయితే భారతీయ యాపిల్ పెంపకందారులు వరుసగా ప్రభుత్వాల ఉదాసీనతను నిరంతరం చూస్తున్నారు. 1991లో మేము ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు వంటి వివిధ విషయాలపై మొత్తం 9 శాతం సబ్సిడీలను పొందాము. ఇది 2023లో 2.5 శాతానికి తగ్గింది" అని ఠాకూర్ అన్నారు.భారతదేశంలో 10 లక్షల కుటుంబాలు తమ తోటల్లో యాపిల్ పండిస్తున్నాయని ఠాకూర్ చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లో మూడు లక్షల కుటుంబాలు, జమ్మూ కాశ్మీర్‌లో ఏడు లక్షల కుటుంబాలు యాపిల్ సాగుపై ఆధారపడి ఉన్నాయని ఆయన చెప్పారు. యునైటెడ్ స్టేట్స్‌లోని వార్తా కథనాలను నిశితంగా పరిశీలిస్తే.. కేవలం 1,400 మంది యాపిల్ పెంపకందా రులు మాత్రమే భారతదేశం నుంచి వ్యాపార భాగాన్ని తీసుకుంటారని సూచిస్తున్నారు.

ఇంకా కొనసాగుతున్న మృతుల గుర్తింపు

వాషింగ్టన్ : అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి ఘటనకు సోమవారానికి 22 ఏండ్లు పూర్తయ్యాయి. 2001 సెప్టెంబర్ 11న హైజాక్ చేసిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానాలతో ట్విన్ టవర్స్‌ను అల్‌ఖైదా కూల్చివేసింది. ఆ రోజు ఉదయం 8:46 గంటలకు ఒక విమానం సెంటర్‌లోని నార్త్ టవర్‌పైనా, రెండో విమానం 9:03 గంటలకు సౌత్ టవర్‌పైనా దాడి చేశాయి. తరువాత మూడో విమానం ఉదయం 9:37 గంటలకు వర్జీనియాలోని పెంటగాన్ సమీపంలో ఆర్లింగ్టన్ వద్ద కూలిపోయింది. నాల్గో విమానం యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 93 తన గమ్యస్థానం చేరుకోకుండా ప్రయాణికులతో నిరోధించబడింది. ఈ 9/11 దాడుల్లో మూడు వేల మందికిపైగా చనిపోయారు. ఈ దాడికి ఒసామా బిన్ లాడెన్ ప్రధాన సూత్రధారి అని అమెరికా ప్రకటించింది.





వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక గోస పడుతున్నారు. పనులు పూర్తిచేసి నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి వాటికి సంబంధించి బిల్లులు విడుదల రావడం లేదు. ఫలితంగా అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టిన గుత్తేదారులు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. అప్పులకు వడ్డీలు పెరగడం.. కిందిస్థాయి సిబ్బందికి సైతం సకాలంలో జీతాలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితమూ కనిపించడం లేదు. తాజాగా గ్రామాల్లో పనులు చేపట్టిన మిషన్ భగీరథ (ఇంట్రవర్క్స్) గుత్తేదారులు జడ్పీ కార్యాలయం ఎదుట బిల్లులు చెల్లించాలని ఆందోళన చేపట్టడం చర్చనీయాంశమైంది. రెండేండ్లుగా ఎదురుచూస్తున్నా నయాపైసా విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పలు శాఖల్లో పనులు చేపట్టిన వారి పరిస్థితి కూడా ఇదే మాదిరి ఉండటం గమనార్హం.

బిల్లులు రాక అప్పులు తీరక..!

ఏండ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు

- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు
- పలు చోట్ల నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- నిధుల విడుదలపై దృష్టిసారించని ప్రభుత్వం
- తాజాగా మిషన్ భగీరథ గుత్తేదారుల నిరసన

నవతెలంగాణ-
ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టిన చిన్న చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ఎంతో కొంత ప్రయోజనం కోసం పనులు దక్కించుకుంటున్న గుత్తేదారులు ఫలితం లేకపోగా అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది. ఇది వరకు సర్పంచులు ఎదుర్కొన్న సమస్య మాదిరిగానే.. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టిన చిన్న చిన్న గుత్తేదారుల పరిస్థితి దయనీయంగా మారింది. 2 నుంచి 3 శాతానికి వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టామని అంటున్నారు. 2021లో పూర్తి చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే సుమారు రూ.30కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం.

మిగతా శాఖలదీ ఇదే పరిస్థితి..!

మిషన్ భగీరథలో పనులు చేసిన కాంట్రాక్టుల మాదిరే.. మిగతా శాఖల్లోనూ కనిపిస్తోంది. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సుమారు రూ.9.50కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. భూసేకరణ, ఎస్‌డీఎఫ్ నిధులు సుమారు రూ.40కోట్లు, డబుల్ బెడ్‌రూంలకు సంబంధించిన నిధులు మరో రూ.10కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని అధికారవర్గాలు అంటున్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనూ కిందటి జూన్ నుంచి సుమారు రూ.6కోట్ల వరకు బిల్లులు రావాలని ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు మన ఊరు- మన బడి పనులకు సంబంధించి మరమ్మతులు, విద్యుద్దీకరణ తదితర పనులకు సంబంధించి రూ.4.26కోట్లు, ఉపాధి హామీ నిధుల ద్వారా చేపడుతున్న పనులకు సంబంధించి మరో రూ.3కోట్ల వరకు గత మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోనూ పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్, సీఎం అష్యూరెన్స్‌కు సంబంధించి సుమారు రూ.20కోట్ల వరకు బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇలా పలు శాఖలకు బిల్లులు సకాలంలో రాకపోవడం మూలంగా వాటి పరిధిలో అభివృద్ధి పనులు మందగిస్తున్నాయి.

మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

మిషన్ భగీరథ కింద గ్రామాల్లో ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాం. అదనపు పనులకు సంబంధించి మూడేండ్ల నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా.. మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టాం. బిల్లులు రాకపోవడం మూలంగా వడ్డీల మీద వడ్డీలు కడుతూ మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వం స్పందించి త్వరగా బిల్లులు విడుదల చేయాలి.



కల్యాణ్, మిషన్ భగీరథ గుత్తేదారు

సంక్షోభంలో రబ్బరు పరిశ్రమ

- నయా ఉదారవాద విధానాలే కారణం
- జాతీయ సెమినార్‌లో వక్తల విమర్శ

తిరువనంతపురం : నయా ఉదారవాద విధానాల అమలు కారణంగా దేశంలో రబ్బరు పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని తిరువనంతపురంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సెమినార్ అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల కారణంగా చౌకబారు సింథటిక్ రబ్బరు దేశంలోకి పెద్ద ఎత్తున దిగుమతి అయిందని, దీంతో చిన్నకారు రైతులు నష్టాలలో కూరుకుపోయారని, గత మూడు దశాబ్దాలుగా ధరలు పడిపోయాయని తెలిపింది. పుచ్చలపల్లి సుందరయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెమినార్‌కు రైతులు, కార్మికులు, వ్యాపారులు, రైతు నేతలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరయ్యారు. రబ్బరు పరిశ్రమపై దేశంలో సవివరమైన చర్చ జరగడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో రబ్బరు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పంట దిగుబడి తగ్గడం, చెట్లు పక్వానికి రావడంలో ఆలస్యం జరగడం, కార్పొరేట్ సంస్థల పెత్తనం, టైర్ల కంపెనీలు కుమ్మక్కై ధరలు తగ్గించడం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. రబ్బరు పరిశ్రమను కార్పొరేటీకరించడం మానుకొని సహకారం దిశగా ముందుకు తీసికెళ్లాలని, దీనివల్ల ఉత్పత్తిదారులు, వినియోగదారులు లబ్ది పొందుతారని సెమినార్ సూచించింది. రబ్బరు ధరలు పడిపోతున్నప్పటికీ కనీస మద్దతు ధరను నిర్ణయించేందుకు కేంద్రం నిరాకరిస్తోంది. వాణిజ్య ఒప్పందాలను సాకుగా చూపి రబ్బరు దిగుమతులపై ఆంక్షలు విధించడం లేదు. మరోవైపు దేశంలో పేరెన్నికగన్న అపోలో టైర్స్ లిమిటెడ్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, సియట్ లిమిటెడ్, జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బిర్లా టైర్స్ లిమిటెడ్ కుమ్మక్కై రబ్బరు ధరలను తగ్గించాయి. దీనిపై స్పందించిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆ కంపెనీలకు రూ.1,788 కోట్ల జరిమానా విధించింది. సెమినార్‌ను ప్రారంభించిన రాష్ట్ర ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ మట్లాడుతూ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ జోక్యం కారణంగానే రబ్బరు రైతులకు స్థిరమైన ధరలు లభిస్తున్నాయని చెప్పారు.ప్రభుత్వ విధానాల కారణంగానే చిన్నకారు రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ తెలిపారు. దశాబ్దం క్రితం రూ.240గా ఉన్న కిలో రబ్బరు ధర ఇప్పుడు రూ.120కి పడిపోయిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పుడు విధానాలే ఈ దుస్థితికి కారణమని చెప్పారు.

వైసీపీ కార్యకర్తల్లా ఏపీ పోలీసుల తీరు

- కుట్రతోనే చంద్రబాబుపై కేసు
- ఎన్టీఆర్‌భవన్‌లో టీడీపీ శ్రేణుల నిరసన దీక్ష



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్షను కొనసాగించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లరిబ్బన్ ధరించారు. ఏపీ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించారని విమర్శించారు. చంద్రబాబును అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిన నేపథ్యంలో 13మంది అభిమానులు గుండె ఆగి మరణించారని చెప్పారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, పి.అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఒకవైపు ప్రజలకు భరోసా ఇస్తూ చంద్రబాబు, మరో వైపు పాదయాత్ర చేస్తూ నారా లోకేష్ ప్రజలలో తిరుగుతున్న నేపథ్యమే కంటగింపుగా మారిందని అన్నారు. దీంతోనే వారికి ఆటంకాలు సష్టిస్తూ..రాళ్లు రువ్వడం వంటి వికత చేష్టలకు వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని విమర్శించారు. చంద్రబాబు నంద్యాలలో బస్సులో నిద్రిస్తుండగా, నిద్రలేపి కొన్ని గంటల పాటు రకరకాలుగా అవమానించారని విమర్శించారు. పోలీసు అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పోలీసులు వైసీపీ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో రాజ్యాంగం అపహాస్యం పాలైందని అభిప్రాయపడ్డారు. వికత పరిపాలన చేస్తున్న జగన్‌కు ఏపీ ప్రజలు తొందరలోనే బుద్ధిచెబుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఆది, సోమవారాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్షలను చేపట్టారని చెప్పారు. ఆదివారం చంద్రబాబు, భువనేశ్వరి వివాహం రోజున అక్రమ కేసులు పెట్టి మానసిక వేదనకు గురిచేసిన జగన్‌కు తప్పకుండా ఆ పాపం తగులుతుందని అన్నారు. జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు , జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి బి. జ్యోత్స్న, జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సామ భూపాల్ రెడ్డి, బండి పుల్లయ్య, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, పి.చంద్రయ్య, టీజీకే మూర్తి, ప్రధాన కార్యదర్శులు ఎ.కె. గంగాధర్, అజ్మీర రాజునాయక్, జక్కలి ఐలయ్య యాదవ్, గడ్డి పద్మావతి, జీవీజీ నాయుడు, షేక్ ఆరీఫ్, అధికార ప్రతినిధులు మ్యాడం రామేశ్వరరావు, ముప్పిడి గోపల్, తెలుగు మహిళ అధ్యక్షుఆలు భవనం షకిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడలపై రాజకీయం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వాల్ పోస్టర్ వార్

ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వాల్‌పోస్టర్ల వార్ మొదలైంది. ఇరుపార్టీలు పోటాపోటీగా వాల్‌రైటింగ్స్ ప్రచారం మొదలుపెట్టాయి. విచ్చలవిడిగా స్టిక్కింగ్ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఎన్నికలకు ముందు నుంచే ఇరుపార్టీలు హెూరాహెూరీగా ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. గోడలపై ఉన్న కాంగ్రెస్ వాటర్ పెయింట్‌లను చెరిపి వేసి 'గులాబీ' రంగులను పులుముతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది మూడు రంగులను తొలగించి వెళ్లగానే గులాబీ కార్యకర్తలు అదేస్థానంలో మంత్రి పువ్వాడ అజయ్ పేరుతో ఫ్లెక్సీలను స్టిక్ చేస్తున్నారు. కానీ వీటి జోలికి కార్పొరేషన్ సిబ్బంది వెళ్లకపోవడం గమనార్హం. నగరంలోని పలు డివిజన్‌లలో నాలుగైదు రోజులుగా ఇదో తంతుగా కొనసాగుతోంది.

- మూడు రంగులపై గులాబీ రంగులు
- ఎన్నికలకు ముందే హెూరాహెూరీ ప్రచారం
- తమ పెయింటింగ్‌లను అధికారపార్టీ చేరిపేయిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపణ
- సోషల్‌మీడియాపైనే ప్రధాన పార్టీల దృష్టి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మంలో చేసిన పలు అభివృద్ధి పనుల దృశ్యాలతో కూడిన స్టిక్కింగ్ ఫ్లెక్సీలను బీఆర్ఎస్ రూపొందించింది. 'మన ఖమ్మం.. మన అజయన్న' పేరుతో తయారు చేసిన ఈ పోస్టర్లను ఇటీవల అతికిస్తోంది. అభివృద్ధి పేరుతో రూపొందించిన ఈ ఫ్లెక్సీల జోలికి కార్పొరేషన్ సిబ్బంది వెళ్లడం లేదు. కాంగ్రెస్ వాటర్ పెయింట్‌లను మాత్రం తొలగిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి దృశ్యాలు ఉన్నాయి కాబట్టి గులాబీ ఫ్లెక్సీలను తొలగించడం లేదని నగరపాలక సంస్థ సిబ్బంది చెబుతున్నారు. కానీ కాంగ్రెస్ నేతలు దీన్ని తప్పుబడుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడుతున్నారు.

పురపాలక మంత్రి మాటలు పెడచెవిన..

ఖమ్మంలోని 40, 42తో పాటు పలు డివిజన్లు, ఉమ్మడి జిల్లాలోని వివిధ మున్సిపాల్టీలు, పలు ప్రాంతాల్లో వేసిన కాంగ్రెస్ వాటర్ పెయింటింగ్స్‌ను తొలగించి, గులాబీ వినయిల్ (ఫ్లెక్సీ స్టిక్కర్ల)ను వేస్తున్నారు. ఈ విషయమై ఆయా ప్రాంతాల్లో ఇరు గ్రూపుల మధ్య వివాదం నడుస్తోంది. పరస్పరం దూషించుకుంటున్నారు. అధికారం ఉందనే ఇలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

మున్సిపల్ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫెక్సీలు, ప్లాస్టిక్ విషయంలో నెలకొంటున్న కాలుష్యంపై పురపాలకమంత్రి కేటీఆర్ మాటలను కూడా కార్పొరేషన్ సిబ్బందితో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పెడచెవిన పెడుతున్నాయని కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

ప్రచార సామగ్రికి భారీగా ఖర్చు..

ప్రచార సామగ్రికి ఆయా పార్టీలు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. అభ్యర్థులు ఎవరికి వారుగా సోషల్ మీడియా నిర్వహణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. కొందరు ఏకంగా ఫ్లెక్సీ మిషన్‌లను సైతం కొనుగోలు చేసి, సిబ్బందిని ఏర్పాటు చేసుకుని ప్రింటింగ్ వేయిస్తున్నారు. ప్రధాన మీడియా కన్నా కూడా సోషల్ మీడియాపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, షేర్‌చాట్ రీల్స్ తయారు చేయించి మరీ చక్కర్లు కొట్టిస్తున్నారు.

ప్రత్యర్థి వైఫల్యాలను ఎండగట్టే రీతిలో ఆసక్తికరమైన మీమ్స్‌ను సైతం రూపొందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో లోపాలపై విపక్షాలు దృష్టి సారిస్తుండగా.. విపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు విస్మరించిన అభివృద్ధి పనుల దృశ్యాలను నాడు- నేడుగా అధికారపక్షం ప్రచారం చేస్తున్నది. గడప గడపకు కాంగ్రెస్ రూపంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం చేసుకుంటున్నారు. అలాగే, ఈ తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రచారం నిర్వహిస్తోంది. కాగా, ఇప్పటి నుంచే ప్రధాన పార్టీలు పడుతున్న ఈ ప్రయాసలపై జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్ అక్బర్

-కె.వి.అబ్దుల్ నాజర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్‌గా అక్బర్ ట్రావెల్స్ మారిందని ఆ కంపెనీ సీఎండీ కె.వి.అబ్దుల్ నాజర్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకరంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న క్రమంలో హైదరాబాద్ లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాజర్ మాట్లాడుతూ సబ్ ఏజెంట్లు, ఎయిర్ లైన్స్ సహకారం, పరస్పర నమ్మకమే తమ అభివృద్ధికి కారణమని తెలిపారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా కళాకారులు ఆటపాటలతో అలరించారు. లక్కీ డ్రా



నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్బర్ ట్రావెల్స్ కంపెనీ జనరల్ మేనేజర్ అనితా సింగ్, హెచ్‌ఆర్ హెడ్ శ్రుతి, సీఎఫ్ఓ రాజేంద్ర, అక్బర్ ట్రావెల్స్.కామ్ సీఈవో నిఖిల్ హాజరయ్యారు.

నల్లగొండ ప్రభుత్వఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కెమికల్ రియాక్షన్‌తో మంటలు
- పసి పిల్లలతో బయటకు పరుగులు తీసిన బాలింతలు, గర్భిణీలు
- కిటికీ అద్దాలను ధ్వంసం చేసి పొగను బయటికి పంపిన ఫైర్ సిబ్బంది
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ కర్ణన్

నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 7.30 గంటల సమయంలో పసిపిల్లల వార్డులోని స్టోర్‌రూం నుంచి ఒక్కసారిగా మంటలు, పొగ రావడంతో బాలింతలు, గర్భిణీలు బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా పొగ కమ్ముకుంది. పేషెంట్లు, బంధువులు, కుటుంబ సభ్యులు పసిపిల్లలను చేతులతో ఎత్తుకుని బయటకు వెళ్లారు. ఫైర్ సిబ్బంది కిటికీ అద్దాలను ధ్వంసం చేసి పొగను బయటికి పంపించారు.అగ్నిప్రమాదం కెమికల్ రియాక్షన్ వల్లే జరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చు నాయక్ తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందీ జరగలేదని, సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పేసినట్టు చెప్పారు. అగ్ని ప్రమాదంతో సుమారు



రూ.80 వేల నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అందులో బిల్డింగ్, గ్లాస్, ఫర్నీచర్, ల్యాబ్, యాసిడ్ ఫినాయిల్ టిన్స్, బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు, శానిటైజర్, శానిటేషన్ సామాగ్రి కాలిపోయాయి. ఆస్పత్రి మాతా శిశు కేంద్రం సబ్ స్టోర్ రూంలో మంటలు వచ్చిన విషయం తెలియగానే కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిని సందర్శించి మాతా శిశు కేంద్రం సబ్ స్టోర్ రూంను పరిశీలించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగ లేదని, ఆస్పత్రి, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి కిటికీలను పగల గొట్టి పొగ బయటికి పోయేలా చేసి.. మంటలను ఆర్పేశారని సూపరింటెండెంట్ వివరించారు. బాత్రూం క్లీన్ చేసే సల్ఫ్యూరిక్ ఆసిడ్ ద్రావణంలో బ్లీచింగ్ పౌడర్ కలవడం వల్లే ప్రమాదం జరిగినట్టు కలెక్టర్‌కు చెప్పారు.

అదనపు ఓపీలు ప్రారంభించాలి.

మాతా శిశు కేంద్రంలో ఓపీలో పెద్ద ఎత్తున మహిళలు లైన్‌లో ఉండటాన్ని చూసిన కలెక్టర్.. అదనంగా రెండు మూడు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డా.లచ్చు నాయక్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కొండల్‌రావు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర టీడీపీపై చంద్రబాబు అరెస్ట్ ప్రభావం

- బస్సు యాత్ర అనుమానమే ?
- ఆలస్యం కానున్న అభ్యర్థుల ప్రకటన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంతో తెలంగాణ టీడీపీ ఎన్నికల సన్నాహాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల కోసం పార్టీని సమాయత్తం చేస్తున్న తరుణంలో బాబును జైలుకు పంపడంతో పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురవుతున్నాయి. తెలంగాణలో ఒంటరిగానే ఎన్నికలగోదాలోకి దిగుతామని జాతీయ నేత చంద్రబాబు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ బృందానికి ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక విషయంలో రాష్ట్ర పార్టీ తుది నిర్ణయానికి వచ్చింది. అత్యధికంగా బీసీలకు టిక్కెట్లిచ్చే విధానంతో ముందుకుసాగుతున్నది. బీఆర్ఎస్ తొలి జాబితా ప్రకటించిన తర్వాత, ఆ వెంటనే టీడీపీది వస్తుందని అందరూ అనుకున్నారు. రాజకీయ వర్గాల్లోనూ అదే చర్చ జరిగింది. ఆమేరకు చంద్రబాబును కలిసి పార్టీ నాయకత్వం అభ్యర్థుల జాబితాను అందించింది. అలాగే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్ని పార్లీమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపట్టనున్నట్టు ఇంతకుముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే చంద్రబాబు సమయం తీసుకుని ముందుకు పోవాలని సూచించారు. ముందుగా అభ్యర్థులను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు తనకు సమర్పించిన అభ్యర్థుల జాబితాను స్క్రూటీని చేసేందుకు ప్రత్యేకంగా కమిటీ వేశారు. కాసాని జ్ఞానేశ్వర్‌తోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ కంభంపాటి రామ్మోహన్‌రావు, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, బక్కని నర్సింహులు, సీనియర్ నేతలు కాశినాథ్, నన్నూరి నర్సిరెడ్డి తదితరులతో మూడు వారాల క్రితమే ఈ కమిటీని నియమించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ బస్సుయాత్ర చేపట్టాలని భావించారు. అయితే స్కిల్ డెవలప్‌మెంటు కేసులో చంద్రబాబు అరెస్ట్ కావడంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. ఒకవైపు బస్సుయాత్ర జరుగుతుందా ? లేదా ? అనే అనుమానాలు వ్యక్తమవుతుండగా, మరోవైపు అభ్యర్థుల ప్రకటనా ఆలస్యమయ్యే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆ పార్టీ పరిస్థితిపై ఒకింత ఆసక్తి నెలకొంది. కాగా చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే, వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతామని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. వెంటనే అభ్యర్థులను ప్రకటించి బస్సుయాత్రకు శ్రీకారం చుట్టాలనే ఆలోచనతోనే కాసాని జ్ఞానేశ్వర్ ఉన్నట్టు ఆపార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. చంద్రబాబు రాజమండ్రి జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చేవరకు ఇతర కార్యక్రమాలు పెట్టుకునే పరిస్థితులు లేవని వారూ లేకపోలేదు.

హైకోర్టు జడ్జి కారు పల్టీ

- జస్టిస్ వడ్డిబోయిన సుజాతకు గాయాలు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ వెళుతుండగా సూర్యాపేట - కోదాడ మధ్య గుంపుల వద్ద కారు అదుపుతప్పి పల్టీకొట్టింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కారులో చికుక్కున్న వారిని బయటకు తీశారు. జస్టిస్ సుజాత తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్సులో ఆమెను సూర్యాపేటలోని న్యూ సిగ్మా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక మంత్రి జగదీష్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నల్గొండ, సూర్యాపేట ఎస్పీలను ఆదేశించారు.

నేడు, రేపు తేలికపాటి, మోస్తరు వానలు

- 14, 15 తేదీల్లో పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మంగళ, బుధ వారాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందనీ, 14,15 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, ములుగు జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేశారు. సోమవారం రాత్రి 10:00 గంటల వరకు రాష్ట్రంలో 35ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ఆరు చోట్ల మోస్తరు వాన పడగా..మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సర్వాయిపేటలో అత్యధికంగా 3.58 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

కామాఖ్య దేవాలయంలో కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అస్సాం రాష్ట్రం గౌహతిలోని కామాఖ్య దేవాలయాన్ని సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సందర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కోరుకున్నానని తెలిపారు. దేవాలయంలో అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. నాలుగైదేండ్ల క్రితం తానిక్కడికి వచ్చాననీ, మరోసారి దర్శనానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థుల సస్పెండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన 10 మంది సీనియర్ విద్యార్థులను ఏడాది పాటు కాలేజీ హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. ఇటీవల కాలంలో ర్యాగింగ్ సంబంధించిన సంఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

కఠిన చర్యలతోనే ర్యాగింగ్ ఆలోచనలు కలిగిన సీనియర్లను కట్టడి చేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

బాలుడి చావుకు కారకులపై చర్యలు తీసుకోండి

-నల్లగొండ డీఎంహెచ్ఓకు టీఎస్ఎంసీ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హై డోస్ ఇంజెక్షన్ ఇచ్చినందున బాలుడు మరణించిన ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) చైర్మెన్ వి.రాజలింగం ఆదేశించారు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలో శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో నల్లవెల్లి క్రిష్ణ అనే ప్రయివేటు వైద్యుడు ఇచ్చిన హై డోస్ ఇంజెక్షన్ కారణంగా జస్వంత్ (13) మరణించినట్టు వచ్చిన వార్తా కథనాలను సుమోటోగా టీఎస్ఎంసీ స్వీకరించింది. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి : వికాస్‌రాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించేదుకు చర్యలు తీసుకోవాలని డీఈవోలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై ఫారం6,7,8 తోపాటు, పెండింగ్‌లో ఉన్న తాజా స్థితిని సమీక్షించారు. 80 ఏండ్లపైబడిన వారితోపాటు, థర్డ్‌జెండర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఈపీఐసీ కార్డుల తయారీ, ముద్రణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సున్నితమైన ప్రాంతాలను, నియోజక వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశాలు తరచుగా నిర్వహించాలని ఆదేశించారు. అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ లోకేష్ కుమార్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్ , జిల్లాల ఎన్నికల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.